అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 13-9-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 204 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50

రాజద్రోహం పిటిషన్లు రాజ్యాంగ ధర్మాసనానికి..



న్యూఢిల్లీ : వలసపాలన నాటి రాజద్రోహం (ఐపీసీ 124ఏ సెక్షన్) రాజ్యాంగబద్ధతను సవాల్ చేసూ్త దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీంకోర్టు మంగళవారం సిఫారసు చేసింది. కనీసం ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసులను విచారిస్తుందని తెలిపింది. ప్రస్తుతం ...11లో

భారత్‌లో మానవ హక్కుల పరిస్థితి ఆందోళనకరం!



- మైనారిటీ హక్కుల పరిరక్షణకు రెట్టింపు కృషి చేయాలి :ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ పిలుపు

2లో..


యూసీసీకి వ్యతిరేకంగా తీర్మానించనున్న నాగాలాండ్



కోహిమా : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని నాగాలాండ్‌లోని అన్ని పార్టీలూ వ్యతిరేకించాయి. దీనిపై శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించాలని నిర్ణయించాయి. నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన కుజోలిజో నైనూ శాసనసభలో సోమవారం దీనిపై చర్చను ప్రారంభించారు. భిన్న

11లో..


పార్లమెంట్ సిబ్బందికి కొత్త డ్రెస్ కోడ్



న్యూఢిల్లీ : కొత్త పార్లమెంట్ భవనంలో తొలి సమావేశాలు వచ్చే వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ అమృతకాల్‌లో కొత్త అంశం చోటుచేసుకోనున్నది. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

2లో..

రిమాండ్ అన్యాయం



హైకోర్టులో చంద్రబాబు

- నేడు విచారణ
- బాబు భద్రతపై భయంగా ఉంది : ములాఖత్ అనంతరం భువనేశ్వరి

అమరావతి : ఏపీ సిల్క్ డెవలప్‌మెంట్ సంస్థ(ఏపీఎస్-ఎస్డీసీ) నిధుల దుర్వినియోగం కేసులో ఏసీబీ కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర పిటిషన్‌గా విచారణ చేపట్టాలని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. దీంతో బుధవారం విచారణ నిర్వహిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు. ఆమేరకు సీఐడీ సహా ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేశారు. పిటిషన్‌లో రాజకీయ కక్షతో తనపై తప్పుడు కేసు బనాయించారని పేర్కొన్నారు. 'అవినీతి నిరోధక చట్టం (సవరణ)లోని సెక్షన్ 17ఏ ప్రకారం పిటిషనర్ చంద్రబాబు పబ్లిక్ సర్వెంట్ కాబట్టి కేసు నమోదు చేయాలంటే గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. కేసు నమోదు, విచారణకు గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఆ విధంగా సిఐడి చేయలేదు. నిజానికి ఈ కేసు ఎంపి, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టు పరిధిలోకి వస్తుంది.' అని పేర్కొన్నారు. '2021 డిసెంబర్ 09న నమోదు చేసిన ఈకేసులో 22నెలలు గడిచాక తీరుబడిగా కావాలనే అరెస్టు చేసింది. కేసులో కావాలని ఇరికించింది. రాజకీయ ప్రతీకారంతో కేసులోకి ఇరికించారు. సిఎం ప్రోద్బలంతోనే కేసు పెట్టారు. గతంలో తీవ్రవాదుల దాడి నుంచి బయటపడ్డాను. ప్రాణాలకు హాని ఉందనే కేంద్రం జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చింది. రాజకీయ ...2లో

శాంతి భద్రతల సమస్య రాకూడదు : ఏపీ సీఎం



రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. లండన్ పర్యటన అనంతరం మంగళవారం ఉదయం ఆయన తాడేపల్లి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ తదితరులు స్వాగతం పలికారు. క్యాంపు కార్యాలయానికి చేరుకున్న అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై సిఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ చీఫ్ రామాంజనేయులు, ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులతో జగన్మోహన్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రాకూడదని తెలిపారు.

మంత్రులకూ తెలవదట!



ఇక ప్రతిపక్షాల మొర ఆలకించేదెవరు?

- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై గందరగోళం
- మితిమీరిన గోప్యత పాటిస్తున్న మోడీ, షా సర్కార్

'పాత పార్లమెంట్ భవనానికి వీడ్కోలు పలకడానికేనా?'... పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల గురించి రెండు రోజుల క్రితం ఓ పత్రిక ప్రచురించిన వార్త శీర్షిక ఇది. ఇది చూడడానికి హాస్యాస్పదంగానే ఉన్నప్పటికీ అసలు ఐదు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలను ఎందుకు నిర్వహిస్తున్నారో తెలిసింది చాలా కొద్ది మందికి మాత్రమే. చివరికి క్యాబినెట్ మంత్రులకు కూడా విషయమేమిటో తెలియదట. మోడీ ప్రభుత్వం అంత గోప్యంగా వ్యవహారాన్ని నడుపుతోంది.



న్యూఢిల్లీ : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల గురించి తొలుత ఆగస్ట్ 31న ప్రకటన వెలువడింది. వర్షాకాల సమావేశాలు ముగిసింది ఆగస్ట్ 11వ తేదీనే. అలాంటప్పుడు మరోసారి ఇంత త్వరగా ఉభయసభలను సమావేశపరచాల్సిన అవసరం ఏమొచ్చిందన్న విషయంపై ఊహాగానాలు మొదలయ్యాయి. పైగా శీతాకాల సమావేశాలు నవంబర్‌లో ప్రారంభం కావాల్సి ఉంది. కొందరేమో దేశం పేరును ఇండియా నుంచి భారత్‌కు మార్చేందుకే ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. పేరు మార్పులో ఎలాంటి తప్పిదం లేదని మంత్రులు కూడా ఢంకా బజాయించి మరీ చెప్పారు. మరికొందరేమో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికేనని అంటున్నారు. వాస్తవానికి ఈ బిల్లును 2008లోనే రాజ్యసభ ఆమోదించింది. అయితే ఈ బిల్లుకు తగిన మద్దతు లభించకపోవడం, మహిళల కేటగిరీలో వెనుకబడిన వర్గాలకు ఉప-రిజర్వేషన్లకు సంబంధించి డిమాండ్లు రావడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఒకవేళ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికే ...11లో

సమిష్టి బాధ్యతకు తూట్లు

ప్రభుత్వ ఉద్దేశమేమిటో ఎవరికీ తెలియదు. పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య వ్యవస్థలో సమిష్టి బాధ్యతకు ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. కానీ మోడీ ప్రభుత్వం దానిని విస్మరించింది. కనీసం క్యాబినెట్ సహచరులకు కూడా దేనిపైనా సమాచారం ఉండడం లేదు. రహస్యాలు, ప్రధాన నిర్ణయాల గురించి క్యాబినెట్‌కు ముందుగా తెలియజేయకపోవడం మున్ముందు కూడా కొనసాగవచ్చు. అందుకే ప్రత్యేక సమావేశాలపై ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. కేబినెట్‌కు కూడా ఏమీ తెలియదంటే ప్రత్యేక సమావేశాలలో దేనిపై చర్చిస్తారు? దేనిని ఆమోదిస్తారు? అంతా అయోమయమే. ఇక ప్రతిపక్షాల మొర ఆలకించేదెవరు?

రెండ్రోజుల్లో ఆర్టీసీ బిల్లుకు ఆమోదం

జేఏసీ నేతలతో గవర్నర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు రెండ్రోజుల్లో ఆమోదం తెలుపుతానని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. ప్రభుత్వం నుంచి ఈ బిల్లు రాజ్‌భవన్‌కు మూడు రోజుల క్రితం వచ్చిందనీ, తాను రాష్ట్రానికి ఈ రోజే వచ్చినందున పరిశీలన చేసి, ఆమోదిస్తానని తెలిపారు. మంగళవారం రాజ్‌భవన్‌లో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ తాను ఆర్టీసీ కార్మికుల పక్షానే ఉంటానని చెప్పారనీ, వారికి అన్యాయం జరగొద్దనే ఉద్దేశ్యంతోనే న్యాయసలహా కోసం బిల్లును పంపినట్టు చెప్పారని జేఏసీ చైర్మెన్ అశ్వత్థామరెడ్డి తెలిపారు. గతంలో ఆర్టీసీ విలీన బిల్లును గవర్నర్ ఆమోదించలేదని ...11లో

అంగన్వాడీ కేంద్రాలుగా మినీ అంగన్వాడీలు

3,989 కేంద్రాలు అప్‌గ్రేడ్

- టీచర్లకు ఉద్యోగ్య విరమణ సమయంలో లక్ష రూపాయల సహాయం
- హెల్పర్లకు రూ.50 వేలు
- పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం
- సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి సత్యవతి రాథోడ్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఉద్యోగ విరమణ సమయంలో అంగన్వాడీ టీచర్లకు ...11లో

కౌలు రైతులను గుర్తించాల్సిందే...

పంట పండించడం కంటే అమ్ముకోవడమే కష్టమైపోతోంది

- 'దున్నేవాడిదే భూమి' అంటూ కమ్యూనిస్టులు నినదించారు
- రైతు స్వరాజ్యవేదిక నిర్వహించిన బహిరంగ విచారణలో వక్తలు...





నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పంటను పండించడం కంటే దాన్ని అమ్ముకోవడమే కౌలురైతులకు కష్టమైపోతోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వ్యవసాయంపై మమకారంతో కష్టపడి పంట పండిస్తున్న కౌలు రైతులను ప్రభుత్వ గుర్తించడం లేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో కౌలు రైతు చట్టం (2011)లో తెచ్చినప్పటికీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. కౌలు రైతులకు ఉన్న గుర్తింపు కార్డులకు విలువలేకుండా పోయిందన్నారు. పంటనష్టపోయినా, కౌలు రైతు మరణించినా ఎలాంటి సాయం అందడం లేదని తెలిపారు. కౌలురైతులపై పెట్టుబడి భారంతోపాటు కౌలు భారం అదనంగా పడుతోందని తెలిపారు. బ్యాంకు రుణాలు అందక ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ' రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కౌలు రైతు సమస్యలపై బహిరంగ విచారణ' చేపట్టారు. దీనికి జ్యూరీ సభ్యులుగా రైతు ఉద్యమ నేత యోగేంద్రయాదవ్, కవిత కురుగంటి, సజయ, టి గోపాల్‌రావు వ్యవహరించారు. కౌలు రైతులు సలాం సోమ్‌జీ (ఆదిలాబాద్), కరువ మంజుల (వికారాబాద్), కొప్పుల అలివేలు (నల్లగొండ), సిలివేరి సదానందం(కరీంనగర్), నకిరేకంటి సైదులు (యోగి) (సూర్యాపేట), మోతె మమత (యాదాద్రి భువనగిరి), ముండాల రాజేందర్ (ఆదిలాబాద్).వెన్న రాధ (సిద్దిపేట), యాస నర్సయ్య (జయశంకర్ భూపాలపల్లి), మెస్రం మారుతి (మంచిర్యాల) తదితరులు తమతమ అనుభవాలను, ఆవేదనలు వినిపించారు. కౌలు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి ఆసామీ బ్యాంకు ఖాతాపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు మాట్లాడుతూ కౌలు రైతు సమస్యలు ...11లో



మళ్లీ మాదే అధికారం

- మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీయే అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మూడో సారి కేసీఆర్ సీఎం కాబోతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు బెదిరించి, మెడలు వంచి కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లుతాయని హెచ్చరించాకే ఆ పార్టీ తెలంగాణ ఇచ్చిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. అంతే గానీ సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందంటే అన్యాయంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చింది...బ్రిటీష్ వారని ఆ దేశ ప్రధాని రిషి సునక్ ...11లో

కేటీఆర్‌కు రాజకీయ నాలెడ్జ్ లేదు

అన్న అమిత్‌షాను కలవగానే చెల్లి లిక్కర్ కేసు ఆగింది

- దమ్ముంటే దానం, తలసానిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయండి : ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మంత్రి కేటీఆర్‌కు రాజకీయాలపై నాలెడ్జ్ ఉందనుకున్నా...మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడిన తర్వాత ఆయనకు ఏమీ తెలియదని నాకు అర్థమైందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ అదరణ కోల్పోయిందనడం సిగ్గు చేటన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్‌కు రాజకీయాలపై అనుభవం లేదన్నారు. బానిసత్వ పార్టీ ఎవరిదో తెలుస్తోందన్నారు. మంత్రి కేటీఆర్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసిన తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ కేసు ఆగిపోయిందని చెప్పారు. 'మా చెల్లిని అరెస్ట్ చేయకండి. ఎన్నికలు ఎప్పుడైనా పెట్టుకోండి' అంటూ కేటీఆర్ అమిత్ షాకు చెప్పారని ఆరోపించారు. కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల డిక్లరేషన్ ఏమయింది? దళిత బంధు, బీసీ బంధులో అక్రమాలపై కోర్టుకు వెళ్తానన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే ఆయన్ను బండ బూతులు తిట్టిన ఎమ్మెల్యే దానం నాగేందర్, మంత్రి ...11లో



కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

- 103 మంది విద్యార్థులకు అస్వస్థత
- ఈ ఏడాదిలో రెండుసార్లు.. అయినా నిర్లక్ష్యం వీడని అధికారులు

నవతెలంగాణ-భీంగల్

నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణ కేంద్రంలోని కుప్పల్ రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 103 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారికి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ...11లో



రైతు వ్యతిరేక ప్రభుత్వాలపై పోరు

- అస్సాం ఎస్ కె ఎం సమావేశంలో హన్నన్ మొల్లా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతు వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుకు సిద్ధం కావాలని ఎఐకెఎస్ నేత హన్నన్ మొల్లా పిలుపు ఇచ్చారు. కనీస మద్దతు ధర, రుణమాఫీ, పంటల బీమా వంటి సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మంగళవారం అస్సాంలోని గౌహతిలో ప్రగ్జ్యోతి కల్చరల్ ఆడిటోరియంలో రాష్ట్ర ఎస్ కె ఎం కన్వెన్షన్ జరిగింది. రాష్ట్రంలోని 10 రైతు సంఘాలు సంయుక్తంగా ఈ కన్వెన్షన్ ను నిర్వహించాయి. వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

రాష్ట్రంలోనే అతిపెద్ద ఉమ్మడి కిసాన్ సదస్సు జరిగింది. 10 మంది సభ్యులతో అధ్యక్ష వర్గం ఏర్పాటు చేశారు. బాలేంద్ర సైకియా ప్రధాన తీర్మానం చేశారు. ఎస్ కె ఎం సెంటర్ తరపున హన్నన్ మొల్లా కీలక ప్రసంగం చేశారు. ఎఐకెఎస్ (అజయ్ కుమార్) నేత అతుల్ కుమార్ అంజన్, ఎఐకెఎం నేత సుదామ ప్రసాద్ తో పాటు వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మద్దతు తెలిపారు. రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరై పోరాటానికి ఎస్ కె ఎం నిర్ణయాలను అస్సాంలో అమలుకు ఆమోదించారు.

పార్లమెంట్ సిబ్బందికి కొత్త డ్రెస్ కోడ్

(మొదటిపేజీ తరువాయి)

గత ఆగస్టు 31న ప్రకటించారు. లోక్‌సభ, రాజ్యసభ సిబ్బందికి ఇంతవరకూ అమలు చేస్తున్న డ్రెస్‌కోడ్ స్థానే కొత్త డ్రెస్ కోడ్‌ను ఈ సమావేశాల్లో అమల్లోకి తెస్తున్నారు. 'ఇండియన్ టచ్'తో ఈ డ్రెస్ కోడ్ ఉండబోతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఉద్యోగుల యూనిఫాంగా రౌండ్ నెక్ ఉన్న చొక్కాలు, ఖాకీ కలర్ ప్యాంటులు ఉండబోతున్నాయి. మణిపూర్ టోపీ, షర్ట్‌పై ధరించేందుకు స్లీవ్‌లెస్ జాకెట్లు ఉంటాయి. ఈ కాస్ట్యూమ్‌లను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ డిజైన్ చేసింది. మార్షల్స్ కోసం సఫారీ సూట్‌లకు బదులుగా క్రీమ్ కలర్ కుర్తా, పైజమాలు రెడీ చేశారు. పార్లమెంటరీ డ్యూటీ గ్రూప్‌కు కూడా కొత్త డ్రెస్ కోడ్ తీసుకువచ్చే వీలుందని తెలుస్తోంది. మహిళా ఉద్యోగుల కోసం కొత్త డిజైన్ చీరలు సిద్ధం చేశారు.

రిమాండ్ అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యర్థులు కూడా అంతమొందించేందుకు కుట్ర చేస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సెక్యూరిటీ లేకుండా జైల్లో ఉంచకూడదు. సెక్యూరిటీకి దూరం చేస్తే ప్రత్యర్థులను టార్గెట్ చేయవచ్చునని అధికారపార్టీ చీఫ్‌కు ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రాజమండ్రి సెంట్రల్ జైల్లో కాకుండా హౌస్ అరెస్ట్‌కు అనుమతి ఇవ్వాలన్న వినతిని కూడా ఏసీబీ కోర్టు తిరస్కరించడం అన్యాయం. అరెస్టు కూడా ఏకపక్షంగా చట్ట వ్యతిరేకంగా జరిగింది.' అని పిటిషన్‌లో తెలిపారు.

'అనేక విషయాలను కింది కోర్టు విస్మరించింది. ఏసీబీ యాక్ట్‌లోని 13(1)(సి)(డి) ప్రకారం నేరపూరిత దుష్ప్రవర్తను పాల్పడినట్లుగా ఆధారాలు సీఐడీ చూపలేదు. సెక్షన్ 17 ప్రకారం గవర్నర్ నుంచి అనుమతి పొందిన తర్వాతే కేసు నమోదు/విచారణ చేయాలన్న నిబంధన ఉల్లంఘన జరిగింది. ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని 2021లో సుప్రీం కోర్టు తీర్పు కూడా చెప్పింది.

ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ చేయాల్సిన కేసును ఏసీబీ కోర్టు విచారణ చేసేందుకు వీల్లేదు. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐ ఆర్, దాని ఆధారంగా ఏసీబీ కోర్టు రిమాండ్ విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేయండి. హైకోర్టులో పిటిషన్‌పై విచారణ ముగిసే వరకు ఏసీబీ కోర్టు విచారణను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వండి' అని చంద్రబాబు పిటిషన్‌లో కోరారు.

బాబు భద్రతపై భయంగా ఉంది : ములాఖత్ అనంతరం భువనేశ్వరి

జైల్లో చంద్రబాబు భద్రతపై భయంగా ఉందని ఆయన భార్య భువనేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో నిందితుడైన చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ములాఖత్‌లో భాగంగా భువనేశ్వరి, ఆమె కుమారుడు లోకేష్, కోడలు బ్రాహ్మణి ఆయనను మంగళవారం కలిశారు. అనంతరం జైలు నుంచి బయటకు వచ్చిన భువనేశ్వరి మీడియాతో మాట్లాడారు. నిత్యం ప్రజలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆలోచించేవారని, తనకు కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని అనేవారని చెప్పారు. జైలులో సరైన వసతులు లేవన్నారు. ఇది తమ కుటుంబానికి క్లిష్ట సమయమన్నారు.

పార్టీకి, కేడర్‌కు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు. ఏపీని జాతీయ స్థాయిలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు రాత్రింబవళ్లుతన భర్త పని చేశారన్నారు. ఇలాంటి వ్యక్తిని వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులో ఇరికించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడుతున్నారనే జైలులో పెట్టారని విమర్శించారు. తాము ఏనాడూ ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికిగానీ, సచివాలయానికిగానీ వెళ్లలేదని, నేడు ఆయనను చూడడానికి జైలుకు రావడం అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు. చంద్రబాబును చూసి బయటకు వస్తుంటే ఏదో కోల్పోయిన్నట్లుగా ఉందని చెప్పారు. తాను బాగానే ఉన్నానని, ధైర్యంగా ఉండాలని చంద్రబాబు చెప్పారని భువనేశ్వరి తెలిపారు.

పాదచారుల భద్రతకు పెద్దపీట

హైదరాబాద్ నగరంలో మరిన్ని పెలికాన్ సిగ్నల్స్

- ప్రస్తుతం 78 చోట్ల పెలికాన్ సిగ్నల్స్
- ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

హైదరాబాద్ మహానగరంలో జనాభా పెరుగుదలతోపాటు వాహనాల సంఖ్య అధికమై.. ట్రాఫిక్ ఇబ్బందులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి.. బయటికెళ్లితే.. ట్రాఫిక్‌లో ఇరుక్కుని గమ్యస్థానం చేరేసరికి గంటల సమయం పడుతోంది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలూ పెరుగుతున్నాయి. కొందరు వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనాలు నడిపించడం, మరికొందరు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ఇంకొందరు రెడ్‌సిగ్నల్స్ వద్ద వాహనాలను ఆపకుండా దూసుకెళ్తుండటంతో ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. అందులో మరణాల్లో పాదచారులవి అధిక సంఖ్యలో ఉంటున్నాయి.

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో రద్దీగా ఉండే రోడ్లపై పాదచారులు రోడ్డు దాటాలంటే గగనంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 6గంటల నుంచి రాత్రి 12గంటల వరకు కూడా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల మరణాలలో దాదాపు 60కిపైగా పాదచారుల మరణాలే ఉన్నాయి. ఫుట్‌పాత్‌లను అక్రమించే వారిపై చర్యలు తీసుకుంటూ.. ఫుట్‌పాత్‌లను విస్తరిస్తున్నా రోడ్డు ప్రమాదా లు మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా పాదచారులకు సురక్షితమైన ప్రయాణం, వారి భద్రతలో భాగంగా పోలీస్‌శాఖ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా కార్యాచరణ అమలు చేస్తున్నాయి. సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా రూ.8.5 కోట్లతో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 78 చోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. గత మేలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ట్యాంక్‌బండ్‌పై సిగ్నల్స్ ప్రారంభించారు.

కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం

ఏ.టీ.ఎస్.సీ, పెలికాన్ సిగ్నల్స్ మొత్తం 404 ఏర్పాటు చేశారు. అందులో 169 పాత సిగ్నల్స్ కాగా 113 కొత్త ఏ టీ.ఎస్.సీ సిస్టమ్ ద్వారా మొత్తం 282 సిగ్నల్స్‌తోపాటు పాదచారుల భద్రత కోసం 78 పెలికాన్ సిగ్నళ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మరిన్ని పెలికాన్ సిగ్నళ్లు ఏర్పాటు చేయనున్నారు. నగరంలో 404 సిగ్నల్స్‌ను 57 కారిడార్లలో ఏర్పాటు చేశారు. నాన్ కారిడార్‌లో గల 44 సిగ్నల్స్‌ను ఆధునీకరించి కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు. రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరిన్ని పెలికాన్ సిగ్నల్స్ అందుబాటులోకి రానున్నాయి.

గ్రూపులుగా..

పెలికాన్ సిగ్నల్ అనేది మానవీయంగా నిర్వహించబడే సిగ్నల్ వ్యవస్థ. వాహన సిగ్నల్‌ను రెండు వైపులా ఎరుపు రంగులోకి మార్చడం ద్వారా పాదచారులు సురక్షితంగా రోడ్డును దాటొచ్చు. విదేశాల్లో పెలికాన్ క్రాసింగ్‌లు సర్వసాధారణం అయినప్పటికీ, ఇక్కడ మన నగరంలో సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా అమల్లోకి తీసుకొచ్చారు. ఒక్కో సిగ్నల్ వద్ద కనీసం 10 మంది పాదచారులు చేరగానే 15 సెకండ్లపాటు సిగ్నల్‌ను ఆన్ చేస్తారు. ఒకసారి ఈ సిగ్నల్ వేసిన తరువాత మళ్లీ సిగ్నల్ వేయాలంటే కనీసం మూడు నిమషాల వరకు ఆగాలి. పాదచారులకు, రోడ్డుపై ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. సిగ్నల్ ఆపరేటింగ్ కోసం ట్రాఫిక్ సిబ్బందిని ఉపయోగించడం వల్ల సిబ్బంది కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో వాలంటీర్లను పెట్టారు. వాలంటీర్లను నియమించడంతో పాటు వారికి ఎలా ఉపయోగించాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈ వాలంటీర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సిగ్నల్స్ వద్ద విధుల్లో ఉంటారు.

రోడ్డు ప్రమాదాల నివారణ..

పాదచారుల కోసం నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లను పాదచారులు ఎక్కువ సంఖ్యలో ఉపయో గించడంలేదు. ఈ నేపథ్యంలోనే పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, మెహిదీపట్నం, జుబ్లీహిల్స్, సికింద్రాబాద్, పంజాగుట్ట, అబిడ్స్, ట్యాంక్‌బండ్, హిమాయత్‌నగర్, బేగంపేట్ ప్రాంతాల్లో ఈ సిగ్నల్స్ ఏర్పాటయ్యాయి.

సిగ్నల్ వ్యవస్థను మరింత మెరుగు పర్చాలి

పాదచారుల భద్రత కోసం నగరంలో మరిన్ని పెలికాన్ సిగ్నల్స్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. సిగ్నల్ వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు మంగళవారం ఈ.ఎన్.సి, పోలీస్, ఎలక్ట్రిసిటీ అధికారులతో కలిసి సమీక్షించారు. మరిన్ని పెలికాన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే ద్వారా 20 నుంచి 30 శాతం ప్రయాణ సమయం ఆదా అవుతుందని పోలీస్ అడిషనల్ కమిషనర్ ట్రాఫిక్ సుధీర్‌బాబు అభిప్రాయపడ్డారు.



భారత్‌లో మానవ హక్కుల పరిస్థితి ఆందోళనకరం!

న్యూఢిల్లీ : ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి 54వ సమావేశాల ప్రారంభం రోజునే ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ తుర్క్ హర్యానా, మణిపూర్‌లో తలెత్తిన హింసాకాండ గురించి ప్రస్తావించారు. సోమవారం ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. వోల్కర్ ఆ సమావేశంలో మాట్లాడుతూ, మైనారిటీల హక్కుల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం రెట్టింపు కృషి జరపాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మానవ హక్కుల పరిస్థితులు ఎలా వున్నాయో ఆయన తన ప్రసంగంలో వివరించారు. భారత్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి మానవ హక్కుల కమిషనర్ మాట్లాడుతూ, సమాజంలో వెనుకబాటుకు గురవుతున్న మైనారిటీ కమ్యూనిటీలు హింస, వేధింపులు, వివక్షకు గురవుతున్నట్టు తమ కార్యాలయానికి సమాచారం అందుతోందని చెప్పారు. చాలా సందర్భాల్లో ఇటువంటి దాడులకు గురయ్యేది ఎక్కువగా ముస్లింలేనని అన్నారు. ఇటీవల ఉత్తర భారతంలో ముఖ్యంగా హర్యానా, గుర్‌గావ్‌ల్లో జరిగిన దాడుల గురించి ఆయన ప్రస్తావించారు. గత నెలలో హర్యానా వ్యాప్తంగా చెలరేగిన హింస, ఘర్షణలు దాదాపు వారం పాటు సాగాయి. ఏడుగురు చనిపోగా, 200మందికి పైగా గాయపడ్డారు.

గత నాలుగు మాసాలుగా జాతుల మధ్య ఘర్షణలు చెలరేగుతున్న మణిపూర్ పరిస్థితిని ఆయన తన ప్రసంగంలో వివరించారు. మణిపూర్‌లో ఇతర కమ్యూనిటీలు కూడా హింసను, అభద్రతను ఎదుర్కొంటున్నారని అన్నారు. నివేదికల ప్రకారం చూసినట్లైతే 200మందికి పైగా మరణించగా, 70వేల మందికి పైగా నిర్వాసితుల య్యారని తెలిపారు. అసహనం, విద్వేష ప్రసంగాలు, మతోన్మాదం, వివక్ష వంటి పరిస్థితులను మరింత సూటిగా, స్పష్టమైన రీతిలో భారత ప్రభుత్వం ఎదుర్కొనాలని, మైనారిటీలందరి హక్కుల పరిరక్షణ కోసం కృషిని రెట్టింపు చేయాల్సిన అవసరం వుందని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లో నెలకొన్న పరిస్థితులపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెనాల్టీలను పెంచేందుకు దైవ దూషణ చట్టాలను సవరించే ఆలోచనను పాక్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఫైసలాబాద్‌లో పెద్ద సంఖ్యలో అల్లరిమూక డజన్ల సంఖ్యలో చర్చిలను ధ్వంసం చేయడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. చైనాలోని జిన్‌జియాంగ్ ప్రావిన్స్‌లో మానవ హక్కుల పరిస్థితిపై కూడా తుర్క్ ఆందోళన వ్యక్తం చేశారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలిద్దాం

- మూలాల్లోకి వెళ్దాం :రాష్ట్ర గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మానవ అక్రమ రవాణా నిరోధానికి ఆ నేరానికి మూలాల్లోకి వెళ్లి ప్రయత్నించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. జాతీయ మహిళా కమిషన్, సీఐఎస్ఎఫ్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో మానవ అక్రమ రవాణా నిరోధంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడి నుంచి అక్రమ రవాణా జరుగుతున్నది? రవాణా మార్గాలేంటి? ఎక్కడికి చేరుస్తున్నారు? అనే విషయాలపై దృష్టి సారించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అణగారిన వర్గాల చిన్నారులు, మహిళలు, కార్మికులు, వలసజీవులు భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ సదస్సులో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ, సభ్య కార్యదర్శి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

26న డాక్ అదాలత్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోస్టల్ సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీ వర్చువల్ పద్ధతిలో రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రంగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సర్వీసు అంశాలు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు ఈ అదాలత్‌లో స్వీకరించబడవని స్పష్టం చేశారు. పోస్టల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదుల్ని రాతపూర్వకంగా చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాలని తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా ఫోన్ నెంబర్ లేదా ఈ-మెయిల్ ఐడీని రాయాలనీ, డాక్ అదాలత్ వర్చువల్ లింక్‌ను దానికి పంపుతామని వివరించారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని, మరింత మెరుగైన పోస్టల్ సేవలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పోస్టల్ సేవలపై అవగాహన సదస్సు

తపాలాశాఖ పొదుపు పథకాలు, బీమా, ఇండియా పోస్ట్ పేమెంట్స్‌బ్యాంక్ అందించే సేవలపై బుధవారం సనత్‌నగర్‌లోని హిందూ మహిళా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ సిటీ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ జనరల్ హెడ్ క్వార్టర్స్ పోస్ట్‌మాస్టర్ టీఎమ్ శ్రీలత, హిందూ మహిళా కళాశాల కార్యదర్శి డాక్టర్ హెచ్ఎమ్ త్రిపాఠి పాల్గొంటారని వివరించారు. ఆసక్తి ఉన్న ప్రజలు ఈ సదస్సులో పాల్గొని, పోస్టల్ సేవల్ని తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు లేఖ రాసారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు స్వయంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా అమలు కావట్లేదనీ, వాటికోసం వారు సమ్మె బాట పట్టారని వివరించారు. సమస్యల్ని సానుకూలంగా పరిష్కరించి, సమ్మె విరమింపచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని గుర్తుచేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలనీ, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరారు. గతనెలలో మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీ సంఘాలతో చర్చించి, నిర్దిష్ట హామీలు ఇచ్చారనీ, కానీ దానికి భిన్నంగా అతి తక్కువ బెనిఫిట్స్ ప్రకటించారని వివరించారు. ప్రధానమైన వేతనాల పెంపు, ఇతర సమస్యలపై అసలు ఏమాత్రం స్పందించలేదన్నారు.

తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారనీ, తమిళనాడు, కర్నాటకలో హెల్త్‌కార్డులు ఇచ్చారనీ, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగబోనస్ ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించట్లేదనీ, స్వయంగా మంత్రులు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలనీ, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు, రిటైర్మెంట్ వయసు 60 ఏండ్లు, హెల్పర్లకు ప్రమోషన్లు, 2017 నుంచి టిఏ, డిఏ, ఇంక్రిమెంట్లు, ఇంచార్జి అలవెన్సు బకాయిలు ఇప్పించాలని కోరారు.

నేను వస్తున్నా....!

- ఉద్యమించండి :టీడీపి శ్రేణులకు బాలకృష్ణ పిలుపు



నవతెలంగాణ- అమరావతి బ్యూరో

'ఇది కేసులను లెక్కచేసే సమయం కాదు. భయపడే ప్రసక్తే లేదు. నేను వస్తున్నా...! ప్రతి ఒక్కరూ ఉద్యమించండి. తెలుగు వాడి సత్తా చూపుదాం.' అనిప్రముఖ సినీ నటుడు, హిందుపురం ఎంఎల్ఏ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి 16 నెలలు జైలులో ఉండివచ్చారని, చంద్రబాబును కనీసం 16 రోజులైనా జైలులో పెట్టాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే రాజకీయకక్షలో భాగంగా చంద్ర బాబును అరెస్ట్ చేశారన్నారు. ఎన్నికల్లో పరాజయం తప్పదన్న భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జగన్‌కు ఉన్న అవినీతి మచ్చను అందరికీ అంటించాలని చూస్తున్నారని, అయినాచంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. సిఎం కేవలం పాలసీ మేకర్ మాత్రమేనని , అధికారులే అమలు చేస్తారన్నారు. సీనియర్ ఐఎఎస్ అధికారి అజయ్‌కల్లామ్ ప్రతిపాదిస్తే, మరో అధికారి ప్రేమ్‌చంద్రారెడ్డి అమలు చేశారని వివరించారు. ప్రభుత్వం రూ.370కోట్లు ఖర్చు చేసి రూ.2.13లక్షల మందికి శిక్షణ ఇచ్చిందన్నారు. డిజైన్ టెక్ సంస్థకు జగన్ ప్రభుత్వం అభినందన లేఖ కూడా ఇచ్చిందని బాలకృష్ణ తెలిపారు.

తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

- దేశంలో జమిలి ఎన్నికలు అసాధ్యం : మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు అన్నారు. దేశంలో జమిలి ఎన్నికలు సాధ్యం కాదని చెప్పారు. ఒకవేళ కేంద్రంతో పాటు, బీజేపీ అధికారంలో ఉన్న 15 రాష్ట్రాల్లో ముందస్తుకు పోయినా... దాదాపు 19 రాష్ట్రాల్లో మాత్రమే ఎన్నికలు జరుగుతాయన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను జైలుకు వెళ్లడానికి టీడీపీ, కాంగ్రెస్ లే కారణంగానే జగన్ అని భావించారన్నారు. అందుకే చంద్రబాబును జైలుకు పంపే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. అయితే చంద్రబాబు ను జైలుకు పంపడం నెత్తి మీద పాలు పోసిన ట్లైందన్నారు.

మనోళ్ల నేరచరిత్ర



- క్రిమినల్ కేసులు, అత్యధిక ఆస్తులు కలిగిన జాబితా లో తెలుగు రాష్ట్రాల ఎంపీలు : ఏడీఆర్ రిపోర్ట్

న్యూఢిల్లీ. పార్లమెంట్ ఉభయ సభల్లోని 40 శాతం మంది సిట్టింగ్ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు ఏడీఆర్ సంస్థ వెల్లడించింది. ఇందులో 25 శాతం మందిపై (194 మంది ఎంపీలు) హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన కేసులు ఉన్నాయని పేర్కొంది. నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థతో కలిపిసిట్టింగ్ ఎంపీల అఫిడవిట్‌లను పరిశీలించి, వివరాలను వెల్లడించింది. ఉభయ సభల్లో 776 మంది ఎంపీలు ఉండగా, 763 మంది ఎంపీల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించింది. మిగతా స్థానాలు ఖాళీగా ఉండటం లేదా అందుబాటులో లేకపోవడం జరిగింది. 763 మంది ఎంపీల్లో 306 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. అలాగే ఇరు సభల్లోని ఎంపీల సగటు ఆదాయం రూ.38.33 కోట్లుగా ఉంది. ఇందులో 53 మంది అంటే 7 శాతం మంది బిలియనీర్లు.

ఉభయ సభల్లో క్రిమినల్ కేసులు నమోదైన వారిలో రాష్ట్రాలవారీగా చూస్తే కేరళ నుంచి 29 మంది ఎంపీలకు గాను 23 మందిపై (79 శాతం), బీహార్ నుంచి 56 మందికి గాను 41 (73 శాతం), మహారాష్ట్ర నుంచి 65 మందికి 37 (57 శాతం), తెలంగాణ నుంచి 24 మందికి గాను 13 (54 శాతం), ఢిల్లీ నుంచి 10 మందికి గాను 5గురిపై (50 శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి.

తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిలో బీహార్ నుంచి 28 మంది, తెలంగాణ నుంచి 9 మంది, కేరళ నుంచి 10 మంది, మహారాష్ట్ర నుంచి 22 మంది, ఉత్తర ప్రదేశ్ నుంచి 37 మంది ఉన్నారు. బీజేపీ నుంచి 139 మంది, కాంగ్రెస్ నుంచి 43 మంది, టీఎంసీ నుంచి 14 మంది, ఆర్జేడీ నుంచి 5గురు, సీపీఐ(ఎం) నుంచి ఆరుగురు, వైసీపీ నుంచి 13 మంది క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు.

పార్టీల వారీగా చూస్తే బీజేపీ నుంచి 98 మంది (25 శాతం), కాంగ్రెస్ నుంచి 26 మంది (32 శాతం), టీఎంసీ నుంచి 7గురు (19 శాతం), ఆర్జేడీ నుంచి ముగ్గురు (50 శాతం), సీపీఐ(ఎం) నుంచి ఇద్దరు (25 శాతం), ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒకరు (9 శాతం), వైసీపీ నుంచి 11 మంది (35 శాతం), ఎన్సీపీ నుంచి 2 (25 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు.

ఇక ఎంపీల ఆస్తుల విషయానికి వస్తే తెలంగాణ 24 మందితో మొదటి స్థానంలో ఉంది. సగటు ఆస్తి రూ.262.26 కోట్లుగా ఉంది. ఆ తర్వాత మధ్యప్రదేశ్ నుంచి 36 మంది (సగటున రూ. 150.76 కోట్లు), పంజాబ్ 20 మంది (సగటున 88.94 కోట్లు) ఉన్నారు. అందరి కంటే తక్కువగా లక్షద్వీప్ ఎంపీ రూ.9.38 లక్షలతో చివరి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత త్రిపుర ముగ్గురు ఎంపీల సగటు ఆస్తి రూ.1.09 కోట్లు, మణిపూర్ నుంచి ముగ్గురి సగటు ఆస్తి రూ.1.12 కోట్లుగా ఉంది.

బీజేపీ ఎంపీల సగటు ఆస్తి రూ.18.31 కోట్లు, కాంగ్రెస్ ఎంపీల సగటు ఆస్తి రూ.39.12 కోట్లు, టీఎంసీ ఎంపీల సగటు ఆస్తి రూ.8.72 కోట్లు, వైసీపీ ఎంపీల సగటు ఆస్తి రూ.153.76 కోట్లు, టీఆర్ఎస్ ఎంపీల సగటు ఆస్తి రూ.383.51 కోట్లు, ఎన్సీపీ ఎంపీల సగటు ఆస్తి రూ.30.11 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సగటు ఆస్తి రూ.119.84 కోట్లుగా ఉంది. 53 మంది బిలియనీర్ ఎంపీలలో తెలంగాణ నుంచి 7గురు, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, ఢిల్లీ నుంచి ఇద్దరు, పంజాబ్ నుంచి నలుగురు, ఉత్తరా ఖండ్ నుంచి ఒకరు, మహారాష్ట్ర నుంచి ఆరుగురు, కర్ణాటక నుంచి ముగ్గురు ఉన్నారు. వీరంతా రూ.100 కోట్లకుపైగా ఆస్తి కలిగి ఉన్నారు.

రూ.100 కోట్ల ఆస్తిని కలిగి ఉన్న ఎంపీలలో బీజేపీ నుంచి 14 మంది, కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బీఆర్ఎస్ నుంచి 7గురు, వైసీపీ నుంచి 7గురు ఉన్నారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 59,830	---
క్యారెట్లు	- 54,840	---
కిలో వెండి	- 78,000	▲ 500

చికెన్ ధరలు
హైదరాబాద్



బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 141
రిటైల్ (లైవ్)	రూ. 163
స్కిన్‌తో	రూ. 236
స్కిన్‌లెస్	రూ. 269

సిరిసిల్ల సాయుధ పోరాటం..

బద్దం ఎల్లారెడ్డి నాయకత్వం

- పోరాట వీరుడు అమృతలాల్ శుక్లా నేతృత్వంలో గెరిల్లాదాడులు
- గాలిపెల్లిలో ఇండ్లు తగలబెట్టిన రజాకార్లు
- నిజాం తూటాలకు ప్రాణాలొదిలిన ఎందరో వీరులు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సిరిసిల్లది చెరగని ముద్ర. నిజాంకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు, ఆయుధ శిక్షణ క్యాంపులు ఈ జిల్లాలో సాగాయి. ముఖ్యంగా ఇల్లంత కుంట మండలం గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి సహా సిరిసిల్లకు చెందిన అమృత్‌లాల్ శుక్లా, అనభేరి ప్రభాకర్‌రావు, చెన్న మనేని రాజేశ్వర్‌రావు, దామోదర్‌రావు, తిరుపతిరెడ్డి, భూపతిరెడ్డి, రాజారాం వంటి ఎందరో యోధులు అజ్ఞాతవాసంలో ఉంటూ చారిత్రాత్మక పోరాటాన్ని కొనసా గించారు. తెలంగాణ విముక్తి ఉద్యమం చురుకుగా సాగుతున్న దశలో మాడపాటి హన్మం తరావు అధ్యక్షతన సిరిసిల్లలో 4వ ఆంధ్ర మహాసభ జరిగింది. ఈ సభలో తీసుకున్న కీలక నిర్ణయాలతో తెలంగాణ సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసింది. సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డి, బూరుగుల రామకృష్ణా రావు, పీవీ.నర్సింహారావు, బద్దం ఎల్లారెడ్డి, కెవి. రంగారెడ్డి లాంటి వారితో జిల్లాలోని పలువురు నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. గాలి పెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి తెలంగాణ విముక్తి ఉద్యమంలో ముందున్నారు. రుద్రంగి మండలం లోని మానాల అడవుల్లో క్యాంపు ఏర్పాటు చేసి గెరిల్లా దళాలకు శిక్షణ ఇస్తూ ఉద్యమానికి బాటలు వేశారు. పేదలను పీడిస్తున్న

పోరాట వీరుడు అమృతలాల్ శుక్లా

నిజాంను ఎదురించిన వారిలో సిరిసిల్లకు చెందిన అమృత్‌లాల్ శుక్లా ప్రముఖుడు. 1950లో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి సంచలనం సృష్టించారు. నిజాం నవాబులను గడగడలాడించి గడీలను లూటీ చేసి పేదలకు పంచాడు. దీంతో శుక్లాను నిజాం పోలీసులు నిర్బంధించారు. 13ఏండ్లు జైలు శిక్ష విధించి కారాగారానికి తరలిస్తుండగా తప్పించుకున్నాడు. 1957లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. 1991నవంబర్ 14న ఆయన మరణించారు.

త్యాగాలపెల్లి.. గాలిపెల్లి

ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన కమ్యూనిష్టు యోధుడు బద్దం ఎల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశాడని, అది జీర్ణించుకోలేని నిజాం పోలీసులు ఉద్యమ కారులపై ఉక్కుపాదం మోపుతూ నిర్బంధాన్ని అమలు చేశారు. వారి ఇండ్లను తగలబెట్టారు. భయపడని ప్రజలు నిజాంకు వ్యతిరేకంగా కొడవళ్ళు, గొడ్డళ్ళు, బరిసెలు, గుళేర్లతో పోరు కొనసాగించారు. ఈ పోరులో గాలిపెల్లితో పాటు సమీప గ్రామాలకు చెందిన 11మంది ఒకే రోజు అమరులయ్యారు.



ఇల్లంతకుంట పోలీస్‌క్యాంపుపై 1948 మార్చి 12న సాయుధ ఉద్యమకారులు దాడి చేశారు. ఈ ఘటనలో అప్పటి సాయుధ దళ నేత అనభేరి ప్రభాకర్‌రావు దళం పాల్గొంది. గెరిల్లా తరహా దాడులు తెలంగాణ ఉద్యమకారులు చేయడం ఇదే మొదటిసారి. అనంతరం అదే దాడులను కొనసాగించారు. 1948మార్చి 14న అనభేరి ప్రభాకర్‌రావు దళం హుస్నాబాద్ మండలం మహమ్మాదాపూర్ గుట్టల్లో ఆశ్రమం పొందుతుండగా పోలీసులు దాడులు చేశారు. అనభేరి సహా సిరిసిల్ల జిల్లాలోని లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి, దామోదర్‌రెడ్డి, నారాయణ, భూంరెడ్డి, పాపయ్య, మల్లారెడ్డి పోలీసుల తుటాలకు ప్రాణం వదిలారు. ఈ పరస్పర దాడుల్లో ఇద్దరు పోలీసులూ మరణించారు.



ఎన్నికల ప్రణాళికల్లో మత్స్యకారుల సమస్యలు


- అన్ని రాజకీయ పార్టీలు చేర్చాలి: విస్తృత సమావేశంలో లెల్లెల బాలకృష్ణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలపై వచ్చే సాధారణ ఎన్నికల్లో ఆయా పార్టీలు తమ వైఖరి ప్రకటించాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షులు గోరెంకల నర్సింహా అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో చేప,రొయ్య పిల్లల పంపిణీలో ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే కొందరు భారీ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. వాటి నాణ్యతలో లోపాలున్నాయని తెలిపారు. చేప, రొయ్య పిల్లల కొనుగోలుకు సొసైటీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమచేయాలని ఎన్ని సార్లు ఆందోళన చేసినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తిలో ప్రమాదాలకు గురై చనిపోతున్నా వారిని ఆదుకోవటం లేదని తెలిపారు. పెండింగ్ ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి రూ. 5లక్షల ఆర్థిక సాయం పథకాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25నజిల్లాల్లో ఆందోళనలు నిర్వహించాలనీ, వచ్చే నెల 3న మత్స్యకార భవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. మత్స్యకార సామాజిక వర్గాలకు రాజకీయంగా సాధారణ ఎన్నికల్లో అన్యాయం చేసే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ మత్స్యకార శ్రామిక సహకార సంఘాల సమాఖ్యకు అప్రజాస్వామికంగా చైర్మెన్, వైస్ చైర్మెన్‌ను నామినేట్ చేయడం తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ శంకర్, ముటా దశరథ్,పగడాల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శులు కొప్పు పద్మ, గొడుగు వెంకట్, ఎం రమేశ్ రాష్ట్ర నాయకులు జి కనకతార,సిహెచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు కొనుగోలు డబ్బులు ఇప్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

- పరిశ్రమను ప్రభుత్వ అధీనంలోకి తీసుకొని ప్రారంభించాలి : కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి :
- రైతు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చెరకు రైతుల మహాధర్నా



నవతెలంగాణ జహీరాబాద్

చెరకు రైతులకు బకాయిపడ్డ డబ్బులు ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి అన్నారు. చెరకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రైతు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలోని రైతులు ట్రాక్టర్లలో చెరకు గడ్డెలతో ర్యాలీకి తరలి వచ్చారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, సామాజిక ఉద్యమకారులు ఢిల్లీ వసంత్ కుమార్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. రామచందర్, రైతు నాయకులు కొండల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పడిన మొట్టమొదటి శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎన్ఎస్ఎఫ్ చక్కెర పరిశ్రమలన్నింటినీ ఆంధ్ర పాలకులు కారుచౌకగా విక్రయించారని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేటికీ పరిశ్రమలను వెనక్కి తీసుకోకపోగా ఆయా పరిశ్రమలకు చెరకు తరలించిన రైతులకు డబ్బులు ఇప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ అండదండలతోనే పరిశ్రమల యజమానులు, వ్యాపారవేత్తలు రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. ట్రైడెంట్ పరిశ్రమ యాజమాన్యానికి ప్రభుత్వ అండలు ఉన్నందుకే 150 ఎకరాల భూమిని క్రమంగా విక్రయిస్తూ వస్తుందని ఆరోపించారు. నిజాం కాలంలో ఏర్పడిన చక్కెర పరిశ్రమలపై నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, పరిశ్రమల్లో క్రషింగ్‌కు ముందు యాజమాన్యం, రైతులతో చర్చలు జరిపి మద్దతు ధరలు ప్రకటించి హార్వెస్టింగ్ చార్జీలు కూడా ప్రభుత్వమే భరించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు న్యాయం చేసిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా నాశనం చేస్తున్నదని విమర్శించారు.

నిజామాబాద్ జిల్లాలో నాడు 40 వేల ఎకరాల్లో సాగుచేసిన పసుపు పంట.. నేడు మద్దతు ధర లభించకపోవడంతో 15 వేల ఎకరాలకు పడిపోయిందన్నారు. ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ఉద్యమాలు చేసి జైళ్లకు సైతం వెళ్లారని గుర్తుచేశారు. చెరకు పరిశ్రమలు ఇండస్ట్రియల్ శాఖ పరిధిలోకి వస్తుంది కాబట్టి ప్రభుత్వం పూర్తిస్థాయిలో బాధ్యత వహించి తక్షణమే రైతులకు డబ్బులు ఇప్పించాలని కోరారు. వారం రోజుల్లోపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి చక్కెర పరిశ్రమను ప్రభుత్వ అధీనంలోకి తీసుకొని క్రషింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఢిల్లీ రైతు ఉద్యమం తరహాలో జహీరాబాద్‌లో కూడా ఉద్యమం ప్రారంభం అవుతుందని, దీన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్ రెడ్డి, రైతు నాయకులు జైపాల్ రెడ్డి, రాంచందర్ రాజనర్సింహ, ఆశప్ప, రైతులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాధవ్ రెడ్డి, నర్సింహారెడ్డి రెడ్డి, ఖాసింపుర్, రాము తదితరులు పాల్గొన్నారు.

జైలు శిక్ష అమలు నిలిపివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మండలం మంచిరేవుల గ్రామంలోని విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మెన్ రత్నారెడ్డి, నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ పి.సత్యబాబులకు గతంలో సింగిల్ జడ్జి విధించిన జైలు శిక్ష అమలును హైకోర్టు డివిజన్ బెంచ్ నిలిపేసింది. కోర్టుకు ఇచ్చిన హామీ తర్వాత నిర్మాణాలు చేశారంటూ మిర్చుమల్ చెల్లారాం మంఘ్నాని దాఖలు చేసిన కోర్టుధిక్కార కేసులో వారికి ఆరు నెలల జైలు, రూ.రెండు వేలు చొప్పున జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. అప్పీల్ కోసం తీర్పు అమలును పది రోజులు సస్పెన్షన్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో దాఖలు చేసిన అప్పీళ్లను ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరధే ఆధ్వర్యంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది, కోర్టుకు హామీ ఇచ్చాక నిర్మాణాలు చేశారో లేదో తేల్చాలని జీఎస్‌టీయూ ఇంజనీరింగ్ వింగ్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.



రుణాలను రీ షెడ్యూల్ చేయకపోతే సొసైటీని ముట్టడిస్తాం

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య

నవతెలంగాణ - జూలూరుపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సొసైటీ పరిధిలో ఉన్న 4వేల మంది రైతులకు ఈ ఏడాది రుణాలు రెగ్యులర్ చేయకపోవడం వల్ల 14 శాతం పడుతున్న వడ్డీ.. రైతులకు భారమని, వెంటనే పాలకవర్గం రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, లేకుంటే ఈ నెల 14న సొసైటీ ఆఫీస్‌ని ముట్టడిస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నరసాపురంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వాలు రైతు రుణాలు మాఫీ చేస్తామంటున్న ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా స్థానిక పాలకవర్గం రైతులకు అదనపు భారాలు మోపే విధంగా చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. ఈ నెల 15వ తేదీ వరకు రుణాలు రీ షెడ్యూల్ చేయకపోతే ఏడు శాతం ఉన్న వడ్డీ రేటు 14శాతం పెరిగే అవకాశం ఉందని, అలా పెరిగితే రానున్న కాలంలో రైతులపై విపరీతమైన వడ్డీ రేటు పెరిగి అప్పు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే సుమారు రూ.90 లక్షలు.. సొసైటీకి నిధులు వచ్చినప్పటికీ వాటిని మురగపెట్టి రైతులకు రుణాలివ్వకుండా, రుణాలు రీ షెడ్యూల్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అన్ని రకాల రుణాలను తక్షణం రద్దుచేసి కొత్త రుణాలు అందించి రైతాంగంను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, రైతు సంఘం మండల అధ్యక్షులు గోవిందు నాయకులు, వల్లమళ్ల చంద్రావు, లకావత్ శ్రీను, బానోత్ ఈశ్వర్, సాంబశివరావు, కనికి రత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రాజీవ్ రహదారి

- ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టిన కారు
- ముగ్గురు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం



నవతెలంగాణ - చిన్నకోడూరు

నిద్ర మత్తులో కారు డ్రైవర్ రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయలవ్వగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాయడానికి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో పరీక్ష రాసేందుకు కారులో (టవేరా) వెళ్లి తిరిగి సిద్దిపేటకు బయలుదేరారు.

నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్.. అతి వేగం, అజాగ్రత్తతో ఇసుక లోడుతో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఏం జరిగిందో తేరుకునేలోపే.. కారు ముందు సీటులో కూర్చున్న వారు లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోవడంతో ప్రమాద స్థలంలోనే ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి సీరియస్ ఉన్నారు. కారులో మొత్తం 11మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నట్టు ప్రాథమిక సమాచారం. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నితిన్, గ్రీష్మ, నమ్రత ముగ్గురు ప్రమాద స్థలంలోనే మరణించారు.

ఆర్థిక ఇబ్బందులతో.. నేత కార్మికుడి ఆత్మహత్య



నవతెలంగాణ- తంగళ్ళపల్లి

ఆర్థిక ఇబ్బందులతో ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కేసీఆర్ కాలనీలో మంగళవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసీఆర్ కాలనీకి (డబుల్ బెడ్రూమ్ కాలనీ) చెందిన అంబటి శ్రీధర్(24) టెక్స్‌టైల్ పార్కులో పనిచేస్తు న్నాడు. కొంతకాలంగా మరమగ్గాలతో చేతినిండా పనిలేకపోవడంతో మూడు నెలల కిందట సిరిసిల్ల పట్టణంలో ఒక హోటల్‌ను అద్దెకు తీసుకొని టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. కేసీఆర్ కాలనీలో డబుల్ బెడ్రూమ్ ఇల్లు రావడంతో ప్రతి రోజూ తన తల్లి లక్ష్మితో కలిసి సిరిసిల్లకు వెళ్తూ టిఫిన్ సెంటర్ కొనసాగించేవాడు. ఒక పూట టిఫిన్ సెంటర్, మరో పూట నేత కార్మికుడిగా పనిచేసేవాడు. మంగళవారం ఉదయం తల్లితోపాటు సిరిసిల్ల టిఫిన్ సెంటర్‌కు వెళ్లిన శ్రీధర్ మధ్యాహ్నం 2గంటలకు బ్యాంకులో పని ఉందని తల్లిని సిరిసిల్లలో చెల్లెలు ఇంట్లో వదిలి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో శ్రీధర్ చెల్లెలు కేసీఆర్ కాలనీలోని వారి ఇంటి పొరుగువారికి ఫోన్ చేసి ఇంట్లో చూడమని చెప్పింది. వారు ఇంటిని పరిశీలించగా శ్రీధర్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే విషయాన్ని ఆయన చెల్లెలికి చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ప్రాణం తీసుకున్నట్టు కుటుంబీకులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీలకు రూ.26వేల వేతనం చెల్లించాలి

- అధికారుల బెదిరింపులు సరికాదు
- సమస్యను పరిష్కరించండి.. : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-నిర్మల్/విలేకరులు

"అంగన్వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి.. నెల రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చినా సమస్యను పరిష్కరించకుండా అధికారులు బెదిరింపులకు పాల్పడటం.. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం ఏంటని" సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె మంగళవారం రెండో రోజూ కొనసాగింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో అంగన్వాడీల సమ్మెకు తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, పాలడుగు భాస్కర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులు లేబర్ యాక్ట్ ప్రకారం నెల రోజుల ముందే ఐసిడిఎస్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారన్నారు. అయినా అంగన్వాడీలను అధికారులు బెదిరిస్తున్నారని, సమ్మెను భగ్నం చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి ఐకెపి వివోఏలకు, పంచాయతీ సెక్రెటరీలకు అప్పజెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఎవరి పని వారే చేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తోందని విమర్శించారు. పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలని కోరారు. సమ్మె నోటీసులో తెలియజేసిన ఇతర డిమాండ్స్ అన్నింటినీ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, జిల్లా అధ్యక్షులు పి.గంగామణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజమణి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఆమనగల్, చేవెళ్లలో సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వం బెదిరించడం సరికాదన్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంగర్ చౌరస్తాలో అంగన్‌వాడీలు రాస్తారోకో చేశారు. శేరిలింగంపల్లి పరిధిలోని అంగన్‌వాడీలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

ఖమ్మం జిల్లా కల్లూరు ప్రాజెక్టు పరిధిలో రెండో రోజు కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నాయకులు పి.నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ను బెదిరించడం కాదు సమస్యను పరిష్కరించండని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, పినపాకలో సీపీఐ(ఎం) నాయకులు మద్దతు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులను సీడీపీవో స్వాధీనం చేసుకున్నారు. ములకలపల్లి మండలం మాధారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం తాళం పగలగొడుతున్న సీడీపీవోను సీపీఐ(ఎం) నాయకులు అడ్డుకున్నారు. భద్రాచలంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు దీక్షను ప్రారంభించారు.

శ్రమదోపిడీకి గురవుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

కనీస వేతనాలూ ఇవ్వని ప్రభుత్వం : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ - సుల్తాన్ బజార్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం) స్కీములో అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది కనీస వేతనానికి నోచుకోకుండా శ్రమదోపిడీకి గురవుతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో రాష్ట్ర ఎన్.హెచ్.ఎం. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్న ఈ స్కీం ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వీరిని ఉద్యోగంలోకి తీసుకోవడం, వేతనాల చెల్లింపు తదితర అంశాలు రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాల్సి ఉన్నప్పటికీ వేతనాల పెంపుదల పట్ల కుంటి సాకులు చూపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ మాట్లాడారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న వివిధ రకాల ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్ చేయకుండా వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. 24 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన 510 జీవోలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. 13 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డి.హెచ్. గడల శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. డి.హెచ్. గడల శ్రీనివాసరావు ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల సిబ్బంది వేతనాల పెంపుదల విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, కమిటీ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దాంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్టు యూనియన్ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఎం నాయకులు పారిజాతం, స్రవంతి, శ్రీనివాస్ బాబు, రాఘవేంద్ర సామ్, బిన్.అలీ, మధుకర్, డి.బాపు యాదవ్, సాగర్ కమ్రాన్, కన్నెబోయిన రాకేష్, జన్ను కొర్నాల్, పద్మ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 20 ఏండ్ల నుంచి సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయకపోవడం సబబు కాదని పేర్కొన్నారు. విద్యా శాఖలో కొన్ని విభాగాల్లోని టీచింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేసినప్పటికీ ఈ ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం అన్యాయమని తెలిపారు.

22 వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, అప్పటివరకు కనీస వేతన స్కేలును తక్షణం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. విద్యా శాఖ నియామకాల్లో 30 శాతం వెయిటేజి కల్పించాలని విన్నవించారు.

వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో తగు నిర్ణయం చేయాలని కోరారు.



పూర్తికాకుండానే ప్రారంభోత్సవమా!?

సంపాదకీయం

'పాలమూరు-రంగారెడ్డి' సాగునీటి ఎత్తిపోతల పథకం నేడు రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ సర్కారు తొందరపాటే కారణం. దీనికి సర్కారు వైఖరిని సాగునీటి రంగ నిపుణులు, రాజకీయ పార్టీలు తప్పుబడుతున్నాయి. సాధారణ ఎన్నికలు అక్టోబరు తర్వాత ఎప్పుడైనా రావచ్చనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిగెత్తించేందుకు పావులు కదుపుతున్నది. 30 నెలల్లో పూర్తిచేస్తామన్న ప్రాజెక్టు కాస్త, 90నెలలకు చేరడంపై ఒకవైపు అసంతృప్తి వ్యక్తమవుతుంటే, మరోవైపు తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నచందాన 'గులాబీ' ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. 60రోజులపాటు రెండు టీఎంసీల శ్రీశైలం నీళ్లను ఎత్తిపోయడమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఉద్దేశం. దేశచరిత్రలో నిర్వాసితులకు కనివినీ ఎరుగని పరిహారం, ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ మాట నీటిమూటే అయింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే తల నరుక్కుంటానన్న సీఎం, ఇప్పుడు ప్రతిపక్షాల మాటలను బేఖాతరు చేస్తూ ఈనెల 16న వెట్‌రన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. దీన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రాజెక్టు పనులు 30శాతం కూడా పూర్తికాలేదనేది నగ్నసత్యం. మొత్తం ప్రాజెక్టులో 31పంపులకుగాను కేవలం ఒక పంపునకు మాత్రమే వెట్‌రన్ చేపడుతుండటమే అసంపూర్తి ప్రాజెక్టు అని చెప్పడానికి సాక్ష్యం. కొద్దిపాటి పనులు చేసి, సర్కారు మసిపూసి మారేడుకాయ చేస్తున్నదంటూ ప్రతిపక్షాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రాజెక్టు పనుల నాణ్యత కూడా ప్రశ్నార్థకమేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

వట్టెం జలాశయం కోతకు గురైతే, 50కిపైగా గ్రామాలు ముంపుకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రాజెక్టుకు గంటకొట్టే పేర సర్కారు నిధులతో ఎన్నికల ప్రచారానికి ఒడిగట్టడం సహించరానిది. రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెప్పి, దక్షిణ తెలంగాణను ఏడారిగా మారుస్తారా? అంటూ సీఎంపై ముప్పేటా దాడికి దిగే పరిస్థితి. శాస్త్రీయంగా డ్రైరన్ చేపట్టిన నెలరోజుల తర్వాత వెట్‌రన్‌ను చేపట్టాలి. ఆగమేఘాల మీద 13రోజులకే వెట్‌రన్‌కు శ్రీకారం చుట్టడం వెనుక వచ్చే ఎన్నికలు పరమార్థం కాదా? రేపు ఏదన్నా జరగరానిది జరిగితే బాధ్యులెవరు? కాళేశ్వరంపై చూపిన శ్రద్ధ పాలమూరు-రంగారెడ్డిపై లేదనే విషయమై రచ్చ ఇప్పటికే జరు గుతూ ఉన్నది. సాధారణ నిర్మాణం, ప్రధాన కాలువలతోపాటు పంట కాలువలనూ కట్టాలి. నార్లపూర్, ఎదుల, ఉద్దండాపూర్, కరివెన నాలుగు ప్రాజెక్టుల్లో నీళ్లు నింపడం ద్వారా సాగునీరు ఇచ్చినట్టుగా భావిస్తున్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా-1, బీమా-2, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను 2004లో చేపట్టి, 80 శాతమే పూర్తి చేశారు. బీఆర్ఎస్ సర్కారూ పాత ప్రభుత్వాల మాదిరిగానే ప్రధాన కాలువలు, ఫీల్డ్ ఛానళ్లను నిర్లక్ష్యం చేసింది. 2004లో ప్రాజెక్టులను చేపట్టినా 80 శాతమే పూర్తయ్యాయి. ఇంకా 30శాతం పెండింగే. కల్వకుర్తి ఎనిమిది పంపులకుగాను మూడే నడుస్తున్నాయి. ఐదారేండ్లుగా ఐదు పంపులను రికవరీ చేయనేలేదు. శ్రీశైలం నుంచి నీళ్లు రాలేదు. అవివస్తేనే పాలమూరు-రంగారెడ్డికి సార్థకత. వర్షాభావ పరిస్థితి కొనసాగితే ఈనాలుగు ప్రాజెక్టుల్లో 10 శాతం నీటిని కూడా నింపలేరు. ఒక్క పంపుతో నార్లపూర్ ప్రాజెక్టును ఎలా నింపుతారు? నిజాలను చెప్పకుండా ఇంకెంత కాలం ప్రజలను మభ్యపెడతారు? 2004లో చేపట్టిన ప్రాజెక్టులే పూర్తిచేయలేదు. అయితే ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో వానాకాలం సీజన్ ఈ సెప్టెంబరుతో ముగుస్తున్నది. అక్టోబరు, నవంబరు రెండో పంటనే. దీంతో మొదటి పంట పోయినట్టే. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న విపరీత జాప్యంతో రూ.35,200 కోట్ల బడ్జెట్ కాస్త మూడు రెట్లు పెరిగి రూ.75 వేల కోట్లకు చేరిందని ఇరిగేషన్ శాఖ చెబుతున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని 33లక్షల ఎకరాలకుగాను 10లక్షల ఎకరాలకు కూడా సాగునీటిని అందించలేకపోయారు. ఆశ్చర్యం ఏమిటంటే, నెదర్లాండ్ దేశం తొమ్మిది లిఫ్ట్ పథకాలు మంజూరు చేస్తే, వాటినీ మూలనపడేశారు. కోయిల్‌సాగర్ 32 వేల ఎకరాల ఆయకట్టును మరో 50వేల ఎకరాలకు పెంచే ప్రయత్నం చేసినా, పదెకరాలు కూడా పెరగకపోవడం సిగ్గుచేటు. తెలంగాణ ట్యాగ్‌లైన్ 'నీళ్లు, నిధులు, నియామకాలు' అంటూ ఎంత గొప్పగా నినాదం ఇచ్చారో, తొమ్మిదేండ్లయినా సర్కారీ ఆచరణ ఆస్థాయికి చేరకపోవడం గమనార్హం. ఈ తరుణంలో వెట్‌రన్‌ను నిర్వహించడంలో మర్మమేమిటో ప్రజలు అర్థం చేసుకోవాలి. సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా ఉంది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం-వాస్తవాలు-వక్రీకరణలు



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 11 సెప్టెంబర్ 1946 నుండి 21 అక్టోబర్ 1951 వరకు ఐదు సంవత్సరాల నెల రోజుల పాటు సాగింది. సుశిక్షితులైన నిజాం సేనలకు, భారత సేనలకు, జమిందారీ ప్రయివేట్ సైన్యంతోపాటు రజాకార్ల సైన్యాలకు వ్యతిరేకంగా వ్యవసాయం చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు సాగించిన చారిత్రక పోరాటం. ఈ పోరాటానికి ప్రపంచ ఖ్యాతి లభించింది. పోరాట సందర్భంగా ఉనికిలోలేని పార్టీలు, నాయకులు నేడు ఈ పోరాటాన్ని వక్రీకరిస్తూ తమ పాత్రను అందులో జోడించు కుంటున్నారు. విముక్తి, విద్రోహం, విమోచన అంటూ వక్రీకరణలు చేస్తున్నారు. ముస్లింల నుండి హిందువులు విముక్తి పొందారని కొందరు, పోరాటాన్ని విరమించడం ద్వారా విద్రోహం జరిగిందని కొందరు, బంధనాల నుండి విమోచనం పొందామని కొందరు టన్నుల కొద్దీ వక్రీకరణలు చేస్తూ, ఆత్మానందం పొందుతున్నారు. వాస్తవ పోరాట వారసులను చిన్నచూపు చూస్తున్నారు.

వాస్తవంగా జరిగిందేమిటి?

230 సంవత్సరాల అసఫ్‌జాహిల పాలనలో నాటి తెలంగాణలోని ప్రజలు అనేక బాధలు పడ్డారు. హిందూ, ముస్లిం ప్రజలను హిందూ జమీందార్లు, ముస్లిం రాజులు, రజాకార్లు కలిసి ప్రజలపై భౌతిక దాడులు,

> సాయుధ పోరాటం ముగిసిన 1951 అక్టోబర్ 21న బీజేపీ మాతృక అయిన 'జన సంఘం' ఏర్పడింది. ఈ పోరాటంతో జన సంఘానికి ఎలాంటి సంబంధం లేదు. 1925 సెప్టెంబర్ 25న ఏర్పడిన ఆర్ఎస్ఎస్‌కు కూడా పోరాటంతో సంబంధం లేదు. అలాంటివారు నేడు విముక్తి ఉత్సవాలు జరుపుతామంటూ ప్రకటించడం నిరసించదగినది. ప్రజా వర్గ పోరాటానికి మతం రంగు పులిమి అపవిత్రం చేసే ప్రయత్నాలను ఖండించాలి. పోరాటం ఫలితంగా నైజాం ప్రజల కోరిక మేరకు భారతదేశంలో విలీనమైంది. జాతీయ కాంగ్రెస్ కూడా నైజాం ప్రభుత్వం కొనసాగడానికే అనుకూలంగా ఉన్నట్లు చరిత్ర చెపుతున్నది.

ఆర్థిక దాడులు చేశారు. 10వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో అధికారానికి వచ్చి 1948 సెప్టెంబర్ 17న రైతాంగ సాయుధ పోరాటంతో పదవీచ్యుతుడైనాడు. ఈ నిజాం కాలంలోనే మరాఠాలతో జరిగిన యుద్ధంలో అంగ్లేయుల సహకారం పొందినందుకు వారికి మచిలీపట్నం నుండి గుంటూరు వరకు గల ప్రాంతాన్ని ధారాదత్తం చేశాడు. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని రాయలసీమ నాలుగు జిల్లాలను దత్త మండలాలుగా ఇచ్చివేశాడు. మిగిలిన 16 జిల్లాలతో నిజాం ప్రభుత్వం కొనసాగింది. ఇందులో 5 జిల్లాలు మహారాష్ట్రకు చెందినవికాగా, 3 జిల్లాలు కర్నాటకకు చెందినవి. 5.30 కోట్ల ఎకరాలలో రైతులకు 3కోట్ల ఎకరాలకు పట్టాలివ్వగా, 1.5 కోట్ల ఎకరాలు జమీందార్ల స్వాధీనంలో, 55 లక్షల ఎకరాలు నిజాం స్వంత అస్తి (సర్ఫెఖాస్)గా ఉన్నాయి. గ్రామాలలో విపరీతమైన వెట్టిచాకిరి కొనసాగింది. జమీందార్లకు తాము పండించిన పంటలతోపాటు గొర్రెలు, మేకలు, కోళ్లు, తేనె ఉచితంగా ఇచ్చేవారు. చివరికి వారి అడపిల్లలను జమీందార్ల కుటుంబాలకు 'అడబాప'లుగా పంపించాలి. పండిన పంట మొత్తం అమ్ముకున్నప్పటికీ శిస్తులకు కావాల్సిన ఆదాయం వచ్చేది కాదు. జమీందారు భూములను, నిజాం భూములను మొదట సాగు చేసిన తరువాతనే రైతులు తమ భూములు సాగు చేసుకోవాలి. శిస్తు వసూళ్ళలలో తీవ్ర నిర్బంధం, హింస కొనసాగేది. ఈ పరిస్థితులలో ప్రజలు అనేక గ్రామాలలో తిరుగుబాట్లు చేశారు.



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

రష్యాలో కమ్యూనిస్టుల ప్రభుత్వం... తెలంగాణపై ప్రభావం

1914లో రష్యాలో కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడింది. దాని ప్రభావం తెలంగాణ ప్రజలపై పడింది. 40శాతం తెలుగు మాట్లాడేవాళ్ళు ఉన్నప్పటికీ ఉర్దూ, మరాఠి మాత్రమే మాట్లాడేవారు. చదువుకోవడానికి పాఠశాలలు లేవు. శిస్తులు చెల్లించనందుకు 'ఖారజ్‌ఖాత' పేరుతో భూములు ప్రభుత్వానికి ఇచ్చి కూలీలుగా పనిచేసేవారు. తెలుగుభాష విస్తరణ కోసం ఆంధ్ర జన సంఘం పేరుతో కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన గ్రంథాలయ సంస్థను ఏర్పాటు చేశారు. వీటికి ప్రతి ఏటా కమిటీని ఎన్నుకునేవారు. వామపక్ష భావాలు కలిగిన రావి నారాయణరెడ్డి 11వ "ఆంధ్ర జనసంఘం" వార్షికోత్సవ ఎన్నికలలో గెలిచారు. దీంతో మితవాదులు వేరే సంఘం పెట్టుకున్నారు. రావినారాయణరెడ్డి గెలిచిన తరువాత అనేకమంది సంఘంలో సభ్యులుగా చేరారు. అందులో ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, కమలాదేవి, బద్దం ఎల్లారెడ్డి సంఘంలో చేరి తమ భూములను పేదలకు పంచిపెట్టారు. 1934లో తెలంగాణ పక్కనే ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో చలసాని జగన్నాదరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు నాయకత్వన కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. 1936 ఏప్రిల్ 11న అఖిల భారత కిసాన్‌సభ ఏర్పడి "దున్నేవానికే భూమి" నినాదాన్ని ఇచ్చింది. 1939 డిసెంబర్ 13న తెలంగాణలో ముగ్దుం మొహియిద్దీన్, అలంకుంద్ మీరి, ఇబ్రహీం, ముర్తుజా హైదర్, రాజ్‌బహదూర్ గౌర్ నాయకత్వన 'కామ్రేడ్స్ అసోసియేషన్' ఏర్పడింది. ఈ అసోసియేషన్ తరువాత అనేక భూ పోరాటాలు సాగాయి. అనేక గ్రామాల్లో "సంఘం" ఏర్పడి పనిచేసింది. ప్రభుత్వ భూములతోపాటు భూస్వాముల భూములు అక్రమించిన ప్రజలలో ముఖ్యులు ఆరు పైసలు చెల్లించి సంఘ సభ్యత్వం పొందారు. ఈ సంఘానికి భీంరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు కూడా నాయకత్వం వహించారు. 1941లో పెరవల్లి వెంకటరమణయ్య కార్యదర్శిగా, ఎ.గురవారెడ్డి, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంక టేశ్వరరావు తదితరులు తెలంగాణ కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. కిసాన్ సభతోపాటు, ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్టులు ఉద్యమానికి భౌతికంగా, ఆర్థికంగా సహకరించారు. ఈ పోరాటాన్ని అణచడానికి ఔరంగాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఖాశీం రజ్వి నాయకత్వన 60వేల మంది కిరాయి సైనికులు, రజాకార్లు నిజాంకు తోడ్పాటు అందించారు.

ఐలమ్మ తిరుగుబాటు... దొడ్డి కొమరయ్య మరణం

జనగామ ప్రాంతంలోని పాలకుర్తి గ్రామంలో చాకలి ఐలమ్మ స్వంత భూమితోపాటు కౌలుకు భూమి తీసుకొని వరి పంట పండించింది. ఏపుగా పెరిగిన పంటను చూసిన జమీందారు విసునూరు రామచంద్రారెడ్డి పంటను ఎత్తుకెళ్ళడానికి గూండాలను పంపాడు. అప్పటికే ఆ గ్రామంలో ఉన్న భీంరెడ్డి నాయకత్వాన చల్ల ప్రతాపరెడ్డి, కె రాంచంద్రారెడ్డి, గంగుల సాయిరెడ్డి మరో 30మంది కలిసి గూండాలను తరిమివేసారు. ధాన్యం తీసుకెళ్ళకుండా అడ్డగించారు. దీనిని ఉత్సాహంగా భావించిన ప్రజలు ఊరేగింపు చేశారు. విసునూరు గ్రామ పరిసరాలలోకి రాగానే జమీందారు గుండాలు ఊరేగింపుపై కాల్పులు జరిపారు. ముందుపీఠిన ఉన్న దొడ్డి కొమురయ్య నెలకొరిగారు. ఈ మరణం పోరాటాన్ని ఉధృతంగా మలిచింది. ప్రజలు మరింత ఉద్రిక్తులై జమీందారు ఇంటిపై దాడి చేశారు. శవంతో ఊరేగింపు చేశారు. అప్పటినుండి రెండు మాసాలపాటు 300 గ్రామాలలో జమీందార్లుకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేశారు. భూములు ఆక్రమించారు. నిజాం సైన్యాన్ని, రజాకార్లను, జమీందార్ల గుండాలను తరిమితరిమి కొట్టారు. ప్రజల నిరసన తీవ్రతను గమనించి కమ్యూనిస్టు పార్టీ, 11 సెప్టెంబర్ 1946న 'సాయుధ పోరాటా'నికి పిలుపునిచ్చింది. నాటినుండి పోరాటం మరింత ఉధృతమైంది. హిందూ, ముస్లిం, దళిత, గిరిజన, వెనకబడిన రైతులు కలిసి జమీందార్లకు, నిజాంకు వ్యతిరేకంగా వర్గ పోరాటం ప్రారంభించారు. పోరాటం ప్రారంభమైన 11 మాసాలకు భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. నిజాం ప్రాంతానికి మాత్రం రాలేదు. స్వాతంత్ర్యం అనంతరం కూడా 13 మాసాలపాటు పోరాటం సాగుతూనే ఉంది. 1500 మంది మరణించారు. ఈ పోరాటాన్ని నిజాం అణచలేదని భావించిన కేంద్రం 1948 సెప్టెంబర్ 13న సైన్యాలను పోరాట కేంద్రాలకు పంపింది. సైన్యాల రాకతో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయి నైజాంను భారతదేశంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాడు. సెప్టెంబర్ 17న భారత పతాకాన్ని హైదరాబాద్‌లోని బొల్లారంలో సైన్యాధిపతి జనరల్ జె.ఎన్. చౌదరి నాయకత్వాన ఆవిష్కరించారు. నిజాంను భారత ప్రభుత్వం 'రాజ్‌ప్రముఖ్'గా ప్రకటించింది. రాజ్‌ప్రముఖ్ పదవికి ప్రజలు నిరసన తెలిపి నప్పటికి 1950 జనవరి 26 వరకు కొనసాగించారు. సైన్యం రాష్ట్రంలోనే ఉండి కమ్యూనిస్టులను అణిచివేయ డానికి వారిపై అత్యంత క్రూర హింసాకాండ సాగించాయి. తిరిగి జమీందార్లకు భూములు అప్పగించే ప్రయత్నం చేశాయి. ఈ పోరాటాన్ని అణిచివేయడం సాధ్యం కాదని భావించిన కేంద్ర నెహ్రూ ప్రభుత్వం, తెలంగాణలో ప్రజలు ఆక్రమించిన పది లక్షల ఎకరాల భూములకు 'రక్షిత కౌలుదారీ చట్టం' తెచ్చింది. భూముల నుండి తొలగించనని ప్రకటించింది. ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడానికి కూడా వీలులేదు. ఈ చట్ట ప్రకటనతో 1951 అక్టోబర్ 21న 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తూ కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. సైన్యంతో జరిగిన పోరాటంలో రెండు వేల ఐదు వందల మంది నాయకులు మరణించారు. మొత్తం నాలుగు వేల మంది అమరులయ్యారు. మూడు వేల గ్రామాలలో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి.



సాయుధ పోరాటంపై వక్రభాష్యాలు

పోరాటం ప్రారంభమైనప్పటినుండీ హిందూ జమీందార్లకు, ముస్లిం నవాబుకు వ్యతిరేకంగా ముస్లింల నాయకత్వాన ఏర్పడిన కామ్రేడ్స్ అసోసియేషన్, కమ్యూనిస్టుపార్టీ, కిసాన్‌సభ నాయకత్వాన ప్రజలు ఐదు సంవత్సరాల ఒక మాసం సుదీర్ఘకాలం పోరాటం కొనసాగించారు. ఈ పోరాటంలో కుల, మతాలకు తావులేదు. రెండు పక్షాలలో హిందూ, ముస్లింలు ఉన్నారు. బందగి, షోయబుల్లా ఖాన్ (విలేకరి)తో సహా అనేకమంది ముస్లింలను చంపివేశారు. పోరాటంలో హిందూవులతో పాటు ముస్లింలు, మరాఠీలు కూడా పాల్గొన్నారు. అన్ని కులాలవారు ఒకే వేదికపై వచ్చి వర్గపోరాటం చేసి విజయం సాధించారు. ఈ పోరాటంలో ఒక కులం, మతం ఓటమి, మరో కులం, మతం గెలుపు అనేది లేదు. సాయుధ పోరాటం ముగిసిన 1951 అక్టోబర్ 21న బీజేపీ మాతృక అయిన 'జన సంఘం' ఏర్పడింది. ఈ పోరాటంతో జన సంఘానికి ఎలాంటి సంబంధం లేదు. 1925 సెప్టెంబర్ 25న ఏర్పడిన ఆర్ఎస్ఎస్‌కు కూడా పోరాటంతో సంబంధం లేదు. అలాంటివారు నేడు విముక్తి ఉత్సవాలు జరుపుతామంటూ ప్రకటించడం నిరసించదగినది. ప్రజా వర్గ పోరాటానికి మతం రంగు పులిమి అపవిత్రం చేసే ప్రయత్నాలను ఖండించాలి. పోరాటం ఫలితంగా నైజాం ప్రజల కోరిక మేరకు భారతదేశంలో విలీనమైంది. జాతీయ కాంగ్రెస్ కూడా నైజాం ప్రభుత్వం కొనసాగడానికే అనుకూలంగా ఉన్నట్లు చరిత్ర చెపుతున్నది. సుశిక్షితులైన సైన్యాలతో జరిగిన పోరాటంలో ప్రజలు చేసిన పోరాటం మహత్తరమైంది. నాటి పోరాట నాయకులు తమ భూములను పేదలకు పంచి నాయకత్వం వహించారు. ఈ పోరాటాన్ని వక్రీకరించడం ద్వారా బీజేపీ తన కుటిలబుద్ధిని ప్రదర్శించుకుంటుంది. భారతదేశ చరిత్రనే మార్చాలని చేసే ప్రయత్నాల్లో ఇది ఒక భాగమే. ప్రజలు దీనికి తగిన గుణపాఠం చెపుతారు. ■

జి-20 ఢిల్లీ శిఖరాగ్ర సభ

ఉక్రెయిన్ సంక్షోభంపై రష్యా ప్రస్తావన లేకుండా ప్రకటన!

ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలో జి-20 దేశాల 2023 శిఖరాగ్ర సమావేశం జయప్రదంగా జరిగింది. ప్రతి సంవత్సరం ఒక సభ్య దేశ ఆతిథ్యంలో సమావేశాలు జరుగుతాయి. గతేడాది ఇండోనేషియాలో జరగ్గా వచ్చే ఏడాది బ్రెజిల్ వేదిక కానుంది. మరుసటి ఏడాది దక్షిణాఫ్రికాలో జరుగుతుంది, కాగా 2026లో జరగాల్సిన సభకు అమెరికా వేదిక కావటాన్ని చైనా ప్రశ్నించినప్పటికీ చివరికి అంగీకరించింది. ప్రతి సమావేశం తరువాత విడుదల చేసే సంయుక్త ప్రకటన విడుదల అవుతుందా లేదా అన్న అనుమానాలు తలెత్తినప్పటికీ చివరికి విడుదల చేశారు. ఈ కూటమిలోని కొన్ని దేశాల మధ్య కొనసాగుతున్న తీవ్ర విభేధాలు, పరస్పర అనుమానాలు తదితర కారణాల వలన చైనా అధినేత షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ హాజరు కాలేదు. దీని గురించి ఎవరికి తోచిన ఊహాగానాలను వారు చేశారు తప్ప అధికారికంగా సదరు దేశాల నుంచి ఎలాంటి ప్రకటనలూ విడుదల కాలేదు. చైనా తరఫున ప్రధాని లీ చియాంగ్, రష్యా నుంచి విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావరోవ్ ప్రతినిధి వర్గాలకు నాయకత్వం వహించారు. ఈ కూటమిలో ఆఫ్రికా యూనియన్‌కు పూర్తి సభ్యత్వం ఇవ్వటంతో ఇప్పటి నుంచి అది జి-21గా మారింది. దీనిలో 19 దేశాలు ఉన్నాయి. వాటిలో భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, రష్యా చైనా, అర్జెంటీనా, జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, మెక్సికో, కెనడా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, టర్కీ, ఇటలీ, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా ఉన్నాయి. ఆఫ్రికా యూనియన్, ఐరోపా యూనియన్ పూర్తి సభ్యత్వం గల సంస్థలు, ఐరాసతో సహా కొన్ని శాశ్వత ఆహ్వానితుల జాబితా ఉన్నాయి. పశ్చిమ దేశాల్లో ఆర్థిక సమస్యలు తలెత్తినపుడు ఒక పరిష్కార మార్గంగా ఈ కూటమి ఏర్పాటుకు 1999లో జి-7 దేశాల కూటమి ఆలోచన చేసింది. 2008లో ధనిక దేశాల్లో తీవ్ర సంక్షోభం తలెత్తినప్పుడు ప్రతి ఏటా శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.



ఎం. కోటేశ్వరరావు
8331013288

ఈ కూటమిలో ఇప్పటి వరకు ఆహ్వానితురాలిగా ఉన్న ఆఫ్రికా యూనియన్‌కు పూర్తి సభ్యత్వ హోదా కల్పిస్తూ ఢిల్లీ సభ ఆమోదం తెలిపింది. దీనికి కారకులం తామంటే తామని మన దేశంతో పాటు రష్యా చైనాలు కూడా ప్రకటించుకున్నాయి. ఈ చర్య ద్వారా పేద దేశాల గొంతుక వినిపించేందుకు అవకాశం వచ్చిందన్నది స్పష్టం. సభ్యత్వం ఇచ్చిన ఖ్యాతిని ఎవరి ఖాతాలో వేసుకోవటం అన్నది ముఖ్యం కాదు. వాటికి తోడ్పడుతున్నది ఎవరు అన్నదే గీటురాయి. దాన్ని పరిశీలించినప్పుడు ఇటీవలి కాలంలో ఆఫ్రికా ఖండంలో రష్యా, చైనా సాయంతో పాటు వాటి పలుకుబడి కూడా పెరుగుతోందన్నది అందరికీ తెలిసిందే. న్యూఢిల్లీలో సభ జరిగిన తీరుతెన్నులు, పర్యవసానాలు, ఫలితాల గురించి సమీక్షలు వెలువడుతున్నాయి. తీసుకున్న నిర్ణయాలపై నవంబరు నెలలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష జరుపుతారు. ఆమోదించాల్సిన తీర్మానాలు, నిర్ణయాల మీద ఏకాభిప్రాయం సాధించే బాధ్యత ఆతిథ్య దేశం కలిగి ఉంటుంది. అందుకు అనుగుణంగానే దాన్ని మన దేశం కూడా నిర్వహించింది. ఐరాస తీర్మానాలు, పారిస్ ఒప్పందాల వంటి వాటినే అంగీకరించకుండా, అమలు జరపకుండా ఠలాయిస్తున్న దేశాలు ఈ కూటమిలో ఉన్నాయి. నిర్ణయాలను స్వచ్ఛందంగా అమలు జరపటం తప్ప విధికాదు. కొన్ని స్పందనలు, కొన్ని అభిప్రాయాలకు భిన్నంగా దేశాలు వ్యవహరిస్తున్న తీరుతెన్నుల గురించి స్థూలంగా చూద్దాం...ఈ సమా వేశాలను తన రాజకీయ ప్రయోజనాలకు నరేంద్రమోడీ ఉపయోగించుకుంటున్నారనే అభిప్రాయం మనదేశంలో ఇప్పటికే ఉంది. సభ జరిగిన తీరు మీద బీజేపీ, నరేంద్రమోడీ మద్దతుదారుల స్పందన కూడా దానికి అనుగుణంగానే ఉంది.

పశ్చిమాసియాలో ప్రముఖ మీడియా సంస్థ "అల్ జజీరా"లో రాసిన ఒక విశ్లేషణ ఇలా ప్రారంభమైంది... "నరేంద్ర మోడీ మోము, భారత దౌత్య మహత్తు (లేదా వివేకం) ప్రదర్శితమైంది. కానీ భారత భిన్నత్వ ప్రదర్శనకు అవకాశాన్ని నిరాకరించారు. భారత్ 140కోట్ల జనాభా ఉన్న దేశం. కానీ సమావేశ రోజుల్లో రాజధాని నగరంలో ఎక్కడ చూసినా కేవలం ఒక ముఖమే కనిపించింది. జి-20 కూటమి నేతలకు ఆతిథ్యం ఇస్తున్న ప్రధాని నరేంద్రమోడీదే అది. కేవలం విమానాశ్రయం వద్దనే కాదు, సభకోసం ఇటీవల జరిపిన నిర్మాణం వరకు చూస్తే ప్రతి రోడ్డు, కొన్ని చోట్ల ప్రతి కొన్ని అడుగులకు, ఎక్కువ చోట్ల రెండుకార్ల పొడవునా ఒక వ్యక్తి ప్రదర్శన మాత్రమే కనిపించింది. దౌత్య ఆడంబర ప్రదర్శనలో మోడీ హీరో కాగా మధ్య ఢిల్లీలో సభ నిర్వహణ ప్రాంతానికి సమీపంలోని విదేశీ రాయబార కార్యాలయాలు, హోటళ్ల వద్ద సంచరించే కోతులను భయపెట్టేందుకు వాటి బొమ్మలతో కూడిన భారీ కటౌట్లను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. సభ జరిగిన చోట వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పోటీ చేసే బీజేపీ ప్రధాన ప్రతీకగా ఉన్న మోడీ బొమ్మలు ఎక్కువగా కనిపించాయి. ప్రగతి మైదాన్ గా పిలుస్తున్న ప్రాంతంలో కొత్త సభా భవనాన్ని నిర్మించి దానికి భారత మండపం అని పేరు పెట్టారు. దీంతో లౌకిక ముద్ర నుంచి దూరంగా జరిగినట్లయింది. హిందూ దేవాలయాల్లో ముందు వసారాలను మండపం అని పిలుస్తారు." ఈ విశ్లేషణలో వీటితో పాటు మరికొన్ని అంశాలను కూడా ప్రస్తావించారు.

శిఖరాగ్ర సభ ఒక రోజు ముందే సంయుక్త ప్రకటనను ఆమోదించింది. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్ అని దానిలో పిలుపునిచ్చారు. ఈ సుభాషితంతో ఎవరికీ ఇబ్బంది లేదు, అభినందనీయమే. దానికి కట్టుబడి ఉన్నది ఎవరన్నదే ప్రశ్న. ఇది యుద్ధాలకు తగిన యుగం కాదు అన్నది ప్రకటనలోని ఒక అంశం. ఈ కూటమి ఉనికిలోకి వచ్చిన తరువాతనే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల మీద ఈ కూటమిలోని దేశాలు దురాక్రమణలకు పాల్పడిన చరిత్ర, అనేక దేశాల మీద దాడులకు ఉగ్రవాదులను, కిరాయి మూకలను ఉసిగొల్పుతున్న తీరు తెలిసిందే. ఉక్రెయిన్ సంక్షోభాన్ని ఎగదోసిందీ, రష్యా ప్రాదేశిక భద్రత మీద ఎలాంటి హామీ ఇవ్వకుండా ఆయుధాలను సరిహద్దుల్లోకి చేర్చటం ప్రారంభించిన తరువాతే పుతిన్ సైనిక చర్యకు పాల్పడినదాన్ని ప్రపంచం చూసింది. దాన్ని పరిష్కరించాల్సిన పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు తమ ఆయుధ సంపత్తిని అందిస్తూ ప్రోత్సహిస్తూ మరోవైపు సుద్దులు చెప్పటం హాస్యాస్పదం. తైవాన్ ప్రాంతం చైనా అంతర్భాగమని ఐరాస గుర్తించింది. దాన్ని విలీనం చేసుకొనే హక్కు చైనాకు ఉంది. దానికి తగిన సమయం రాలేదంటూ తైవాన్‌కు ఆయుధాలు ఇస్తూ చైనా మీద దాడికి ఉసిగొల్పుతున్న దేశాల నిజాయితీ ఏమిటన్నది ప్రశ్న. దక్షిణ చైనా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో చైనా ఇంతవరకు ఏ దేశ నౌకనూ అడ్డుకున్న దాఖలా లేదు.

న్యూఢిల్లీ ప్రకటనలో పేర్కొన్న లక్ష్యానికి భిన్నంగా ప్రపంచంలో పరిణామాలు జరుగుతున్నాయి. అణ్వాయుధాల వినియోగం గురించి ప్రకటన హెచ్చరించింది. కానీ తానుగా వాటిని వినియోగించబోనని ప్రకటించేందుకు ఇంతవరకు అమెరికా అంగీకరించలేదు. అణ్వాయుధాలను మోసుకుపోయే ఆధునిక క్షిపణులు, విమానాలను రోజు రోజుకూ మెరుగు పరుస్తోంది. ఐరాస నిబంధనావళి ప్రకారం ఏ దేశమూ బలప్రయోగం చేయకూడదని పేర్కొన్నది. దీని మీద కూటమి దేశాలు రాజీపడినట్లు ఉక్రెయిన్ మండిపడింది. ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతకు కట్టుబడతామని రష్యా కూడా అంగీకరిం చిందని అందుకే దిగొచ్చి సంతకం చేసిందని కొందరు పశ్చిమ దేశాల వారు వక్రీకరించారు. వాస్తవానికి పశ్చిమ దేశాల వలలో చిక్కుకొని నాటోలో



> శిఖరాగ్ర సభ ఒక రోజు ముందే సంయుక్త ప్రకటనను ఆమోదించింది. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్ అని దానిలో పిలుపునిచ్చారు. ఈ సుభాషితంతో ఎవరికీ ఇబ్బంది లేదు, అభినందనీయమే. దానికి కట్టుబడి ఉన్నది ఎవరన్నదే ప్రశ్న. ఇది యుద్ధాలకు తగిన యుగం కాదు అన్నది ప్రకటనలోని ఒక అంశం. ఈ కూటమి ఉనికిలోకి వచ్చిన తరువాతనే ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల మీద ఈ కూటమిలోని దేశాలు దురాక్రమణలకు పాల్పడిన చరిత్ర, అనేక దేశాల మీద దాడులకు ఉగ్రవాదులను, కిరాయి మూకలను ఉసిగొల్పుతున్న తీరు తెలిసిందే.

చేరి తమ ప్రాదేశిక భద్రతకు ముప్పు తలపెట్టినందున ఉక్రెయిన్‌ను దారికి తెచ్చేందుకు సైనిక చర్య జరుపుతున్నాం తప్ప దాన్ని ఆక్రమించుకొనే లక్ష్యం లేదని రష్యా ప్రారంభం నుంచీ చెబుతున్నది. రష్యా, ఉక్రెయిన్ల నుంచి ఆహారం, ధాన్యాలు, ఎరువుల సరఫరాను పునరుద్ధరించాలని, ఎగుమతి దిగుమతులను అడ్డుకోరాదని, అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కూడా జి-21 కూటమి కోరింది. టర్కీ మధ్యవర్తిత్వంలో కుదిరిన ఒప్పందాన్ని పశ్చిమ దేశాలు ఉల్లంఘించి తమను దెబ్బతీస్తున్న కారణంగానే ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు రష్యా ప్రకటించింది. ఈ కారణంగా అనేక పేద దేశాలు అధిక ధరలకు ఇతర దేశాల నుంచి ఆహారాన్ని దిగుమతులు చేసుకోవాల్సిన పరిస్థితికి పశ్చిమ దేశాలే కారణం. రైతులు విదేశాలకు సైతం ఎగుమతులు చేసుకొని లబ్దిపొందవచ్చంటూ మూడు సాగు చట్టాలను రైతుల మీద రుద్దినపుడు కబుర్లు చెప్పిన నరేంద్రమోడీ జి-20 అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడే గోధుమలు, బియ్యం, పంచదార, ఉల్లి ఎగుమతులను కూడా నిషేధించిన సంగతి తెలిసిందే.

ఢిల్లీ సమావేశానికి షీ జిన్‌పింగ్ హాజరు కాకపోవటం గురించి మీడియాలో అనేక కథనాలు వచ్చాయి. గతంలో జరిగిన ఇలాంటి శిఖరాగ్ర సమావేశాలకు కొన్ని దేశాల నేతలు రాకపోవటం తెలిసిందే. కానీ జిన్‌పింగ్ రాలేదంటే దాని వెనుక బలమైన కారణాలేమీ లేవంటే ఎవరూ నమ్మరు, తప్పకుండా ఉండి ఉంటాయి. చతుష్టయ కూటమి(క్వాడ్) అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియా కూటమి తనకు వ్యతిరేకమే అని చైనా భావిస్తున్నది. ఈ కూటమి నేతలను వచ్చే రిపబ్లిక్ దినోత్సవ అతిథులుగా పిలవాలని మన ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఢిల్లీలోని ఓ గదిలో చైనా ప్రధాని ఉండగా మరొక పక్క గదిలో జో బైడెన్-నరేంద్రమోడీ సమావేశమై క్వాడ్ పటిష్టత గురించి, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛా నౌకారవాణా గురించి చర్చలు జరిపారు. ఇవి చైనాను రెచ్చగొట్టేవే అన్నది స్పష్టం. వీటికంటే ముందే చైనా రూపొందించిన ప్రపంచపటంలో మన భూభాగాలను కొన్నింటిని మినహాయించటం, దాని మీద వివాదం చెలరేగిన సంగతీ తెలిసిందే. గతేడాది ఇండోనేషియా నగరమైన బాలిలో జరిగిన సమావేశ ప్రకటనలో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను ఖండిస్తూ చేర్చిన పేరా వివాదాస్పదమైంది. రాజీమార్గంగా చివరకు ఎక్కువ మంది సభ్యులు ఖండించారని, పరిస్థితి మీద ఇతరులు భిన్నమైన వైఖరులను వెల్లడించారని పేర్కొన్నారు. మొత్తం మీద ఖండన దానిలో కనిపించింది. ఆ సమావేశంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడిన ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ కూటమిని జి-20 బదులు జి-19 అని సంబోధించటం (రష్యాను గుర్తించకుండా) కూడా రచ్చకు దారి తీసింది. సమావేశం జరుగుతుండగా పోలాండ్‌లో క్షిపణి పేలుడు జరిగింది. వాస్తవాలు నిర్ధారించుకోకుండానే దానికి రష్యా కారణమని ఆరోపించటం, సభలో ఉన్న జి-7, నాటో కూటమి దేశాల నేతలు అక్కడే విడిగా సమావేశం కావటం, వాటన్నింటికంటే ముందే రష్యా ప్రతినిధి వర్గ నేత లావరోవ్‌తో ఫొటో దిగేందుకు అనేక మంది నేతలు తిరస్కరించటంతో అసలు బాలిలో పాల్గొన్నవారి కుటుంబ చిత్రమే లేకుండా పోయింది. తరువాత జరిగిన అనేక పరిణామాలు చైనా, రష్యాలతో అమెరికా, ఐరోపా పశ్చిమ దేశాల సంబంధాలు మరింతగా దిగజారాయే తప్ప మెరుగుపడలేదు. బాలిలో షీ జిన్‌పింగ్-జో బైడెన్ భేటీ జరిగింది, సంబంధాలను, మాటామంతిని పునరుద్ధరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటన వెలువడింది. కానీ ఆ వెంటనే అమెరికా పార్లమెంటు స్పీకర్ నానీ పెలోసీ చైనా అభ్యంతరాలను ఖాతరు చేయకుండా పంతంతో తైవాన్ వెళ్లటం తెలిసిందే. తరువాత అమెరికా సర్కార్ మరింతగా మిలిటరీ సాయాన్ని ప్రకటించింది. ఈ పూర్వరంగంలో వెళ్లకపోవటమే మంచిదని షీ జిన్‌పింగ్, పుతిన్ భావించి ఉండాలి. సంయుక్త ప్రకటనలో ఉక్రెయిన్ సంక్షోభానికి సంబంధించి బాలి ప్రకటనలో ఉన్న పదజాలానికి భిన్నంగా రష్యా పేరు లేకుండా యుద్ధం కారణంగా జనం పడుతున్న ఇబ్బందుల గురించి మాత్రమే పేర్కొన్నారు. ఇది పశ్చిమ దేశాలకు ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. బాలిలో మాదిరి ఖండిస్తే చైనా, రష్యా అంగీకరించకపోతే అసలు ప్రకటనే వెలువడి ఉండేది కాదు. అది జరిగితే తాము బలపరుస్తున్న నరేంద్రమోడీ ప్రతిష్టకు భంగమని భావించి పశ్చిమ దేశాలు అయిష్టంగానే రష్యా మిలిటరీ చర్య ప్రస్తావన లేకుండా అంగీకరించినట్లు కనిపిస్తోంది. ■



ఒకేతీరు

ముగిసిన జి20 సదస్సు
మురిసే ప్రభుల మనస్సు

ఓట్ల పాట్లే ఈ తపస్సు
పోరులకు చీకటే ఉషస్సు

ఢిల్లీ వీధులకు పరదాలు
నేతల ముంగిట్లో సరదాలు

పేదల గుండెల్లో గుబులు
ప్రశ్నిస్తే అర దండాలు

ప్రజాస్వామ్యమంటారు
నెత్తిన మంట పెడతారు

ఓట్లు గుంజ సంజుకుంటారు
నాడు నేడు ఒకే తీరు

మార్పులేదు చేర్పులేదు
మాటల మూటలే హోరు

ముందు నుయ్యి వెనుక గొయ్యి
కండ్లు తెరచి ఓటు వెయ్యి

- ఎన్. నాగేశ్వరరావు
సెల్: 8688553470

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎంపీపీ వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-వేంసూరు

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో ఉంటుందని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ దవాఖానాలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కావలసిన మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు మానసిక సమస్యలు ఉన్నవారికి కౌన్సిలింగ్ ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎంపీడీవో రమేష్ డాక్టర్ ఇందుప్రియ మాట్లాడుతూ ఈ శిబిరాల్లో మహిళలకు క్యాన్సర్ స్కానింగ్, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత తదితర పరీక్షలను ఉచితంగా చేయబడతాయని, అవకాశాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పల్లవి, మేఘన, సిహెచ్ఓ వెంకట్ నారాయణ, ఎంపీటీసీ నాయుడు వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు రహీం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలం కొత్త కారాయి గూడెం గ్రామంలో మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విట్టల్ రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ, విముక్తి కోసం ఆంధ్ర మహాసభ సహకారంతో తెలంగాణ పోరాటం జరిగిందని ఆ పోరాట వారసత్వంతో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపకం జరిగిందని అన్నారు. రానున్న కాలంలో కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని గ్రామాల్లో కూలి, భూమి, ఇళ్ల స్థలాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు పోట్రు రాజారావు, గ్రామ సభ్యులు పోట్రు ప్రసాద్, నూనె కుటుంబరావు, దిరిశాల రాము, కన్నెగంటి నరేష్, మూడు నాగయ్య, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుండి పంటలను కాపాడండి

రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో కోతుల బెడదతో పంటలు నష్టపోతున్నామని, పంటలను కాపాడాలంటూ, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, సమన్వయంతో కోతుల బెడద నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. కోతుల మంద పంట పొలాల పై పడి పంటలను ఆగం చేస్తున్నాయన్నారు. మనుషులపై కూడా కోతులు దాడి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐలూరి శేశిరెడ్డి, ఏలూరు పిచ్చిరెడ్డి, వెంకట శేశిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి గుర్రాల చిన్న వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు తహసీల్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-తల్లాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు పిలుపునిచ్చారు. తల్లాడ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని అర్హులైన అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు, దళిత బంధు, బీసీ బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు, అర్హులైన పేదలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయినాల పిలుపు నిచ్చారు. శీలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్ రావు శీలం పకీరమ్మ, షేక్ మస్తాన్, పులి కృష్ణయ్య కళ్యాణం కష్ణయ్య చల్ల నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్ ,ముచ్చింతల చెన్నయ్య, నన్నేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షలు మాఫీని అమలు చేస్తాం

నవతెలంగాణ-మధిర

కాంగ్రెస్ పార్టీ అ ధికారంలోకి వచ్చిన వెంటనే రైతు బ్యాంక్ రుణాలు రెండు లక్షలు మాఫీ అమలు చేస్తామని ఏఐసీసీ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో 158, 161 సోమవారం బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర మండల బూత్ కమిటీల ఇన్చార్జ్ బండారు నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు బాంధవుడు మన మల్లు భట్టి విక్రమార్కని రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మధిర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, ఏబిసి క్లస్టర్ ఇంచార్జిలు మధిర మండల సేవాదళ్ అధ్యక్షులు ఆదూరి శ్రీనివాస్, కరివేద రాంబాబు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పగడాల జితేంద్ర కుమార్, ధర్మపురి నరసింహారావు, చింతల రాము మల్లవరపు అప్పారావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో ఎవరూ చేరలేదు

కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-ముదిగొండ

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ పార్టీ వారు సోమవారం జరిగిన భట్టి సభలో ప్రకటించడాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. పార్టీ మండల కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నుండి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో ఎవరూ చేరలేదని కాంగ్రెస్ పార్టీ వల్ల కాంగ్రెస్లో చేరి ఆర్భాటంగా అబద్ధాన్ని ప్రచారం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరటం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి ఏఎంసి డైరెక్టర్ పాము శిల్వరాజు, పార్టీ మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పిటిసి పసుపులేటి దుర్గవెంకట్, నాయకులు పోట్ల ప్రసాద్, మీగడ శ్రీనివాస్ యాదవ్, బంక మల్లయ్య, తోట ధర్మ,ఎర్ర వెంకన్నముదిగొండ,వెంకటాపురం గ్రామ సర్పంచ్లు మందరపు లక్ష్మి కోటి అనంతరాములు పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్య లక్ష్యమే 'ఆరోగ్య లక్ష్మి'

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



తెలంగాణ రాష్ట్రంలో మహిళల సంపూర్ణ ఆరోగ్య సాధికారిక కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య లక్ష్మిని అమలు చేస్తుందని ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ అన్నారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య లక్ష్మీ కేంద్రం అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుబ్లేడు ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యం లక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య లక్ష్మి కార్యక్రమాన్ని చేస్తున్నామని దాదాపు 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మహిళలకు ఉచితంగా మందులు ఇస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి మంగళవారం ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఓ చుంచు శ్రీనివాసరావు, ఎంపీఓ రాజేశ్వరి, వైద్యాధికారి వసుందర, స్థానిక సర్పంచ్ సంజీవయ్య స్టాఫ్ నర్సులు ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సలీమా మృతదేహానికి భూక్య, బొంతు, తాళ్లపల్లి నివాళి

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు వెళ్లి సోమవారం గుండెపోటుతో మృతి చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు షేక్ సలీమా మృతదేహన్ని మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ లు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సలీమా కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొడ్డపనేని క్రిష్టార్జున్ రావు, షేక్ అఫ్జల్, తీగల వెంకటి, నాగుల్ మీరా, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కి జీఎంపీఎస్ వినతి

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలో గొర్రెల స్కీం కోసం డీడీలు కట్టి గత 14 నెలలుగా యాదవ, కురమలు ఎదురుచూస్తున్న అందరికీ వెంటనే గొర్రెల పంపిణీలో బాగంగా నగదు రూపంలో చేయాలని మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంపత్ కుమార్‌కు జీఎంపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య మాట్లాడుతూ... అప్పులు తెచ్చి డీడీలు కట్టి రోజురోజుకీ వడ్డీలు పెరిగి యాదవ, కురుమల ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని తెలిపారు. దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాలకి లేని వాటాదనం యాదవ కురుమలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు? డిడీ డబ్బులు కూడా ప్రభుత్వమే భరించి పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంచని గురవయ్య, ఎర్రబోయిన కోటయ్య, గంగయ్య, మురళీ, శ్రీశైలం,కిరణ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ దీక్షకు డా.కోట మద్దతు

మధిర : పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మధిరలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గర దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి కొర్రీలు



- పేదలకు వర్రీలు
- స్లాబ్ లెవల్‌కు పరిమితం అయిన డబుల్ ఇండ్లు
- ఐదేండ్లు అయినా ముందుకు సాగని పనులు

నవతెలంగాణ-వైరా

రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా పేదలు సొంత స్థలాల్లో ఇండ్ల నిర్మించుకుంటే రూ.మూడు లక్షలు ఇస్తామని ప్రకటిస్తూ, ఎట్టకేలకు ఎన్నికల వేళ ఆగస్టు 8, 9, 10 తేదీలలో దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులు చేసుకోవడానికి మూడు రోజుల గడువు చాలదని ప్రతి పక్షాలు ఆందోళన చేసినా పెంచలేదు. గృహలక్ష్మి దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ఆదాయ, కుల, స్థల ధృవీకరణ పత్రాలు లేనివారు అవి తీసుకోవటానికి తహసీల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. ఆ ధృవీకరణ పత్రాలు ఉంటేనే మీ సేవా కేంద్రాలలో ఆన్ లైన్ చేసుకునే అవకాశం ఉంది. మూడు రోజుల సమయం చాలక, ధృవీకరణ పత్రాలు అందక, సగం మంది పేదలు దరఖాస్తు చేసుకోలేక పోయారు. ఈ పథకానికి అర్హత సాధించటానికి ఇది మొదటి అవరోధం.

గ్రామాల్లో పేదలు ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేక వారికి పూర్వీకుల నుండి సంక్రమించిన పాత ఇళ్లలో మగ్గుతూ, ప్రభుత్వం కొన్నేళ్లుగా ఇస్తానంటున్న మూడు లక్షల రుణం కోసం ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో గ్రామాలలో ఖాళీ గా ఉన్న ఇళ్ళ స్థలాలపై సమగ్ర సర్వే నిర్వహించింది. ఖాళీగా ఉన్న ఇళ్ళ స్థలాలు సొంతంగా కొనుక్కున్నారా, వారసత్వంగా వచ్చినవా? లేక స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రభుత్వమైనా పట్టాలిచ్చి పంపిణీ చేసిందా? అన్న వివరాలతో విచారణ జరిపారు. ఈ విచారణలు గ్రామాలలో పేదలకు అర్థం కాలేదు. రెవెన్యూ అధికారులను వివరణ అడిగినా, మాకేమీ తెలియదు ప్రభుత్వం సర్వే చేయమన్నది. అందుకే సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న ఇళ్ళ స్థలాల పేదలు ప్రభుత్వం ప్రకటించిన మూడు లక్షలైనా వస్తే కొంత ఊరట లభిస్తుందని భావించారు.

అనేక గ్రామాలలో పేదల, రాజకీయ పార్టీల పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వాలు అవకాశం ఉన్న చోట పేదలకు, దళితులకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసింది. వాటిలో కొందరు పూరిళ్లు, రేకుల ఇళ్లు నిర్మించుకున్నారు. నిర్మించుకున్న ఇళ్ళలో కొన్ని శిథిలమై ఉన్నవి. వీరంతా ఇప్పుడు గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు ఇచ్చినా, ఇళ్లిచ్చినా, నేటి యువ కుటుంబాలకు గృహ లక్ష్మి పథకాన్ని వర్తింప జేయటం లేదని స్పష్టం చేస్తుంది.

ఉదాహరణకు వైరా మండలం విప్పలమడక గ్రామంలో దళితులు, బలహీన వర్గాలకు సుమారు 60 ఏళ్ల నాడు ఇండ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఆనాటి లబ్దిదారులు కూడా మరణించారు. ఆ ఇళ్ళ స్థలాలలో గృహలక్ష్మిని కోరుతూ దరఖాస్తు చేసుకున్న పేదలను స్థానిక రెవెన్యూ అధికారులు అనర్హులుగా ప్రకటించారు. గ్రామంలో 64 మంది దళితులు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా కేవలం 24 మంది మాత్రమే అర్హులని నిర్ధారించారు. ఈ ప్రభుత్వం పేదలకు జీవిత కాలమే కాక, వారి వారసులకు కూడా సంక్షేమ పథకాలకు అనర్హులను చేస్తుంది.

స్లాబులు వేసి వదిలేశారు.

గ్రామంలో పక్కా ఇల్లు లేని పేదలు 80 మంది ఉన్నారని 2017 లో గ్రామ పంచాయతీ జిల్లా కలెక్టర్‌కు, వైరా రెవెన్యూ అధికారులకు లిస్టు ఇవ్వగా విచారణ జరిపి 2018 మే నెలలో 60 డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఆనాటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. 20 ఇళ్లకు శ్లాబులు వేసి వదిలేసి వెళ్లిపోయారు. కాంట్రాక్టర్ ను ప్రశ్నించగా ఆ ఇళ్ళ జోలికి రాలేమని చెప్పాడు. 5 సంవత్సరాలు గడిచినా ఒక్క డబుల్ బెడ్ రూం పూర్తి చేయక పోగా, పేదలు గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకుంటే మీకు ప్రభుత్వం ఇళ్ళ స్థలం ఇచ్చింది కనుక ఇల్లు రాదని చెబుతున్నారని పేదలు వాపోతున్నారు. గత ప్రభుత్వాలు ఇళ్ళ స్థలాలు ఇస్తే ఈ ప్రభుత్వం దాన్ని సాకుగా చూపుతూ ఇళ్లకు అనర్హులని చెప్పటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో సంఘటితంగా కదిలి అధికారులను కలువనున్నట్లు తెలిపారు.

సమస్యను పరిష్కరించండి సమ్మె విరమిస్తాం

- అంగన్‌వాడీలకు బెదిరింపులు సరికాదు
- పర్మినెంట్ చేసి... కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- రెండో రోజుకు అంగన్వాడీ సమ్మె
- సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కల్లూరు



తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్స్‌ను బెదిరించడం కాదు సమస్యను పరిష్కరించండి సమ్మెను విరమిస్తాం, అంగన్‌వాడీల జోలికొస్తే సహించేది లేదు సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం కల్లూరు ప్రాజెక్టు పరిధిలో రెండో రోజు కొనసాగుతున్న సమ్మె శిబిరానికి ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నాయకులు పి. నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఐసిడిఎస్ ప్రారంభించి 48 సంవత్సరాలు అవుతుందని, రానున్న రెండు సంవత్సరాల్లో అర్థ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న సమస్యలు ఇంతవరకు పరిష్కారం చేయటం లేదని, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారని వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత ఏమీ లేకుండా వెట్టి చాకిరి చేస్తున్నారని, తమ జీవితకాలం ఐసీడీఎస్ ను అంటిపెట్టుకొని పనిచేస్తున్న కార్యకర్తలకు ఏమి ప్రయోజనం లేకుండా ఉండటం వలన పాలకులుకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోకపోవడం వలన, ఈ నిరవధిక సమ్మెకు దిగాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ అధికారులు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వారి ఇష్టం వచ్చినట్టుగా ప్రవర్తిస్తుంటే సహిస్తూ ఊరుకోమని, సమ్మె చేసే హక్కు ప్రతి ఒక్క కార్మికులకు ఉంటుందని, సమ్మెను నిషేధించడానికి ఏమైనా చెడగొట్టడానికి ప్రయత్నం చేసే అధికారులపై, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సభను ఉద్దేశించి సీఐటీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు చలమాల విఠ్రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏ కొత్త పథకం పెట్టిన అంగన్వాడీ కార్యకర్తలు పని చేయించుకుంటున్నారని, ఆసరా పెన్షన్ల దగ్గర నుంచి కళ్యాణ లక్ష్మి పథకం కాటిదాకా, కొత్తరకం యాపులు పెట్టి అంగన్వాడీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఈసీసీ యాప్ ను పూర్తిగా రద్దు చేయాలని, అందరికీ ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పిస్తూ కనీస వేతన 26,000 ఇచ్చి, ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం కి గుర్తు చేశారు. తక్షణమే ఈ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు పిలిచి సమస్యల తక్షణమే పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జునరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వేమిరెడ్డి శ్రీదేవి, వాణిశ్రీ, ప్రభావతి, జ్యోతి, నిర్మల, ప్రమీల మేరీ ఏఐటీయూసీ నాయకురాలు ప్రేమ బాయ్, విగ్నేశ్వరి, రాధ, నాయకత్వం వహించారు.

మధిర : అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతన రూ.26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని సీఐటియు, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మధిర ప్రాజెక్టు నందు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు మాట్లాడారు.

నేలకొండపల్లిలో ఎమ్మెల్యే కుమార్తె పర్యటన

- బాధిత కుటుంబాల పరామర్శ, ఆర్థిక సాయం

నవతెలంగాణ-నేలకొండపల్లి

పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి కుమార్తె కందాల దీపిక మంగళవారం నేలకొండపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని నాచేపల్లి, మంగాపురంతండా, అప్పలనరసింహపురం, రాయగూడెం, బుద్ధారం, చెరువుమాదారం, భైరవునిపల్లి, మోటాపురం, ముజ్జుగూడెం, సదాశివపురం గ్రామాలలో ఇటీవల మరణించిన 33 బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒక్కో కుటుంబానికి పదివేల రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. తొలుత మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంతకుమారి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గండు సతీష్, పార్టీ మండల కార్యదర్శి ఎన్నబోయిన శ్రీను, సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, సర్పంచులు మందడి రాజేష్, భూక్య సుధాకర్, యాతాకుల లక్ష్మి, నంబూరి సత్యనారాయణ, వంగవీటి నాగేశ్వరరావు, మరికంటి రేణుబాబు, పెదపాక వెంకటేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి

- జడ్పీ సీఈవో వివి అప్పారావు

నవతెలంగాణ-వేంసూరు



గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రతి మంగళ శుక్రవారం లో డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన మర్సకట్ల ఏసోబు అనారోగ్యానికి గురై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి పరిశీలించారు. అనంతరం కందుకూరులో డ్రై డే కార్యక్రమములో పాల్గొని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చోడవరం తండాలో డ్రైడే కార్యక్ర మంలో పాల్గొని, చోడవరం నూతన పంచాయతీ కార్యాలయం నిర్మాణ పనులు పరిశీలించి, పల్లెవాడ ప్రకృతి వనాన్ని పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల వ్యాప్తి నివారణకు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్, ఎంపీ ఓ రంజిత్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మెడికల్ విద్యార్థికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని లీలా సుందరయ్య నగర్ వాస్తవ్యులు వేమూరి సత్యనారాయణ, స్వరూపరాణి దంపతుల కుమారులు వేమూరి సుధీర్ (యుఎస్ఎ), అజయ్ సౌజన్యంతో నిరుపేద మెడికల్ విద్యార్థి ఆదూరి వంశీ కిరణ్ కు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఆదూరి నారాయణ, రాణి దంపతుల కుమారుడు ఆదూరి వంశీ కిరణ్ అన్నపురెడ్డిపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో చదువుకొని మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు. ఆదూరి వంశీ కిరణ్ వైద్య విద్యను అభ్యసించడానికి వేమూరి సత్యనారాయణ, వేమూరి స్వరూపరాణి దంపతులు ప్రతి సంవత్సరం 5000 చొప్పున 5 సంవత్సరాల పాటు ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రద్ధగా చదువుకుని మంచి స్థాయికి రావాలని, తల్లిదండ్రులకు, గురువులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల చదువులకు దాతలు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేమూరి సత్యనారాయణ, మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, సభ్యులు విసన్నపల్లి కృష్ణ, ఆదూరి నారాయణ, ఆదూరి వంశీ కిరణ్ పాల్గొన్నారు.

పెరిగిన మిరప సాగు

నవతెలంగాణ-పెనుబల్లి



ఈ ఏడాది మిర్చి సాగు విస్తృతంగా రైతులు సేద్యం చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే పదివేల హెక్టార్లకు పైగాని మిర్చి సాగు రైతులు చేపడుతున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మిర్చి సాగు వైపు రైతులు అనూహ్యంగా మరలడంతో మిర్చి నారు పెంచి అమ్మే వారికి కాసులు పంటగా మారింది. తొలుత మిరప నారు మొక్క రూపాయికి అమ్మినవారు సాగుపెరగడంతో అదునుగా భావించిన నారు పెంపకం దారులు రెట్టింపు ధరలకు మొక్కలను విక్రయిస్తున్నారు. గత ఏడాది మిర్చి ధర వెంట 20 వేలకు పైగా అమ్మకం జరగడంతో మిర్చి సాగు చేసిన రైతులకు నల్లి తెగులు కారణంగా దిగబడి తగ్గింది. ఎకరాకు క్వింటాల వరకు రావలసిన పంట సగం దిగుబడి లభించింది. అయినప్పటికీ రేటు ఉండటంతో కొంతమేర లాభం రైతులు ఈ ఏడాది మిర్చి పంటను పెద్ద మొత్తంలో సాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. పెరిగిన ఎరువులు పురుగు మందులు, ధరలు ముప్పేట దాడి చేస్తున్న అందిన కాడికి అప్పులు చేసి మిరప పంటను సాగు చేసేందుకు కౌలు రైతులు సైతం మంచి దూకుడు మీద ఉన్నారు. బోర్లను సాగునీటి వనరులుగా ఎంచుకొని మిర్చి సాగుకు సమాయత్తమయ్యారు. పెనుబల్లి మండలంలోని చౌడవరం, లంకపల్లి, ఉప్పిలిచిలక , ఎడ్ల బంజర, మండల పాడు, మొండికుంట, టేకులపల్లి గ్రామాల్లో మిర్చి సాగు ఏడాది అనూహ్యంగా పెరిగింది. గతంలో పత్తి సాగు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా సాగులో ఉండేది, పత్తి దిగుబడి లేక వచ్చిన కొద్దిపాటి పంటకు కూడా ధర లేకపోవడంతో ఆ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. మిరప సాగు విస్తృతంగా చేపట్టుతున్న రైతులకు ఆశించిన మేరకు దిగుబడితోపాటు మంచి ధర కూడా కౌలు రైతుల వ్యవసాయపరంగా అధికంగా బలపడాలని మండల రైతు సంఘం కోరుకుంటుంది.



చేనేత హస్తకళలను ఆదరించండి : మేయర్

నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల 51 డివిజన్ దోరేపల్లి ఫంక్షన్ హాల్‌లో శ్రీ కళాభారతి చేనేత హస్తకళా మేళా అఖిల భారత హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు కార్యక్రమాన్ని మేయర్ పునుకోలు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మం నగర ప్రజలు చేనేత హస్తకళలను ఆదరించి ప్రదర్శనను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్ధిపేట, వరంగల్, వెంకటగిరి, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, బెడ్‌షీట్స్, టవల్స్ వంటి ఎన్నో రకాల చేనేత వస్త్రాలు శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో కళాకారుచే నేరుగా తయారు చేసిన వస్త్రాలను ఖమ్మం ప్రజల వద్దకు తీసుకొచ్చామని తెలిపారు. దేశంలోనే పేరెన్నికగన్న కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్ టాయిస్, హైద్రాబాద్ మంచి ముత్యాలు, మైసూర్ రోజ్వుడ్, సహారన్పూర్ వుడ్ కార్వింగ్, వరంగల్ లెదర్ బ్యాగులు, బంజార ఎంబ్రాయిడరి, బెంగాల్ జ్యూట్ బ్యాగ్స్ ఇలాంటి ఎన్నో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సుమారు 200లకు పైగా హస్తకళలు చేనేత వస్త్రాలు తమ ప్రదర్శనలో ఉన్నాయని, ఈ 24వ తేది వరకు ఈ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార ముక్తార్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

నల్ల బ్యాడ్జీలతో గురుకుల పాఠశాల సిబ్బంది నిరసన

నవతెలంగాణ - ఎర్రుపాలెం



గురుకుల పాఠశాలలలో అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా గత 15 సంవత్సరాల నుండి చాలీచాలని జీతాలతో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పాఠశాల జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా రెండో రోజు మండల కేంద్ర మైన ఎర్రుపాలెం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్(గురుకుల) పాఠశాల జూనియర్ కాలేజీ నందు నల్ల బ్యాడ్జిలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ, రేణుక, కల్పన, సరిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ ఏలూరికి ఐక్య రాజ్య సమితి ఆహ్వానం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మంకు చెందిన ప్రముఖ దౌత్యవేత్త డాక్టర్ శ్రీనివాస్ ఏలూరికి న్యూయార్క్ (యూఎస్ఏ)లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ఈ నెల 16, 17 తేదీలలో జరిగే రాజ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగే సభలలో పాల్గొనవలసిందిగా ఆహ్వానం అందిందని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జెండర్ ఈక్వాలిటీ (లింగ సమానత్వం), అణు ఆయుధ నిర్మూలన ప్రాముఖ్యతపై మాట్లాడనున్నారు.

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రచార కార్యదర్శిగా వల్లోజి శ్రీనివాసరావు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రచార కార్యదర్శిగా ఖమ్మంలో అదనపు పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న వల్లోజి శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ప్రచార కార్యదర్శిగా నియమితులైన వల్లోజి శ్రీనివాసరావుకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ ఎస్.కె.ఖాజామియా, ఖమ్మం పట్టణ అధ్యక్షులు నయిం పాషా, కోశాధికారి శేషు ప్రసాద్, సంజయ్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషశ్రీ, సుధారణి, కష్ణకుమారి, మంజుల, శారద, లావణ్య వెంకన్న, రామకష్ణ, సాధిక్ అలీ, నరేష్, సుమంత్, శంకర్, రాజు తదితరులు అభినందనలు తెలిపారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని పమ్మి రెవెన్యూ సర్వేనెంబర్ 183లో ఉన్న ప్రభుత్వ భూమిలో మట్టిని కాజేసేందుకు ఓప్రైవేటు బడా కంపెనీ అనుమతి లేకుండా అక్రమంగా యంత్రంతో పని చేపిస్తున్నారు.సమీపాన ఉన్న వ్యవసాయ భూముల రైతులు రెవిన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ఐ బందెల ఉషారాణి మంగళవారం భూమిని సందర్శించి పరిశీలించారు. అనుమతి లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూమిలో పనిచేస్తున్న యంత్రాన్ని తొలగించారు.అక్రమంగా మట్టి తోలకాలు చేస్తే చట్టపరంగా కఠిన కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ఆమె వెంట జూనియర్ అసిస్టెంట్ ఎస్కె రఫీ ఉన్నారు.

మండల స్థాయి పాఠశాల క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండల స్థాయి పాఠశాల క్రీడలు మండల పరిధిలో గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ రవీందర్ రెడ్డి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటుగా క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మండల స్థాయి క్రీడలు రెండు రోజుల పాటు పాఠశాలలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎంఈవో శాంసన్, ఏటీడీఓ తిరుమలరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీపీ

నవతెలంగాణ-ముదిగొండ



ప్రభుత్వం మహిళలు ఆరోగ్య వంతంగా ఉండాలనే ఉదేశ్యంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్యాంపుని సద్విని యోగం చేసుకోవాలని ఎంపిపి సామినేని హరిప్రసాద్ అన్నారు. ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ క్యాంపును మంగళవారం ఆయన లాంఛనీయంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అంకం అరుణాదేవి, వైస్ ఎంపిపి మంకెన దామోదర్, జడ్పిటిసి సభ్యురాలు పసుపులేటి దుర్గ, ముదిగొండ, వెంకటాపురం సర్పంచులు మందరపు లక్ష్మీ, కోటి అనంతరాములు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బంకా మల్లయ్య, మందరపు ఎర్రవెంకన్న, హెల్త్ సూపర్వైజర్ లతా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

15న మోడల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 15న స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ అక్తర్జుమాన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 15వ తేదిన ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

14న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ - బోనకల్



ఈనెల14వ తేదిన బోనకల్ తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తెలిపారు. సిపిఎం రామాపురం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి కరపత్రాన్ని పంచుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అనేక సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా గహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలు గ్రామంలో అర్హులైన నిరుపేదలకు అందేలా గ్రామసభల ద్వారా లబ్ధిదారులు ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామాపురం గ్రామ శాఖ కార్యదర్శి కొమ్మినేని నాగేశ్వరరావు, ముష్టికుంట్ల సొసైటీ డైరెక్టర్ మామిళ్ళ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొండ నాగేశ్వరరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి గార్లపాటి రమేష్, నాయకులు గుడిపూడి శ్రీనివాసరావు, బంధం వెంకటేశ్వరావు, యడ్లపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే

- గ్రామ గ్రామాన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించాలి
- 16న భక్త రామదాసు కళాక్షేత్రంలో వారోత్సవాల సభ
- హాజరుకానున్న రాష్ట్ర నేతలు
- జిల్లా నలుమూలల నుంచి జిల్లా కేంద్రానికి బైక్ ర్యాలీ
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్‌లు అన్నారు. మంగళవారం ఖమ్మం సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ అధ్యక్షతన జరిగిన పార్టీ పాలేరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని ప్రజా ఉద్యమాలలో ముందుకు సాగాలన్నారు. నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి రజాకారులకు ముచ్చెమటలు పట్టించి "నీ బాంచన్ కాల్మొక్త దొర" అనే బానిసత్వాన్ని ఎదిరించి "బద్మాష్ నా కొడకా" అంటూ తిరగబడిన గొప్ప వీరులను కన్న ప్రాంతం ఖమ్మం అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగు వేలమంది అమరులైనారని, 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర ఎర్రజెండాది అన్నారు. ఇంతటి చరిత్రను వక్రీకరిస్తూ బిజెపి పక్కదారి పట్టిస్తున్నారని, సాయుధ పోరాట చరిత్ర గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని వారు అన్నారు. కాబట్టి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామ గ్రామాన జరపాలని ఆయన పిలుపునిచ్చారు.

అదే విధంగా ఈనెల 16వ తేదీన సాయంత్రం 5 గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో భారీ సభను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 16న ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి బైక్ ర్యాలీలు ఖమ్మం నగరానికి చేరుకుంటాయని తెలిపారు. కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాలకు చెందిన బైక్ ర్యాలీ వరంగల్ క్రాస్ రోడ్డు తమ్మినేని సుబ్బయ్య భవనం నుంచి ప్రారంభం అవుతుందని, అక్కడి నుండి జలగంనగర్, కాల్వ ఒడ్డు మీదగా భక్త రామదాసు కళాక్షేత్రానికి చేరుకుంటుందని అన్నారు. వైరారూరల్, వైరా టౌన్, కొణిజర్ల, ఖమ్మంఅర్బన్, హావేలి, ఖమ్మం 2 టౌన్ మండలాల నుండి మోటార్ సైకిళ్ల శ్రీశ్రీ విగ్రహం మీదుగా వైరా రోడ్డు కవర్ చేస్తూ సాగుతాయన్నారు. సింగరేణి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల నుండి ఇల్లెందు రోడ్డు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ర్యాలీ వస్తుందని అన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ర్యాలీ మండల కేంద్రం నుంచి ఖమ్మం నగరానికి చేరుకుంటుందని అన్నారు. బోనకల్, చింతకాని, ఖమ్మం 1 టౌన్ మండలాలకు చెందిన వాహనాలు ముస్తఫా నగర్ చర్చి కాంపౌండ్, జడ్పీ సెంటర్ మీదగా వస్తాయని, ముదిగొండ, ఖమ్మం 3 టౌన్ మండలాలకు చెందిన వాహనాలు ప్రకాష్‌నగర్, శ్రీనివాస్‌నగర్, గాంధీచౌక్‌లను కవర్ చేసుకుంటూ కళాక్షేత్రానికి చేరుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్, కొమ్ము శ్రీను, ఊరడి సుదర్శన్‌రెడ్డి ఎర్ర శ్రీనివాస్, ఎస్.నవీన్‌రెడ్డి, కూసుమంచి, నేలకొండపల్లి మండల కార్యదర్శులు రమణారెడ్డి, కెవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఈ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం విద్యుత్ ఎస్ఇ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఎన్పీడీసీఎల్ కార్యదర్శి ఎం.ప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, అన్ మేన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, ట్రాన్స్కో సీబీడ్, ఎస్ఎంజి కార్మికుల సమస్యల పరిష్కరించాలని, మీటర్ రీడింగ్ , ప్రైవేట్ బిల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2011 జేఎల్ఎంలకు వేతన బకాయిలు ఇవ్వాలని, అందరికీ పెన్షన్, అర్హులందరికీ ప్రమోషన్, మిగిలిపోయిన కార్మికుల ఆర్టీజన్‌గా గుర్తించుట సబ్ స్టేషన్‌లో రిటైర్ అయిన ఉద్యోగుల తొలగించి కార్మికులతో నింపాలని అన్నారు. ఈనెల 15వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమంను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ నిరాహార దీక్షలలో అధ్యక్షులు బి.పుష్పరాణి, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి యస్.సీతయ్య, గంట శీను, జిల్లా ట్రెజరర్ కృష్ణమూర్తి, మీటర్ రీడింగ్ కార్మికులు పాల్గొన్నారు.



ఎర్ర నరసింహారావుకు నివాళి

నవ తెలంగాణ - ఖమ్మం

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఐదు దశాబ్దాల పాటు కార్మికుల హక్కుల కోసం, కార్మిక సమస్యల పరిష్కారం కోసం దడవాయి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎర్ర నరసింహారావు ఎనలేని కృషి చేశారని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అన్నారు. మంగళవారం ఎర్ర నరసింహారావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి శ్వేత పూలమాల వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా నాయకులు బండారు యాకయ్య, దడవాయి సంఘం నాయకులు మోటే కుమార్, సైదులు, బి.నరసింహారావు, సాయి, ఎర్ర నరసింహారావు కుటుంబ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, ఎర్ర మల్లికార్జున్, ఎర్ర నగేష్, పాల్గొన్నారు.

పోలంపల్లి సైదులు మరణం పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సానుభూతిపరుడు పోలంపల్లి సైదులు(50) మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటని పార్టీ మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి అన్నారు. గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సైదులు మంగళవారం మరణించారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భౌతికకాయాన్ని కె.వి రామిరెడ్డి సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పెదపాక భాస్కరరావు, టిఆర్ఎస్ నాయకులు మరికంటి రేణుబాబు, ప్రముఖ పాత్రికేయులు పోలంపల్లి నాగేశ్వరరావు, పెదపాక నారాయణ, పెదపాక మల్లేశ్వరరావు, పసుపులేటి నారాయణ, కాసాని వీరస్వామి, పెదపాక వెంకటేశ్వర్లు, గోపి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా రెండువేల గ్రామాల చరిత్ర నమోదు

తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ సాహిత్య అకాడమి చేపట్టిన "మన ఊరు –మన చరిత్ర" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండువేల గ్రామాల చరిత్ర నమోదు అయ్యిందని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. ఒక సంవత్సర కాలంగా సాహిత్య అకాడమి డిగ్రీ విద్యార్థులచే సొంత ఊళ్ళ చరిత్రను రాయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అపూర్వమైన స్పందన లభించిందని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల విద్యార్థులు రాసిన 568 గ్రామాల చరిత్రను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ముహమ్మద్ జాకీరుల్లా విద్యార్థులు కలిసి సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా గౌరిశంకర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ విద్యార్థులు 568 గ్రామాల చరిత్రను రాయడం ఒక నూతన చరిత్రకు శ్రీకారం చుట్టినట్లయ్యిందని, ఇది గర్వించదగిన విషయమని తెలిపారు. జిల్లా కలెక్టరు గౌతమ్ మాట్లాడుతూ చరిత్రను నిర్మిస్తున్న ప్రజలదే అసలు చరిత్ర అన్నారు. ఊరి చరిత్రను రాసిన వారిని ఊరు ఎప్పటికి గుర్తు పెట్టుకుంటుందని ఆయన తెలిపారు. విద్యార్థులు రాసిన 568 గ్రామాల చరిత్ర ప్రతులను కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ జాకీరుల్లా సాహిత్యఅకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, కలెక్టర్ గౌతమ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.వి.రెడ్డి, వైస్–ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జీవన్ కుమార్, వైస్–ప్రిన్సిపాల్ డాక్టర్.సీతారాం, డాక్టర్ మిల్టన్, చరిత్ర శాఖాధ్యక్షులు డాక్టర్ జె.రమేష్, తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ సర్వేశ్వరరావు, కామర్స్ విభాగాధ్యక్షులు డాక్టర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

కాంగీ'రేసు'లో గోలగోల

- విజయభేరి సన్నాహక సభలో వివాదం
- ఆధిపత్యానికి ఆయా వర్గాల ఆరాటం
- పరస్పర కామెంట్లతో అతలాకుతలం
- బయటకు వెళ్లిన భట్టి... సముదాయించిన పొంగులేటి
- తీరుమారని కాంగ్రెస్ నేతల తీరుపై అభిమానుల ఆగ్రహం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



'ఖమ్మం అంటే కాంగ్రెస్...కాంగ్రెస్ అంటే ఖమ్మం' అనే రీతిలో గత రెండు శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఫలితాలు వచ్చాయి. అధికార బీఆర్ఎస్ ఈసారి ఎలాగైనా మెరుగైన ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ఉంటే...దానికి ఊతమిచ్చే పరిస్థితులు కాంగ్రెస్‌లో నెలకొన్నాయి. ఖమ్మం మాజీ ఎంపీ, టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగినా...ఆ పార్టీకి అంతర్గత వర్గ పోరు చేటు తెచ్చేలా ఉంది. ఏ సమావేశమైనా కుమ్ములాటలు... వర్గపోరుతో అట్టుడికే కాంగ్రెస్ నేతల తీరుపై ఆ పార్టీ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించే విజయభేరి సభ విజయవంతం కోసం ఖమ్మం డీసీసీ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. ఆధిపత్య పోరుతో అతలాకుతలం అయింది.

ఆధిపత్యం కోసం ఆరాటం..వర్గ విభేదాలతో కామెంట్లు...

ఖమ్మంలో రాహుల్‌గాంధీ హాజరైన ప్రజాగర్జన సభను సక్సెస్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు సోనియాగాంధీ, కాంగ్రెస్ అధినాయకత్వం పాల్గనే విజయభేరి సన్నాహక సమావేశంలో మాత్రం వర్గ విభేదాలతో గోలగోల చేశారు. ఏఐసీసీ నుంచి ఖమ్మం పార్లమెంట్ పరిశీలకులుగా వచ్చిన మహ్మద్ నజీమ్‌ఖాన్ సమక్షంలోనే మాటల యుద్ధానికి దిగారు. సమావేశం ప్రారంభం కాగానే 'రాయలదే పాలేరు' అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోరులో ఓడిన రాయల నాగేశ్వరరావు అభిమానులు నినాదాలు చేశారు. వారిని వారించే లోపే.. భట్టి సీఎం అంటూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వర్గీయులు స్లోగన్‌లు ఇచ్చారు. ఇంతలో రేణుకాచౌదరి వర్గీయులు నినాదాలు అందుకున్నారు. రేణుకాచౌదరి జిందాబాద్... రేణుకా సీఎం అంటూ నినదించారు. మరోవైపు నుంచి పోట్ల నాగేశ్వరరావు వర్గీయులు బీసీలకు అన్యాయం...జనరల్ సీట్లలో ఒకటైనా ఇవ్వాలని నినాదాలు చేశారు. పోట్ల బీసీ కానప్పటికీ ఆయన వర్గీయులు ఈ రకమైన నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. సంప్రదాయంగా బీసీలకు ఇస్తున్న కొత్తగూడెం స్థానం నుంచి పొంగులేటి బరిలో నిలుస్తారనే ప్రచారం సాగుతోంది. పొంగులేటి పోటీ చేస్తే పోట్లకు టిక్కెట్ రాదు కాబట్టి వ్యూహాత్మకంగా మాజీ ఎమ్మెల్సీ వర్గీయులు ఈ రకంగా వ్యవహరించినట్లు చర్చ సాగింది.

భట్టి బయటకు...పొంగులేటి సముదాయింపు...

కార్యకర్తలను సముదాయించి సమావేశం సజావుగా సాగేలా చూడాల్సిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క జూమ్ మీటింగ్ పేరుతో అర్ధంతరంగా బయటకు వెళ్లిపోయారు. వెంటనే పొంగులేటి శ్రీనివాసరెడ్డి మైక్ తీసుకుని " టిక్కెట్ల విషయంలో ఏఐసీసీదే తుది నిర్ణయం...ఎవరికి టిక్కెట్లు ఇచ్చినా గెలిపించుకోవాలి. ఇదీ సోనియాగాంధీ రాక సందర్భంగా ఏర్పాటు చేసిన విజయభేరి సభ సన్నాహక సమావేశం.. ఇటువంటి సమావేశంలో మనం ఇలా గోల చేయడం కరెక్టు కాదు' అని సముదాయించారు.

ఈసారి రేణుకా వర్గీయుల వంతు...

ఆ తర్వాత ఏఐసీసీ పరిశీలకునితో పాటు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్... ఇలా ఒకరి తర్వాత మరొకరు మాట్లాడారు. ఈ క్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు మాట్లాడు తుండగా...రేణుకా వర్గీయులు అడ్డుకున్నారు. జిల్లాపై ఈయన పెత్తనం ఏంటి? అంటూ కేకలు వేశారు. అంతలోనే మరికొందరు 'అమ్ముడు బోయేమంటూ...' రేణుకాచౌదరిని ఉద్దేశించి కామెంట్స్ చేశారు. మరోవైపు నుంచి 'వెనుక వచ్చిన వాళ్లకు ప్రాధాన్యత ఏంటి?' అంటూ పొంగులేటిని ఉద్దేశించి మరికొందరు మాట్లాడకొచ్చారు. 'కలిసికట్టుగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని..విజయభేరి సభను విజయవంతం చేయాలని' చెప్పాల్సిన విషయాన్ని చెప్పి పొంగులేటి కూడా సమావేశం నుంచి నిష్క్రమించారు. మొత్తమ్మీద జిల్లా కాంగ్రెస్‌లో నెలకొన్న ఈ వివాదం అధికారపార్టీలో ఫుల్‌జోష్‌ను నింపింది. పార్టీ అభిమానులు మాత్రం నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. అందరూ వెళ్లాక కొంత సేపటికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వచ్చి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు జరిగిన గలాట గురించి మాటమాత్రమైనా ప్రస్తావించకుండా విజయభేరి సభపై ప్రసంగించి విలేకరుల సమావేశాన్ని ముగించారు. విలేకరుల అడిగిన ప్రశ్నలకు కూడా దాటవేత సమాధానాలు చెప్పుకొచ్చారు.

'విజయభేరి' మోగిద్దాం...

- 17న హైదరాబాద్‌లో బహిరంగసభ
- చారిత్రక డిక్లరేషన్స్ ప్రకటించనున్న సోనియా
- 15, 16, 17 తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు
- సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 17వ తేదీన హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించే 'విజయభేరి' భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. 15, 16, 17 తేదీల్లో నిర్వహించే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల్లో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో సోనియాగాంధీ చారిత్రక డిక్లరేషన్స్‌ను ప్రకటిస్తారని తెలిపారు. స్థానిక సంజీవరెడ్డి భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ పరిశీలకులు ఆరిఫ్‌నసీంఖాన్‌తో కలిసి మాట్లాడారు. జాతరలా సాగే సీడబ్ల్యూసీ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న పీసీసీ, డీసీసీ నేతలతో పాటు సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీలు, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే హాజరవుతారని వివరించారు. 17 నిర్వహించే బహిరంగసభలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం కోసం సోనియాగాంధీ చారిత్రక డిక్లరేషన్స్‌ను ప్రకటిస్తారన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్...

బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై నేటి నుంచే చార్జిషీట్ మొదలైందన్నారు. 17న సభ ముగిశాక, 18న సీఎల్పీ లీడర్స్, పీసీసీ నేతలు, సీడబ్ల్యూసీ సభ్యులు కలిసి ఇంటింటికీ గ్యారెంటీ కార్డు పంపిణీ చేస్తారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి వందరోజుల్లోనే హామీలను అమలు చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే...

బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని సీఎల్పీ నేత తెలిపారు. బీఆర్ఎస్ బీజేపీకి బీటీమ్ అని, ఈ రెండు పార్టీలూ ఒక్కటే అన్నారు. సంపదను బహుళజాతి సంస్థలకు దోచిపెట్టే ఈ పార్టీలను సాగనంపి, పీపుల్స్ గవర్నమెంట్‌ను కాంగ్రెస్ ద్వారా తెచ్చుకోవాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో ప్రచార ఆర్భాటం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజోపయోగ పథకాలు ఏమీ లేవని నసీంఖాన్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కొత్వాల్, ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, జావీద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలో ఇటీవల మృతి చెందిన వెంగన్నపాలెం గ్రామానికి చెందిన చీమకుర్తి నాగరత్నం, కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బాణోత్ గురజాలి, భూక్య పుల్లారావు తదితర కుటుంబ సభ్యులను మంగళవారం వైరా శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ఎంపీపీ లావుడియా సోని, జడ్పీటీసీ, భూక్య కళావతి, మండల అధ్యక్షులు పొన్నెకంటి సతీష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు యదళపల్లి వీరభద్రం, సర్పంచ్ శాంతిరాం, జిల్లా నాయకులు, మండల నాయకులు వేల్పుల నరసింహారావు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

నవతెలంగాణ-పినపాక

నేడు పినపాక మండలం ఈ.బయ్యారంలో గల 33/11 కేవీ విద్యుత్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పరచినట్లు ఏఈ కావ్య తెలియజేశారు. ఈ వినియోగదారుల లోకల్ కోర్టుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మెన్ వేణుగోపాల చారీ హాజరు అవుతారని తెలిపారు. ఫిర్యాదులు ఉదయం గం.10.30 నుండి మధ్యాహ్నం గం.1.00 వరకు స్వీకరించబడునని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈ కావ్య కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ వీరారెడ్డి, లైవ్ ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రిపోర్టర్ సదానందంకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం సీనియర్ రిపోర్టర్ కరాటే సదానంద అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు ఆర్కె.ట్రస్ట్ అధినేత కె.వి.రంగా కిరణ్ మానవతా దృక్పథంతో సహాయం చేశారు. మంగళవారం సదానందం ఇంటికి వెళ్లి విలువైన నిత్యవసర వస్తువులు, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు. సదానందం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సదానందం స్నేహితులు, విలేకరుల ద్వారా తెలుసుకున్న రంగా కిరణ్ చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బాబు, మహమ్మద్ షఫీ, సీమకుర్తి రామ కృష్ణ, కరాటే మాస్టర్ ఈ. మొగిలి, అఫ్జల్ పటాన్, సురేష్, రాందాస్, మోహన్, కొట్టి నవీన్, రాజ్ కుమార్, నరేష్, బిజెపి ఓబీసి మోర్చా రాష్ట్ర ప్రధాన ప్రతినిధి చింతల చెరువు శ్రీనివాస్, జిల్లా నాయకులు జల్లారపు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు

- మండల మెడికల్ ఆఫీసర్ కనకం తనుజ

నవతెలంగాణ-చంద్రుగొండ

వర్షాలు పెరుగుతున్న నేపథ్యంలో విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని ముందస్తుగా చర్యలు చేపట్టడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ తెలిపారు. మంగళవారం మండలంలోని తుంగరం పంచాయతీలో మూడోసారి హెల్త్ క్యాంపు నిర్వహించారు. సుంకర బంజారా, జర్పులత తండా, మహమ్మద్ నగర్ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మ, చంద్రకళ, శ్రీదేవి, శాంతి, ఎంఎల్‌హెచ్ఎస్ యాసిన్, సాయిబాబా, హెల్త్ అసిస్టెంట్స్ శీను, ఆశలు పాల్గొన్నారు.

విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం, లయన్స్ సమర్పణ క్లబ్ కొత్తగూడెం సహకారంతో భద్రాచలం పట్టణంలోని స్థానిక నన్నపనేనిమోహన్ హై స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ టైలరింగ్ చార్జెస్ కోసం రూ.5600 వితరణగా అందించారు. స్కూల్ మౌలిక అవసరాల కోసం స్వచ్ఛందంగా ముందుకు రావా లని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సమర్పణ కొత్త గూడెం అధ్యక్షులు నిట్ట సమాధానం, భద్రాచలం క్లబ్ అధ్యక్షులు భీమవరపు వెంకటరెడ్డి, కార్యదర్శి శరత్, క్లబ్ సభ్యులు హెచ్ఎం బి.రాజ్యలక్ష్మి కుమారి, జి.వెంకటేశ్వర్లు, లక్ష్మి తులసి, కే.జయరాజు, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటింగ్ ప్రక్రియ, ఓటు హక్కు వినియోగంపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో వీరబాబు మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును వినియోగించు కోవాలని తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సీనియర్ సహాయకులు జయకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కల్పన, అధ్యాపకులు జయ శ్రీ, కృష్ణమూర్తి, బసవమ్మ, సత్యవతి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

15న పెన్షన్ అదాలత్

- జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్

నవతెలంగాణ-మణుగూరు

మాజీ సింగరేణిలు పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న కమ్యూనిటీ హాల్, పివి కాలనీ, మణుగూరు ఏరియా నందు పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్‌లో పని చేసిన మాజీ సింగరేణియులు తాము పొందుతున్న పెన్షన్‌కు సంబంధించిన ఏమైనా సమస్యలు, అభ్యంతరాలు ఉన్న ఎడల పరిష్కరించుకోగలరని కోరారు. ఉదయం 11.00 గంటలకు పివి కాలనీ కమ్యూనిటీ హాల్ నందు నిర్వహించబడే పెన్షన్ అదాలత్‌కు సంబంధిత ధృవీకరణ పత్రాలతో విచ్చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవలసినదిగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలియజేశారు.

తాగి అతిగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

- డీజేలకు అనుమతులు లేవు



నవతెలంగాణ-మణుగూరు

వినాయక చవితి మిలాద్ ఉన్ నబీ తదితర పండగల సందర్భంగా మద్యం సేవించి అతిగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని, డీజేలకు అనుమతులు లేవని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు తెలిపారు. మంగళవారం శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ వారం రోజుల్లో జరగబోవు పండుగ గురించి పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ ఏరియాలో ప్రతిష్ఠించే వినాయకుల విగ్రహాల గురించి, దానికి సంబంధించిన నిమజ్జనాల గురించి అదే విధంగా మీలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా, దానికి సంబంధించిన ర్యాలీ వివరాలు తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపాలిటీ, మండలాల నుంచి 30 మంది అన్ని మతస్తులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-బూర్గంపాడు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ మండలంలోని తెలుగుదేశం, ఐటీసీ టీఎన్టీయుసీల ఆధ్వర్యంలో మంగళవారం సారపాక సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని టీఎన్టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, పినపాక టీడీపీ నియోజకవర్గ నాయకులు వట్టం నారాయణ దొర, బూర్గంపాడు తెలుగుదేశం అధ్యక్షులు తాళ్ళూరి జగదీశ్వరరావు, ఐటీసీ టీఎన్టీయుసీ అధ్యక్షులు కనకమేడల హరి ప్రసాద్, గల్లా నాగభూషయ్య, నెట్టెం భాస్కర రావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటు రంగారావు మాట్లాడారు. ఈ దీక్షలో పార్టీ నాయకులు కాకర్ల సత్యనారాయణ, గల్లా నాగభూషయ్య, సిహెచ్ వెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వరరావు, మాదినేని నాగేశ్వరరావు, కట్ట శ్రీనివాసరావు, కుందేటి శ్రీనివాసరావు, నిమ్మల నరసింహారావు, తోట శివయ్య, దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, టీఎన్టీయుసీ నాయకులు పాల్గొన్నారు.

మణుగూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అరెస్ట్ చేసి రిమాండ్ చేసిన సందర్భంగా మంగళవారం నియోజకవర్గం టీడీపీ నాయకులు మణుగూరులోని అభయాంజనేయ స్వామి గుడి వద్ద చంద్రబాబు బెయిల్ మీద బయటకు రావాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి తాత మాధవి లత, నాయకులు చందా మధు, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల నడ్డి విరుస్తున్న పాలకులు

- ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-పాల్వంచ

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పేద ప్రజల నడ్డి విరిస్తున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ వ్యవస్థ పటిష్ఠ పరచాలని రేషన్ షాపుల్లో 14 రకాల సరుకులు ఇవ్వాలని, నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని, కూరగాయల ధరలు, గ్యాస్ ధరలు తగ్గించాలని కలెక్టరేట్ ఎదుట మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతర నాదెండ్ల లీలావతి అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, గ్యాస్ రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని ఈ ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయన్నారు. అనంతరం డీఆర్ఓకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డి.లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి సందకూరి లక్ష్మి, జి.జ్యోతి, సరోజినీ, క్రాంతి, సిహెచ్ రమ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విచ్ఛిన్నం చేస్తే చూస్తూ ఊరుకోము

- అంగన్వాడీలకు అండగా సీపీఐ(ఎం)
- రెండో రోజు సమ్మెను ప్రారంభించిన మచ్చా













నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అంగన్వాడీ సమ్మెను విచ్ఛిన్నం చేస్తే చూస్తూ ఊరుకోమని, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా, కోర్కెలను పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజవర్గ ఇన్‌చార్జి మచ్చా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా రెండవ రోజు సమ్మె శిబిరాన్ని ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రయత్నిస్తే, స్వయంగా మంత్రే యూనియన్‌లతో చర్చలు జరిపారని అన్నారు. చర్చల్లో అంగీకరించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ని కుదించారని, ఎటువంటి షరతులు లేకుండా మినీ టీచర్స్‌ని మెయిన్ టీచర్స్‌గా గుర్తిస్తామన్న హామీని విస్మరించి, అనేక షరతులతో మినీలను మెయిన్ టీచర్స్‌గా గుర్తుస్తామని సర్క్యులర్ విడుదల చేశారని అన్నారు. స్వయంగా మంత్రే చర్చల్లో ఇచ్చిన హామీలకు దిక్కే లేకుండా పోయిందన్నారు. వేతనాలు పెంపుదల, పర్మినెంట్, ప్రమాద భీమా, జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వడం వంటి సమస్యలపై దాట వేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. భద్రాచల పట్టణంలో గ్రామపంచాయతీ ఈవో పోలీస్ సహకారంతో అంగన్వాడీ సూపర్వైజర్లు సెంటర్ల తాళాలు పగలగొట్టడం చాలా దుర్మార్గమని, ఈ దాడులు ఆపకపోతే పోరాటం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రయత్నాలను విరమించుకోకపోతే వారందరినీ అడ్డుకుని తీరుతామని ఆయన అన్నారు. ధనిక రాష్ట్రంగా గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడానికి ఎందుకు చేతులు రావడం లేదని ప్రశ్నించారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల పేరిట కోటాను కోట్ల రూపాయలను వృధాగా ఖర్చు చేసిన ప్రభుత్వానికి అంగ్నవాడీల వేతనాలు భారంగా మారాయా అని సూటిగా ప్రశ్నించారు. సీఐటీయూ పట్టణ కోకన్వీనర్ మర్లపాటి రేణుక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి, టౌన్ నాయకులు ఎన్.నాగరాజు రామిరెడ్డి, సీనియర్ నాయకులు, బిబిజి తిలక్, అంగన్వాడీ యూనియన్ నాయకులు, టీచర్లు, మినీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు స్థానిక ప్రజల అండ

అంగన్వాడీల సమ్మె విచ్ఛిన్నానికి ఇతర స్కీం వర్కర్లను ఉపయోగించుకోవాలన్న ప్రభుత్వ ఎత్తుగడలను ఆయా శాఖ స్కీం వర్కర్లు వ్యతిరేకించి అంగన్వాడీల సమ్మెకు మేము అండగా నిలుస్తాం తప్ప సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం చేతిలో పాములు కామని తేల్చి చెప్పి ఉద్యమ స్ఫూర్తిని చాటారు. వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రేపటినుండి తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని అంగన్వాడి కార్యకర్తలు తేల్చి చెప్తున్నారు.

నిర్బంధం ప్రయోగించడం ఆపాలి

చర్ల : రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లు నిర్వహిస్తున్న సమ్మెపై ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా నిర్బంధాన్ని ప్రయోగించటాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీ సమ్మెపై ప్రభుత్వ దౌర్జన్య కాండను నిరసిస్తూ చర్ల మండల కేంద్రంలో రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బ్రహ్మాచారి మాట్లాడారు. దౌర్జన్యంగా అధికారులు తాళాలు పగలగొట్టి అంగన్వాడీ కేంద్రాలను స్వాధీనపరుచుకునే చర్యలను సీఐటీయూ తప్పుపట్టింది. చట్టబద్ధంగా జరుగుతున్న సమ్మెపై ప్రభుత్వం దౌర్జన్యకాండము పూనుకోవటం హేయమైన చర్యగా సీఐటీయూ పేర్కొన్నది. ఆగస్టు 18వ తారీఖున ఉమ్మడి చర్చల సందర్భంగా మంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటమే సమ్మెకు ప్రధాన కారణమని సీఐటీయూ పేర్కొన్నది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.విజయశీల, సీఐటీయూ మండల నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు, నాయకులు కమల మనోహరి, నాగమణి, సావిత్రి, అనసూర్య సత్యవతి, కృష్ణవేణి, అనురాధ, రాధ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు

తెలంగాణ రాష్ట్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలకు మంత్రులకు రూ.3 నుంచి 4లక్షల పైచిలుకు వేతనాలు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న, అనేక ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్లకు ఎందుకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వటం లేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం నరేష్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రెండొవరోజు నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెకు పార్టీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని పేర్కొన్నారు. సమ్మె శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మచ్చ రామారావు, బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, నాయకులు సోడి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) నాయకులు నల్లగట్ల మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి సమ్మెను అనచాలని చూస్తే మరింత ఉధృతం చేస్తాం

కొత్తగూడెం : అంగన్వాడీ సమ్మెను అనచాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.వీరన్న హెచ్చరించారు. మంగళవారం అంగన్ వాడీల సమ్మె విషయంలో అధికారులు పాల్పడుతున్న చర్యలకు నిరసనగా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో అంగన్ వాడీలు పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడారు. అంగన్వాడీలకు పోరాడే పటిమ ఉన్నదే తప్ప, పారిపోయే పిరికితనం లేదని ఉద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు గుర్తించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అంగన్వాడి జిల్లా నాయకులు జి.పద్మ కళావతి, మాధవి, శైలజ, సరోజ, పుష్ప, భాగ్యలక్ష్మి, జుబేదా, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : శాంతియుతంగా సమ్మె చేస్తున్న మా పై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించడం ఆపాలని సీఐటీయూ నుండి అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, ఏఐటీయుసీ నేత దేవరకొండ శంకర్, బంధం నాగయ్య అన్నారు. మంగళవారం 2వ రోజు సమ్మె శిబిరాన్ని సీఐటీయూ సీనియర్ నేత కూకట్ల శంకర్ ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. అంగన్వాడీ నేతలు కల్లెపల్లి మరియ, ఫాతిమా, చాట్ల రాంబాయి,నాగలక్ష్మి వసంత, బత్తుల దేవేంద్ర,కారం పద్మ సుజాత, వెంకట రమణ, యాకమ్మ సోమ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు శ్రీవాణి, చందా సంతోష్ సంఘీభావం

మణుగూరు : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుయేట్ రిటైర్మెంట్ వర్తింపజేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్ నిరువదికి నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరంలో కూర్చున్నారు. రెండవ రోజు కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ కన్వీనర్ చందా సంతోష్, సమత్, బట్ పల్లి సర్పంచ్ పోలబోయిన శ్రీవాణి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ శిబిరంలో సంఘీభావానికి వచ్చినవారు ఏఐటీయూసీ నాయకులు అక్కి నరసింహారావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, సీఐటీయూ మండల కన్వీనర్ ఉప్పతల నరసింహారావు, అంగన్వాడీ నాయకురాలు హేమలత, వెంకటరమణ, శ్యామల, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యం

దుమ్ముగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్స్ సిఐటీయు, ఏఐటీయుసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో పాల్గొనడంతో 90 శాతం అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయని ఇది జీర్ణించుకోలేనిరాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల చేత అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొడుతూ దోపిడీ దొంగల్లా వ్యవహరిస్తున్నారని జీపీజీఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి కారం పుల్లయ్య, ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం లక్ష్మీనగరం స్టేట్ బ్యాంకు ఎదురుగా అంగన్వాడీలు చేపడుతున్న రెండవ రోజు సమ్మె శిబిరాన్ని వారు సందర్శించారు. అనంతరం స్టేట్ బ్యాంకు నుండి లక్ష్మీనగరం ప్రధాన సెంటర్ మీదుగా ములకపాడు వరకు వందలాది మంది అంగన్వాడీలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు, ఏఐటీయుసి నాయకులు కొండపల్లి శ్రీధర్, యాస నరేష్, వి.మల్లికార్జున్, రామిరెడ్డి, నిమ్మల మధు, కృష్ణవేణి, కమలాదేవి, గజలక్ష్మీ, రమణ, బేబీ, బుచ్చమ్మ, సరోజిని, శీలం లక్ష్మీలతో పాటు వందలాది మంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

ములకలపల్లి : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు తమ న్యాయమై డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సమ్మెలు విచ్ఛిన్నం చేయడానికి మండల పరిధిలోని మాధారం అంగన్వాడీ కేంద్రం తాళాలు పగలగొడుతుండగా సీపీఐ(ఎం) నాయకులు అడ్డుకున్నారు. సమ్మె చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తుల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అడ్డుకున్న వారిలో పార్టీ నాయకులు పూకంటి రవికుమార్, వినోద్, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

దమ్మపేట : అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మెకు వ్యతిరేకంగా అధికారులు బెదిరింపులకు పాల్పడితే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పై తీవ్ర ఒత్తిడి తెచ్చి సమ్మెలోనే పాల్గొంటామని, ఏటువంటి బెదిరింపులకు భయపడేదే లేదని రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులకు అంగన్వాడీ టీచర్లు హెచ్చరిక జారీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరమ్మ, పద్మ, జ్యోతి, తిరుపతమ్మ, వాణి, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, వజ్రమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : అధికారులు బెదిరిస్తే, బెదిరిపోమని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ మంగళవారం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టేకులపల్లిలో అంగన్వాడీల సమ్మెను రెండవ రోజు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ టేకులపల్లి ప్రాజెక్టు నాయకురాలు కొండపల్లి శకుంతల, ఏఐటీయూసీ వై.ఇందిరా, పద్మ, పి.రాజేశ్వరి, బి.లోకేశ్వరి, ఎం.చాందిని తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : అంగన్ వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో అంగన్ వాడి టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవదిక సమ్మెకు ఆయన మద్దతు తెలియజేశారు. అనంతరం మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో వామపక్ష అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్లు, ప్రగతి భవన్ ముట్టడి నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వల్లమల్ల చందర్ రావు, లకావత్ శ్రీను, రెడ్డిబోయిన గోవిందు, సీపీఐ మండల కమిటీ సభ్యులు ఎల్లంకి మధు, ఎస్.కె చాంద్ పాషా, సీపీఐ(ఎం) మండల నాయకులు బలు లక్ష్మయ్య, గార్లపాటి పవన్ కుమార్, బోడ అభిమిత్ర, కడియాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయికి కన్నీటి వీడ్కోలు

- నివాళ్లర్పించిన కూనంనేని, సాబీర్ పాషా, రావులపల్లి
- భౌతికఖాయాన్ని సందర్శించిన కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ(ఎం), టీడీపీ శ్రేణులు
- అశృనయనాల నడుమ అంతిమ యాత్ర



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సీపీఐ నాయకుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బల్లా సాయికుమార్‌కు మంగళవారం కన్నీటి తుది వీడ్కోలు పలికారు. ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందిన విషయం విధితమే. ఆయన మృతదేహాన్ని భద్రాచలంలోని కొత్తకాలనీలో గల స్వగృహంలో ఉంచారు. సాయి మరణ వార్త తెలుసుకున్న పలువురు తండోపతండాలుగా తరలివచ్చి పార్థివదేహంపై పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సాయి భౌతికఖాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి, పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నతనంలోనే మృతి చెందడం బాధాకరమని అన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడారు. రాబోయే రోజుల్లో సాయి ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

పలువురి నివాళి : బల్లా సాయికుమార్ మరణ వార్త తెలుసుకున్న పలువురు ఆయన భౌతక ఖాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య సాయి నివాస గృహానికి చేరుకుని మృతదేహం పై పుష్పగుచ్ఛాలను ఉంచి మౌనం పాటించారు. బీఆర్ఎస్ నాయకులు డా.తెల్లం వెంకట్రావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, అరికెల్ల తిరుపతి రావు తదితరులు సాయి మృతదేహం వద్ద నివాళ్లర్పించారు.

కామ్రేడ్ బల్లా సాయికుమార్‌కు సీపీఐ(ఎం) నివాళి

బల్లా సాయి కుమార్‌కు సీపీఐ(ఎం) నియోజకవర్గ కమిటీ నివాళులు అర్పించింది. సాయికుమార్ పార్థివ దేహనికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, కో కన్వీనర్ కారం పుల్లయ్యలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, ఎంబీ నర్సారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బిబిజి తిలక్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, ఎన్.లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, కుంజ శ్రీనివాస్, కోరాడ శ్రీనివాస్, లక్ష్మణ్, నాగరాజు, ఎస్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అనంతరం టీడీపీ నాయకులు ఎస్కే అజీం సాయితో ఉన్న అనుబంధాని గుర్తు చేసుకున్నారు.

అంతిమయాత్ర : బల్లా సాయికుమార్ అంతిమయాత్ర అశృనయనాల మధ్య సాగింది. ఎర్రజెండాలను మృతదేహంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఆయన నివాస గృహం నుండి ప్రారంభమైన తుదియాత్ర ఇండస్ట్రియల్ ఏరియా మీదుగా కొత్తమార్కెట్, అంబేద్కర్ సెంటర్, సినిమాహాల్ సెంటర్ నుండి స్మశాన వాటిక వరకు సాగింది. ఈ అంతిమ యాత్రకు స్నేహితులు, అభిమానులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, సన్నిహితులు వేలాదిగా తరలివచ్చారు.

ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ప్రియాంక అలా



నవతెలంగాణ-అశ్వాపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రియాంక అలా కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ ఆరోగ్య మహిళా కేంద్రంలో ప్రతి మంగళవారం 8 రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలను ప్రత్యేక మహిళ వైద్య నిపుణుల చేత పరీక్షిస్తారన్నారు. రక్త పరీక్షలు నిర్వహించి బ్రెస్ట్ కాన్సర్‌తో పాటు మరి ఇతర రకాల క్యాన్సర్‌ను కనుగొనేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

మండలంలోని 74 అంగన్వాడీ కేంద్రాలలో పరిసరాల పరిశుభ్రతను చేపట్టాలని మండల పంచాయతీ అధికారి శ్రీనివాసును కలెక్టర్ ఆదేశించారు. శుభ్రపరచిన తరువాత అన్ని కేంద్రాల ఫోటోలను తనకు పంపాలన్నారు. మండల కేంద్రంలోని ఐదవ అంగన్వాడీ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. అక్కడికి చేరుకున్న బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని అందజేసి, మాట్లాడారు. అనంతరం సీతారామపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, అడిషనల్ డీఅండ్ఎంహెచ్ఓ, ఐసీడీఎస్ పీడీ వేల్పుల విజేత, ఎంపీపీ ముత్తినేని సుజాత, జడ్పీటీసీ సూది రెడ్డి సులక్షణ, తహశీల్దార్ రమాదేవి, వైద్య అధికారి సంకీర్తన, సీడీపీఓ సీతారాములు, డీపీఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని గణేష్ పాడు నాగుపల్లిలో గ్రామంలో గాలికుంటు టీకాల కార్యక్రమం పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మన్యం రమేష్ బాబు మాట్లాడారు. ఆగస్టు ఏడో తారీఖు నుంచి సెప్టెంబర్ ఆరు వరకు మండలంలో జరిగిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల మీద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి, టీకాలు చేయబడిన 26 పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించినట్టు తెలిపారు. ఈ రక్తన మూలాల నుంచి వ్యాధి నిరోధక శక్తిని అంచనా వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డయాగ్నొస్టిక్ లాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుణ, ట్రైనింగ్ డాక్టర్స్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ అండ

- ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన ఎస్పీ



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ టి.రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు ఎస్పీ డాక్టర్.వినీత్.జి మంగళవారం ఎస్పీ కార్యాలయంలో రూ.60,000ల చెక్కును అందజేశారు. ఈ నగదును కార్పస్ ఫండ్ నుండి అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మరణించిన పోలీసులు కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ జయరాజు, జిల్లా పోలీస్ అధికారుల సంఘము అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఏసోబు, శ్రీనివాస్ సభ్యులు సుధాకర్, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-టేకులపల్లి

ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆశ్రమ ఉన్నత పాఠశాల కోయగూడెంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా శాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో గత 12 ఏండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం గత 11 రోజుల నుండి నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్ల పరిష్కారం కోసం చర్చలకు పిలవకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.వీరన్న, బి.కస్నానాయక్, టి.హరిలాల్, జి.భీమ్లా, డి.కృష్ణ, కవిత పాల్గొన్నారు.

రాపిడ్ ఫీవర్ సర్వే

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాటాయి గూడెం, ములకపాడు గ్రామాలలో వైద్య సిబ్బంది మంగళవారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. రాపిడ్ ఫీవర్ సర్వేను వైద్యాధికారి పుల్లారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిలోపల గల నీటి వనరులలో గల దోమల లార్వాను కనుగొని తొలగించారు. ఆర్ఎంపిలను ఆశ్రయించి డబ్బులు వృధా చేసుకోవద్దని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలోనే మెరుగైన వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ గౌడ్, ఏఎన్ఎం లీలాకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..

ఆర్టీసీ బస్సు..బొలేరో ఢీ

- ప్రాణాలతో బయట పడ్డ డ్రైవర్, ప్రయాణికులు

ఆళ్ళపల్లి : ఆర్టీసీ బస్సు, బొలేరో వాహనం ఢీకొన్న ఘటన ఆళ్ళపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఘటనా స్థలిలో ఉన్న వారి వివరాల ప్రకారం.. ఆళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన గోగుల సతీష్ తన సొంత చేను పనికి తన బొలేరో వాహనంలో కూలీలను దింపి రావడానికి డ్రైవర్‌కు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో మర్కోడు గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బొలేరో వాహనాన్ని తిర్లాపురం సమీపంలో కల్వర్టు సమీపంలో మూల మలుపు చోట ఢీకొంది. దాంతో బొలెరో ముందు భాగంలో ఎక్కువగా, బస్సు ముందు భాగంలో పాక్షికంగా భాగాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు బొలేరో డ్రైవర్, బస్సు డ్రైవర్, ప్రయాణికులు ఎటువంటి గాయాలపాలు కాకుండా ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో చిరు జల్లులు పడుతుండడంతో బ్రేకులు పడకపోవడమే ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. బొలేరో డ్రైవర్ కసనబోయిన సన్నీ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎస్.రామకోటి పై ఎస్సై రతీష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డీజిల్ దొంగలు అరెస్ట్

దుమ్ముగూడెం : ఈ ఏడాది జూలై నెలలో లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాలలో గల లారీలలో డీజిల్‌ను దొంగిలించిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్సై కేశవరావు తెలిపారు. మంగళవారం ములకపాడు సెంటర్లో వాహన తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఆయన తెలిపారు.

వారిలో తెల్లం నాగరాజు, దబ్బనుతల గ్రామం సోయం సింగరాజు, పోడియం రమేష్‌లు డి కొత్తూరు గ్రామం ములకలపల్లి మండలంగా తెలిపారు. లారీలలో డీజిల్‌ను దొంగిలించి అమ్ముకున్నామని నేరాన్ని ఒప్పుకోవడంతో వారి వద్ద నుండి రూ.15 వేలను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మందా

బూర్గంపాడు : బూర్గంపాడు మండల కేంద్రంలో ఉన్న మార్కెట్ యార్డులో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థాయి నాయకులు డీసీసీ అధ్యక్షుడు ఆదేశం మేరకు బూర్గంపాడు గ్రామ కాంగ్రెస్ కమిటీ కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం బూర్గంపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గంపూడి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బూర్గంపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మందా నాగరాజు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అదేవిధంగా 20 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బూర్గంపాడుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుతో పాటు భజన సతీష్, కైపు శ్రీనివాసరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాసరి సాంబ, నయీం, పెంటింగ్ పాషా, నాగ మురళి, హుస్సేన్, దేగల ధర్మయ్య, సత్తిపండు, గుండె వెంకన్న, మేకల రామకృష్ణ, సాధనల సాయి, మేకల నవీన్, నందు, చిప్ప రాజు, లక్ష్మణ్, వీరభద్రం, నాగరాజు, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్ పై దృష్టి సారించాలి : ఎస్సై

జూలూరుపాడు : విద్యార్థులు భవిష్యత్ పై దృష్టి సారించాలని ఎస్సై పురుషోత్తం అన్నారు. మంగళవారం ఆయన "నవతెలంగాణ"తో మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, ఉన్నత స్థానాలు అధిరోహించే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా ప్రపంచం మొత్తం నేడు అరచేతిలోనే ఉందని, స్మార్ట్ ఫోన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌ను విద్యార్థులు ఉన్నత విద్యలో మేళకువలు నేర్చుకునేందుకు నూతన టెక్నాలజీను నేర్చుకునేందుకు మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, అవసరమైతే మానసిక ఉల్లాసానికి క్రీడలు, వ్యాయామాలు, యోగాలు, వాకింగ్కు కాసేపు అవకాశం కల్పిస్తే శారీరక శ్రమ ద్వారా కొంత ఉపశమనం పొందుతారన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపైన దృష్టిసారించాలని ఎస్సై కోరారు.

ప్రభుత్వ వైద్యశాలలోనే పరీక్షలు చేయించుకోవాలి

చంద్రుగొండ : ప్రభుత్వ వైద్యశాలలోని పరీక్షలు చేయించుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి బాబూలాల్ ప్రజలకు సూచించారు. మంగళవారం సీతాయి గూడెం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ సెక్రటరీ వారి ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ , సీజనల్ వ్యాధుల నివారణ మొదలైన వాటి అందరికి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం టి.సుశీల, ఆశనారాయణమ్మ, పంచాయతీ ఉద్యోగులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అంగన్వాడీ స్టాక్

అన్నపురెడ్డిపల్లి : అంగన్వాడీ టీచర్లు వారి డిమాండ్ సాధనాలు కోసం సమ్మె చేస్తున్న సందర్భంగా మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీల్లో గల అంగన్వాడీ సెంటర్లులో గల స్టాక్ బియ్యం, పప్పు తదితర వస్తువులు అన్ని సీడీపీఓ నిర్మలజ్యోతి ఆధ్వర్యంలో సూపర్వైజర్ గంగాజలం పంచాయతీ కార్యదర్శులకు స్వాధీనం చేసుకున్నారు. సమ్మెలో టీచర్లు ఉండటం వలన పంచాయతీ కార్యదర్శులకు అంగన్వాడీలో వున్న స్టాక్‌ను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు : పోలీస్‌లు లోకల్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో మంగళవారం ఉదయం జూలూరుపాడు నుండి కొత్తగూడెం వైపుకు ఆటోలో తరలిస్తున్న అక్రమ రేషన్ బియ్యాన్ని పోలీస్‌లు పట్టుకున్నారు. చంద్రుగొండ మండలం అన్నారం తండా గ్రామానికి చెందిన కేత్ శ్రీను, పోకలగూడెం గ్రామానికి షేక్ నాగుల్ మీరా అనే వ్యక్తులు ఆటోలో తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల 95 కేజీల రేషన్ బియ్యాన్ని ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పంచనామా నిర్వహించారు. ఆటోను సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం

టీఎస్ఎన్పీడీసీఎల్ ఫోరం చైర్మెన్ వేణుగోపాలచారి

నవతెలంగాణ-ములకలపల్లి

టీఎస్ఎన్ పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అదాలత్‌లో వినియోగదారుల సమస్యలు పరిష్కారమయ్యాయని టీఎస్ఎన్పీడీసీఎల్ ఫోరం చైర్మెన్ వేణుగోపాలచారి మంగళవారం విద్యుత్ వినియోగదారులకు నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో సమస్యలకు సంబంధించి 21 ఫిర్యాదులు అందించారని వాటిలో 9 ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంబర్ (ఫైనాన్స్) ఆర్.చరణ్, ఇండిపెండెంట్ మెంబర్ ఎస్.నరేందర్, ఎస్ఈ రమేష్, డీఈ నందయ్య, ఎస్ఏవో మురళి, ఏడీఈ లక్ష్మణ్, పాల్వంచ, ములకలపల్లి మండలాల ఏఈలు, ఏఏవో శ్రీలక్ష్మి, విద్యుత్ సిబ్బంది, రైతులు, రెండు మండలాల విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ఐటీఐలో రిపోర్టింగ్‌కు 14 వరకు గడువు

నవతెలంగాణ-మణుగూరు

ప్రభుత్వ ప్రయివేటు ఐటీలలో మూడో విడత ప్రవేశంలో సీట్లు పొందిన వారు ఈ నెల 14 వరకు రిపోర్టింగ్ చేయడానికి గడువు పొడిగించినట్లు మణుగూరు ఐటీ ప్రిన్సిపాల్ జిల్లా కన్వీనర్ బి.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీలలో మూడవ విడత ప్రవేశం పొందిన వారు ఈ నెల 12లోగా సంబంధిత ఐటీఐలలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు సీటు పొంది రిపోర్టింగ్ చేయని వారి కోసం 14 వరకు గడువు పెంచినట్టు, సీట్లు పొంది రిపోర్ట్ చేయనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పకడ్బందీగా టెట్ పరీక్షకు ఏర్పాట్లు

టెట్ పరీక్ష నిర్వహణకు 37 కేంద్రాలు

- కలెక్టర్ ప్రియాంక అలా





నవతెలంగాణ-పాల్వంచ

ఎలాంటి మాల్ ప్రాక్టీసెస్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా టెట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న టెట్ పరీక్ష నిర్వహణపై మంగళవారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో చీఫ్ సూపర్నెండెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులు, రూట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టెట్ పరీక్ష నిర్వహణకు 37 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష నిర్వహణకు సీటింగ్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. ఈ నెల 15 తేదీ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉదయం నిర్వహించే మొదటి పేపర్ పరీక్షకు 37 కేంద్రాలు, సాయంత్రం నిర్వహించే రెండో పేపర్ పరీక్ష నిర్వహణకు 29 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలంలల్లో ఏర్పాటు చేసిన 37 పరీక్షా కేంద్రాల్లో 8,717 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. కొత్తగూడెంలో 16 కేంద్రాలు, పాల్వంచ మున్సిపాలిటీలో 6 కేంద్రాలు, మణుగూరులో 8, భద్రాచాలంలో 7 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సాయంత్రం నిర్వహించే రెండో పేపర్ పరీక్షకు కొత్తగూడెంలో 16, పాల్వంచలో ఒకటి, మణుగూరులో 5, భద్రాచలంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష నిర్వహణకు 380 మంది ఇన్విజిలేటర్లు, 148 మంది హాల్ సూపరింటెండెంట్లు, 37 మంది శాఖ పరమైన అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 రూట్లకు 9 మంది రూటు అధికారులు, 9 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించినట్లు చెప్పారు. టెట్ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సలహాలు, సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయపు హెల్ప్ డెస్క్‌ను కానీ, కంట్రోల్ రూము నంబర్ సాయి కృష్ణ 9396654181 నంబర్‌కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో డీఆర్వో రవీంద్రనాథ్, డీఈఓ వెంకటేశ్వరచారి, పరీక్ష నిర్వహణ సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, రూటు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో జీవితబీమా సంస్థ

- 67 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ



నవతెలంగాణ-కొత్తగూడెం

దేశ ప్రజలకు సేవ లందించడంలో జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నిరంతరం పనిచేస్తుందని కొత్తగూడెం ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కామేశ్వరరావు అన్నారు. ఎల్ఐసి 67 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎల్ఐసీ సేవలను నినదించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏబీఎం శైలజ రెడ్డి, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఎల్ఐసీ ఏజెంట్లు లియాఫీ ప్రెసిడెంట్ అల్లాడి నాగేశ్వరరావు, ట్రెజరర్ కె.శంకర్, జోనల్ మెంబర్ పి.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు దారా రమేష్, గోపికృష్ణ, మాదాసు శ్రీను, ఎనుముల వీరభద్రం, సిబ్బంది, ఏజేంట్లు, అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు సీపీఐ(ఎం) సంఘీభావం

- పోటీ వర్కర్లను పెట్టి కార్మికుల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించొద్దు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

పోటీ వర్కర్లను పెట్టి కార్మికులను తోటి కార్మికులకు శత్రువులను చేసే కుట్రలు కుయుక్తులు మాని అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండవ రోజు కొనసాగుతున్న అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో కార్మిక సంఘాలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వారికి కనీస వేతనం ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఆ హామీని అమలు చేయకపోవడం వలన అంగన్వాడీ కార్యకర్తలు మరొక పోరాటానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఆశ వర్కర్లు ఆర్పీలతో గ్రామ దీపికలతో సెంట్రల్ నడిపించాలని సర్క్యులర్లు జారీ చేయడం సరికాదన్నారు. కార్మికులకు, కార్మికులకు మధ్య ఘర్షణ వాతావరణ సూచించడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. అంగన్వాడీల పోరాటం విజయవంతం అయ్యేవరకు సీపీఐ(ఎం) వారి వెంబడి ఉంటుందని వారి పోరాటాల్లో భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, పట్టణ నాయకులు జునుమాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

- కొత్తగూడెం సర్కిల్ ఆఫీస్ ముందు నిరాహార దీక్ష
- యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్



నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యుత్ సంస్థలో అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) యూనియన్ జిల్లా అధ్యక్షులు కొలగాని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ సంస్థలో విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కొత్తగూడెం సర్కిల్ ఆఫీస్ ముందు టిఎస్‌యూఇఇయూ-సిఐటియూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. ఈ రిలే నిరాహార దీక్షలో గొల్లపల్లి వెంకన్న కూనరాజు శ్రీనివాస, లకావతు, దస్రు, మోదుగు రమేష్, శీలం వీరారెడ్డి, సాగర్, సంతోష్, భవనం రాజశేఖర్ రెడ్డి కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కొలగాని రమేష్ మాట్లాడారు. మంగళ, బుధ రెండు రోజులపాటు జరిగే రిలే నిరాహారదీక్షలను జయప్రదం చేయాలని, ఈ నెల 15వ తేదీన హైద్రాబాద్ ఇందిరాపార్క్ దగ్గర జరుగు మహా ధర్నాను కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

ఈ రిలే నిరహారదీక్ష కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లి వెంకట రాజు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, భద్రాచలం డివిజన్ నాయకులు సుదర్శన వర్మ మధుసూదన్ రావు, కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి పులి గణేశ్ బాబు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఉదయ రత్నకుమార్, కనుకు సత్యనారాయణ, రాధా కృష్ణ, ఎస్‌పీఎం వెంకన్న, జిల్లా వ్యాప్తంగా కార్మికులు పాల్గొన్నారు. మొదటి రోజు దీక్షను ఏఇ పిండి ప్రోలు బుజ్జి కన్నయ్య నిరహార దీక్షలను నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు.

ఆడపిల్లలు సమాజంలో ప్రతికూల పరిస్థితుల ఎదుర్కోవాలి



నవతెలంగాణ-చర్ల

ఆడపిల్లలు సమాజంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత స్థానాలకు చేరాలని దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు మద్దెల అన్నపూర్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దిశ ఫౌండర్ బి.వి.రాజు ఆదేశాలతో కళాశాల ప్రిన్సిపల్ బండి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మహిళా చట్టాలపై అవగా హన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడారు.

నేటి సమాజంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, ఆకృత్యాలు పెరిగిపోతున్నాయని, మహిళా చట్టాలను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. నిర్భయ, దిశ వంటి చట్టాలు మహిళల రక్షణ కోసమే ఉన్నాయని కాబట్టి ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శెట్టి ప్రసాద్, అమృతరావు, దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పూజల లక్ష్మి, జిల్లా జాయింట్ సెక్రెటరీ మాలతి, స్పోక్స్ పర్సన్ శారద, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, మంగ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు వాడపల్లి శిరీష, బొబ్బిలిపాటి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలసిన దిశ కమిటీ సభ్యులు

దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ కమిటీ మండల అధ్యక్ష, కార్యదర్శులు శిరీష, సావిత్రిల నేతృత్వంలో జిల్లా కమిటీ సభ్యులు తహసీల్దార్ రంగు రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మహిళలకు సహాయపడే దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌కు తమ సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారు.

తపాలాశాఖ నందు పార్శిల్ ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటు

- భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఏఎస్పీ వి.సుచేందర్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

తపాలాశాఖలో నూతనంగా పార్శిల్ ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఏఎస్పీ వి.సుచేందర్ తెలిపారు. మంగళవారం ఆయన దుమ్ముగూడెం సబ్ పోస్టాఫీసును సందర్శించారు. అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదూర ప్రాంతాలకు పంపించే వస్తువులను పోస్టాఫీసునందు ప్యాకింగ్ చేసి తక్కువ ధరకే పంపించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు డాక్ నిర్యాత్ కేంద్ర సేవలు కూడా అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. రైల్వేశాఖలో జాయింట్ పార్శిల్ ప్రొడక్ట్ వంటి సేవలు కూడా తపాలాశాఖలో అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. రైల్వేశాఖ అనుబంధంతో ఎక్స్‌ప్రెస్ కార్గో సేవలు నూతనంగా ప్రారంభించడం జరిగిందన్నారు. సమావేశంలో సబ్ పోస్ట్ మాష్టారు ఎస్.వి.రావు, పోస్ట్‌మ్యాన్ కిరణ్, మెయిల్ వర్సెస్ నందగోపాల్, దుర్గా ప్రసాద్‌తో పాటు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

సొసైటీ ద్వారా ఇటీవల రూ.లక్ష లోపు రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మెన్ పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సహకార సంఘం కార్యాలయంలో పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సొసైటీలో 244 మంది రైతులకు 77 లక్షల రుణమాఫీ అయిందని, వీరిలో అర్హులైన రైతులకు తిరిగి రుణాలు పంపిణీ చేయనున్నామన్నారు. రైతులు తమ భూమికి సంబంధించిన పట్టాదారు పుస్తకం,1-బి, ఆధార్ కార్డు, నో డ్యూస్ సర్టిఫికెట్లను ఈనెల 25వ తేదీ లోపు కార్యాలయంలో సమర్పించాలన్నారు. వీరిలో అర్హులకు రుణాలు ఇవ్వనున్నామన్నారు. గతంలో 671 మంది రైతులకు రూ.1.63 కోట్ల రుణమాఫీ అయిందన్నారు. వారిలో అర్హులైన రైతులకు తిరిగి రుణాలు ఇచ్చామన్నారు. రుణమాఫీ రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన సహకార బ్యాంకు మేనేజర్ ఎస్.దుర్గాదేవిని కొత్వాలతో పాటు పాలకవర్గం సభ్యులు ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎస్.దుర్గాభవాని, సొసైటీ వైస్ చైర్మెన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ మోహన్ రావు, కనగాల నారాయణరావు, పాపారావు, జరబన సీతారాంబాబు, భూక్య కిషన్, వెంకటేశ్వరరావు, బర్ల వెంకటరమణ, సీఈవో జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన జడ్పీటీసీ దంపతులు



నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలో మంగళవారం పర్యటించిన కలెక్టర్ ప్రియాంకా అలాను జడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ గోపిరెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆమెకు శాల్వాలను కప్పి, పూల బుకెను అందజేశారు. మండలంలోని సమస్యల పరిష్కారంకు సహకరించాలని కోరారు.

మోకాళ్ళ సమస్యకు రోబోటిక్ సర్జరీ

- ప్రపంచంలోనే మెరుగైన చికిత్స
- ప్రముఖ మోకాళ్ళ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సునీల్ దాచేపల్లి



నవతెలంగాణ-కొత్తగూడెం

వయోభారం, అధిక బరువు కారణంగా మోకాళ్ళ నొప్పుల సమస్యతో బాధపడుతున్న వారు మోకాళ్ల సర్జరీ చేయించుకోవాలని, మోకాళ్ళ సమస్యతో బాధపడేవారు ఎలా ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా మోకాళ్ళ వైద్యున్ని సంప్రదించాలని ప్రముఖ మోకాళ్ళ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సునీల్ దాచేపల్లి సూచించారు. మంగళవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలో తాను పుట్టి, ఇక్కడే చదువుకున్నానని, ఉన్న ఊరికి సేవ చేయాలని ఉద్దేశంతో ప్రతినెల రెండవ మంగళవారం కొత్తగూడెం సునీల్ నర్సింగ్ హోమ్ నందు మోకాళ్ళ సమస్య ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌కు వచ్చి సమయాన్ని, వ్యయాన్ని వృధా చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. నేను పుట్టిన ఊరికి కొంత సేవా చేయాలని ప్రతి రెండవ మంగళవారం కొత్తగూడెంలో రోగులను పరీక్షించడం జరుగుతుందన్నారు. తొలి దశలోనే పరీక్షించి, సరైన వైద్యం తీసుకుంటే మోకాళ్ళ చిప్పల మార్పిడి అవసరం లేదని, మందుల ద్వారానే సమస్యను తగ్గించే అవకాశం ఉందని ఆయన వివరించారు.

ఒకేసారి ఏరియర్స్ చెల్లింపు ఘనత టీబీజీకేఎస్ దే



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణిలో సెప్టెంబర్ 21న ఒకే దఫా ఏరియర్స్ చెల్లించే ఘనత టీబీజీకేఎస్ దే అని ఏరియా ఉపాధ్యక్షులు ఊకంటి ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవ నడుమ ఈ నెల 21న ఒకే దఫాలో ఏరియర్స్ చెల్లింపు సర్క్యులర్ విడుదల చేశారన్నారు. ఏక మొత్తంలో సింగరేణి కార్మికుల బ్యాంకు ఖాతాలో రూ.1720 కోట్ల జమ చేస్తున్నట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేయటం పట్ల కార్మిక వర్గం హర్షం వ్యక్తం చేశారు. జాతీయ కార్మిక సంఘాల అసమర్ధత, ముందు చూపు లేకపోవడం వల్ల 11 వేతన ఒప్పందం 23 నెలలు ఆలస్యం కావడం జరిగిందన్నారు. పెద్ద మొత్తంలో ఏరియా చెల్లింపులు ఉండడంతో రెండు దఫాలుగా ఏరియర్స్ చెల్లించడానికి యాజమాన్యం ముందుగా నిర్ణయం చేయడం జరిగింది. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దృష్టికి తీసుకెళ్లడం, సింగరేణి యాజమాన్యంతో ఆమె మాట్లాడంతో ఒకే దఫాలో ఏరియర్స్ చెల్లించడానికి యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసినట్టు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | సెప్టెంబర్ 13, 2023 | www.navatelangana.com

తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు రాంబాబుకి సన్మానం

నవతెలంగాణ-మధిర

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మధిర మండలం దేశినేనిపాలెం గ్రామానికి చెందిన రాంబాబును మంగళ వారం ఖమ్మం గ్రేస్ కాలేజీ నందు జరుగుచున్న గణితం ఉపాధ్యాయుల ఉన్నతి శిక్షణ కార్యక్రమం నందు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచి వ్యక్తి, మృధుస్వభావి అయినటువంటి రాంబాబు మన ఖమ్మం జిల్లా నుంచి ఒక్కరూ మాత్రమే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకోవటం, అందులో మన గణిత ఉపాధ్యాయుడుగా మనం గర్వపడాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గణితం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా గృహలక్ష్మి అందించాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-వేంసూరు

రాజకీయాలకతీతంగా గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అరవపల్లి జగన్ మోహన్ రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కల్యాణ లక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్యులను రక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోరంపుడి వెంకటేశ్వరావు, వెలెగినేని రామారావు, వెంకటేశ్వరావు, కొత్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు)యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ సంస్థలో విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కొత్తగూడెం సర్కిల్ ఆఫీస్ ముందుTSUEEU-CITU ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలో గొల్లపల్లి వెంకన్న, కూనరాజు శ్రీనివాస, లకావతు, దస్రు, మోదుగు రమేష్ ,శీలం వీరారెడ్డి, సాగర్, సంతోష్ ,భవనం రాజశేఖర్ రెడ్డి కూర్చోన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కొలగాని రమేష్ మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు కన్వర్షన్స్ ఇవ్వాలని, అన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాలని, బిల్ కలెక్టర్స్, మీటర్ రీడర్స్, కార్మికుల జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, 2019 లో జాయిన్ అయిన జూనియర్ లైన్ మెన్ లకి అసిస్టెంట్ లైన్ మెన్ ప్రమోషన్స్ ఇవ్వాలని, 2011లో జాయిన్ అయినా జేఎల్ఎంలకి ఏరియర్స్ ఇవ్వాలని, సబ్ స్టేషన్ లో నలుగురు ఆపరేటర్లు ఒక వాచ్మెన్ ఉండేవిధంగా చూడాలని, సబ్ స్టేషన్లు రిటైర్ అయిన వాళ్లని తీసివేసి సంస్థలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న అన్ మ్యాన్ కార్మికులు, మీటర్ రీడింగ్ కార్మికుల్లో అర్హత ఉన్నా వారితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లి వెంకట రాజు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, భద్రాచలం డివిజన్ నాయకులు సుదర్శన వర్మ, మధుసూదన్ రావు, కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి పులి గణేశ్ బాబు పాల్గొన్నారు. ఈ రోజు పిండి ప్రోలు బుజ్జి కన్నయ్య నిరహార దీక్షల ను నిమ్మరసం ఇచ్చి విరమింప చేయడం జరిగింది.

సమ్మెలో అంగన్వాడీలు...
కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాలు నిర్వహణ

- కార్యదర్శులు పర్యవేక్షణలో పౌష్టికాహారం పంపిణీ
- పరిశీలించిన అధికార బృందం

నవతెలంగాణ - అశ్వారావుపేట



గత రెండు రోజులుగా అంగన్వాడీలు వారి సమస్యలు పరిష్కారంకై సమ్మె చేస్తున్నారు. కేంద్రాల్లో నిల్వ ఉంచిన గుడ్లు,పౌష్టికాహారం చెడిపోకుండా చూడాలని, కార్యదర్శులు పర్యవేక్షణలో కేంద్రాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల సి.డి.పి.ఒ లకు ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం సి.డి.పి.ఒ రోజా రాణి,సూపర్వైజర్ విజయలక్ష్మి,ఎం.పి.డి.ఒ శ్రీనివాస్ లు మండలంలోని గుర్రాల చెరువు అంగన్వాడి కేంద్రాన్ని స్థానిక కార్యదర్శి తేజ పర్యవేక్షణ లో తాళం పగులకొట్టి కేంద్రం తలుపులు తెరిచారు. సమాచారం అందుకున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు బిస్కెట్లు,చాక్లెట్లు ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ వస్తుందని, దానిలో భాగంగానే అంగన్వాడీ కార్యకర్తలకు ఒక సారి జీతాలు పెంచటం జరిగిందని,త్వరలోనే మీ డిమాండ్లను తప్పకుండా పరిష్కరిస్తారని,కావున అంగన్వాడీ కార్యకర్తలు మీ సమ్మె విరమించి తిరిగి వీధులలో చేరాలని అంగన్వాడీ కార్యకర్తలను కోరారు.

17 కేంద్రాలు నిర్వహించాం - సి.డి.పి.ఒ రోజా రాణి

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు కోసం నిల్వ ఉంచిన గుడ్లు,పదార్థాలు పాడవకుండా పిల్లలకు వినియోగించాలనే కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాలు మేరకు 17 కేంద్రాలు తెరిపించి పిల్లలకు ఆహారం అందించామని తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితులకు 20 ఏండ్ల జైలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన కేసులో సింగరేణికి చెందిన ఐదుగురు నిందితులకు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25,000/ల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదికి ముగ్గురు సంతానం. తమ ఇంట్లో నిద్రిస్తున్న మైనర్ బాలికను కిడ్నాప్ చేసారని 1-2 -2021న కారేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి పోలీసులు కేసును విచారించి నిందితులపై కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుల పై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వరరావు వాదించగా, లైజన్ ఆఫీసర్ వి.భద్రు నాయక్, కోర్టు కానిస్టేబుల్ టి.వెంకటేశ్వరరావు, హెూంగార్డు ఎం.డి ఆయూబ్‌లు సహకరించారు.

పర్యావరణహితమే మన పండగల పరమార్థం

- పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల ఆరోగ్యం క్షీణిస్తుంది
- పండుగలు కార్పోరేట్ వ్యాపారంగా మారినవి

నవతెలంగాణ - వైరా టౌన్



పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన, అందమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత నేటి సమాజంపైన ఉన్నది. వివిధ రకాల పెయింటింగుతో కలర్ ఫుల్‌గా, మెరిసిపోతూ ఉండే వినాయక విగ్రహాలు అందరినీ ఎట్రాక్ట్ చేస్తాయి. కానీ వీటివలన మన ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలుగుతుంది. కాబట్టి వాటికి దూరంగా ఉండటమే మంచిది. మట్టి విగ్రహాలు మానవుల జీవితం, వాతావరణం పైన ఎలాంటి దుష్ప్రభావం చూపించవు. ఇవి చూడడానికి కాస్త డల్ గా కనిపించినా, ఎట్రాక్ట్ చేయకపోయినా మన ఆరోగ్యానికి, వాతావరణానికి ఇవే మంచిది.

వినాయక చవితి ఉత్సవాలకు దేశం యావత్తు సిద్ధమవుతుంది. సెప్టెంబర్ 18న నుంచి గణేష్ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పండగలు, సంప్రదాయాల పరిరక్షణ తోపాటు సామాజిక బాధ్యతను కూడా మనమందరం గుర్తుంచు కోవాలి. పర్యావరణానికి హాని కలిగించే చర్యలను ప్రతి మతం వ్యతిరేకిస్తుంది. భారతీయ సంస్కృతిలో కూడా ప్రకృతి ఆరాధనకు అధిక ప్రాధాన్యత ఉన్నది. పండుగల పరమార్థం, లక్ష్యం కూడా ఇదే. ప్రకృతితో మమేకమవుతూ నేల, నీరు, చెట్టు, పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటినీ ఆరాధించడం మన భారతీయ సంస్కృతి గొప్పదనం. కాబట్టి వినాయక చవితి ఉత్సవాలలో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కనబెట్టి పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

మట్టి గణపతులు ఎకో ఫ్రెండ్లీగా ఉంటాయి.

వినాయకుడి విగ్రహాన్ని మట్టితోనే చేయాలని పెద్దలు చెబుతున్నారు. కాని నేడు విష పదార్థం లాంటి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రకాల రసాయనాలతో తయారు చేస్తున్నారు. మానవ జీవనానికి సర్వం అందిస్తున్న మట్టి విగ్రహాలను పూజించడం మానేసి విష పదార్థం లాంటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించడం సమంజసమా? భక్తులు, ప్రజలు ఆలోచించాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ కారణంగా వాతావరణ కాలుష్యం పెరుగుతుంది, నీళ్ళు పూర్తిగా కలుషితం అవుతాయి, ఆరోగ్యం క్షీణిస్తుంది. అదే మట్టి వినాయకుడు అయితే కాలుష్యం అనే ప్రశ్నే వుండదు. మట్టి గణపతులు ఎకో ఫ్రెండ్లీగా ఉంటాయి.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వలన ఆరోగ్యం క్షీణిస్తుంది.

గణపతి విగ్రహాలు తయారికి ఉపయోగించే డైస్, కలర్స్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వలన పలు రకాల ఆనారోగ్య సమస్యలు వస్తాయి. రంగులలో ఉన్న మెర్క్యురీ, లెడ్ వలన నరాల వ్యవస్థ, పిల్లలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం పాడవుతుంది. విగ్రహాలను అందంగా అలంకరించడానికి ఉపయోగించే డైస్, హానికారక మెటల్స్ జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి. విగ్రహాల నిమజ్జనం వల్ల నీరు కలుషితం అయ్యి ఊపిరితిత్తుల సమస్యలు, చర్మంపైన అలర్జీలు, ర్యాషెస్, కళ్ళ ఇన్ఫెక్షన్ వస్తుంది.

పండగలు కార్పోరేట్ వ్యాపారంగా మారినవి : గుడిమెట్ల రజిత, ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి



వినాయకుని పూజలో ప్రధానమైనది విగ్రహం. సహజసిద్ధంగా మట్టితో తయారు చేసిన మట్టి విగ్రహాన్ని పూజించాలని, విగ్రహానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రంగులు వేయకూడదని, పసుపు, కుంకుమ, గంధంతో అలంకారం చేసుకోవాలని పెద్దలు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం కార్పోరేట్ సంస్థలు సంప్రదాయ పండగను పెద్ద వ్యాపారంగా మార్చినవి. రకరకాల వెరైటీలు, రంగులతో, మెరిసిపోతూ ఉండే పెద్ద పెద్ద వినాయక విగ్రహాలతో కోట్ల వ్యాపారం చేస్తున్నారు. ఫలితంగా మన ఆరోగ్యానికి, పర్యావరణానికి భారీ హాని కలుగుతుంది. కావున మట్టి వినాయకుడిని పూజించడం మన కుటుంబానికి, పర్యావరణానికి మంచిది అనే చైతన్యాన్ని ప్రజలకు కల్పించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని గణేష్ ఉత్సవ కమిటీలకు సూచించాలి. అన్ని ప్రాంతాలలో మట్టి విగ్రహాల లభ్యతను కూడా పెంచాలి.

అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక

అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న ప్రభుత్వం డిమాండ్ చేశారు. మంగళవారం ఇనపాక ఎంపీడీవో కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేస్తున్న అంగన్వాడీలకు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు దడిగల సత్యనారాయణ, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రాష్ట్రంలోని సమగ్ర శిక్ష అభియాన్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి, వారి ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హతీరామ్ మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులు అన్ని విద్యార్హతలతో గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చాలిచాలని వేతనాలతో కుటుంబాల పోషణ, భారంగా ఉన్నా ఎప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేస్తుందనే ఆశతో జీవిస్తున్నారని చెప్పారు. వాటి సాధనలో భాగంగా గత 11 రోజులుగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు రిలే నిరసన దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి దారి చూపడం లేదన్నారు. ఇకనైనా సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన మాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

శ్రీ ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలో ముత్యామలమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం చివరి మంగళవారం కావడంతో జిల్లా నలు మూలలనుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు సతీ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు వేల మందికి అన్నదానం అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధ్యక్షులు చుక్కా గణేష్‌రెడ్డి ఆద్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కూలి రేట్లు పెంపు కోసం సమ్మె

కూలీలు పాల్గొనాలి : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా

నవతెలంగాన-దుమ్ముగూడెం

రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీ రేట్లు పెంచుకోవడం కోసం వ్యవసాయ కూలీలు సమ్మె బాట పట్టాల్సిందేనని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం రేగుబల్లి, దంతెనం, నర్సాపురం గ్రామాలలో కూలీ రేట్లు పెంపు జరిగిన సమావేశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూలీలు రోజంతా కష్టపడి పని చేసినా రైతు ఇచ్చే కూలీ గిట్టుబాటు కాక వారి కడుపు నిండడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఇచ్చే రోజు కూలీ తమక గిట్టుబాటు కావడం లేదని కూలీలే స్వచ్ఛందంగా తాము సమ్మె చేస్తామని ముందుకు వచ్చారంటే వారి ఆకలి బాధలు అర్థం చేసుకోవాలన్నారు. మెట్ట పొలానికి పనులకు వెళ్లే కూలీలకు రోజువారీ కూలీ రూ.300 వందలు చెల్లించాలని ఆయన అన్నారు. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరిచిందన్నారు. రేషన్ షాపుల ద్వారా 16 రకాల నిత్యవసరాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని ఆన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, జక్కం సావిత్రి, పుట్టి సావిత్రి, షకీలా, అమృతమ్మ, సుధారాణి, జెట్టి పద్మ, పాపమ్మ, మనోరమ, పెంటమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మన్యాన్ని వణికిస్తున్న విష జ్వరాలు

- డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- మొబైల్ మెడికల్ టీముల ద్వారా వైద్యం అందించాలి
- సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరియు భద్రాచలం నియోజక వర్గం చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల ప్రభావం రోజురోజుకు పెరుగుతున్నందున అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మండలాల పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు సోకిన గ్రామాలకు మొబైల్ వైద్య బృందాలను పంపించి సకాలంలో వైద్యం అందించాలని వారు కోరారు. భద్రాచలం నియోజకవర్గంలో చర్ల మండలంలో సుమారు 20 రోజులు నుండి డెంగ్యూ, మలేరియా జ్వరాలు వస్తున్నాయని అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు వైద్య సిబ్బంది మందులు అందుబాటులో ఉంచాలని అందుకు వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను వారు కోరారు. మందులు, వైద్య బృందాన్ని వైద్య పరీక్షలను నిర్వహించడంలో కొంత లోపం ఉన్నదని, రోగ నిర్ధారణ పరీక్షలకు అప్పులు చేసి మరి ఆర్థికంగా ఖర్చు పెడుతున్నారని అన్నారు. ప్రయివేటు వైద్యాన్ని ఆశించడం వల్ల పెద్ద మొత్తంలో ఆర్థికంగా ఖర్చు అవుతుందని ఐనా రోగ నిర్ధారణ సరిగా జరగక భద్రాచలం లాంటి ప్రాంతంలోకి వెళ్లి ప్రైవేట్ హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. దీనివలన ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు చోకిన ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రు లు లేదా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడం ద్వారా ఆర్థిక సమస్య కొంతైనా తీరుతుందని, భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో డాక్టర్లు మందులు అందుబాటులో ఉన్నాయని వారి సేవలు ఉపయోగించుకోవాలని వారు కోరారు

మహారాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఖమ్మం.
ఒ.యస్. నెం. 132/2017 ఇన్
ఇ.పి. నెం. 22/2023

బిట్వీన్ :
వేమిరెడ్డి కోటిరెడ్డి ....డిక్రీహోల్డర్
మరియు
సామినేని స్వప్న ....జడ్జిమెంట్ డెటార్స్

టు,
సామినేని స్వప్న, భర్త : లేటు కుతుంబాక నవీన్‌కుమార్, వయస్సు : 36 స.లు, నివాసం : ఇ.నెం. 5-2-246/2, ముస్తఫానగర్, ఖమ్మం.

డిక్రీహోల్డర్ గారు ఒ.యస్. నెం. 132/2017 ద్వారా జారీ కాబడిన డిక్రీ అమలు కొరకై జడ్జిమెంట్ డెబ్టార్‌గా ఉన్న మీపై పై నెంబరుగల ఎగ్జిక్యూషన్ పిటీషన్ వేసియున్నారు. సదరు ఇ.పి. నందు మీకు పలు పర్యాయములు నోటీసులు జారీ చేసినప్పటికీ మీరు హాజరు కానందున ఈ నోటీసు ద్వారా మీకు తెలియ చేయునది సదరు. ఇ.పి. నెం.22/2023 శ్రీయుత కోర్టు నందు **ది. 20.9.2023న** వాయిదా కలదు. కనుక **ది. 20.9.2023న ఉ.గం. 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని మీ న్యాయవాది ద్వారా కానీ శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై ఏమైనా అభ్యంతరములు ఉంటే తెలియ చేయవలెను. లేని యెడల మీ పరోక్షమున శ్రీయుత కోర్టు వారిచే సదరు ఇ.పి. నిర్ణయించబడును.

//శ్రీయుత కోర్టు వారి ఆదేశానుసారం//
ఎం. నిరంజన్‌రెడ్డి
న్యాయవాది, ఖమ్మం.

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE :: AT SANGAREDDY
M.V.O.P. No. 129 of 2020

Between:-
Nenavath Ganesh Singh. ... Claimant.
A N D
Gorla Srikanth @ Sreekanth and others. .... Respondents.

To,
1. Mrs. Chadarlamoodi Laxmi Mahathi, W/o Srikanth, Aged; Major, Occ. Owner of Lorry Driver of bearing No.AP-37/TD/-6178, R/o. H.No.2-226/C, Madhura Nagar, Gollagudem Road, Khammam Urban, Khammam District. (Respondent No.2)

Notice

Take notice that, the claimant filed the above claim petition against you and others and the same is stands posted to 17-10-2023 at 10:30 AM., for your appearance before the Hon'ble I Addl. District Judge at Sangareddy, hence you are hereby directed to appear either in person or through an advocate. In default of your appearance on that day the matter will be decided on merits.

//BY ORDER OF THE COURT//
(J.Satyanarayana),
Advocate, Sangareddy.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:: AT SATTUPALLI
O.S. NO. 631 OF 2014

BETWEEN:-
Union Bank of India (Andhra Bank), Thallada Branch, Rob. by its Branch Manager. ... Plaintiff Bank
//AND//
Chalavadi Ramarao and Others. ... Defendant

NOTICE

To:
Chalavadi Ramarao/S/o. Venkaiah, Occ.:Agiculter R/o Guravaigudem Village,Chandrugonda Mandal Khammam Dist.

The Plaintiff Bank herein had filed the above Suit against you/ Defendant before this Hon'ble court for recovery of money, the above case is posted to **14-9-2023** for your appearance, for Suit notice along wits Pending Interlocutory applications.That you are hereby require to be attend either in person or through an advocate on **14-9-2023** at **10.30 A.M** before this Hon'ble court. Otherwise the matter will be heard and decided ex-parte/as per procedure.

(By order of the Hon'ble court)
K.PANDU RANGA RAO
Advocate, Khammam

IN THE COURT OF THE HON'BLE AGENT TO GOVET. (DISTRICT COLLECTOR) AT KOTHAGUDEM
SOP.NO. 01/2023

BETWEEN:
Azmeera Gangamma and 2 others .....Petitioners
AND
To whom-so ever it may concern ...Respondents

NOTICE

It is to inform that the above said petitioners has filed Succession Petition No. 01/2023 before the Hon'ble AGENT TO GOVT . COURT AT KOTHAGUDEM with a prayer to issue succession certificate for the death benefits of late. Azmeera Papa S/o Bhadru,(who is husband of petitioner NO.1 and father of petitioners No.2&3) who worked as Scientific Assistance -D , E.C.NO. 52323, in Heavy Water Plant , Aswapuram and died on 30-09-2019 in an accident .

If any body is having any objection in Issuing the Succession certificate in favour of petitioners , they shall appear before the Hon'ble court with all relevant documents if any on or before **16th day of September 2023 at 10.30 A.M** before the Hon'ble court . If not the Hon'ble court can pass relevant exparte . orders .

(BY ORDER OF THE HON'BLE COURT)
V.V.SUDHAKAR RAO
Advocate -Kothagudem
Cell No. 9848410985
12-09-2023
Kothagudem

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు (అడిషనల్ సబ్ కోర్టు) ఖమ్మం నందు
ఒ.యస్. నెం. 23/2021

బిట్వీన్ :
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్, శ్రీనగర్ కాలనీ బ్రాంచీ, ఖమ్మం ....వాది
మరియు
1. నటీశం సీతాకుమారి
2. నటీశం తులసీరాములు ....ప్రతివాదులు

నోటీస్

టు,
1 నటీశం సీతాకుమారి, భర్త : సబితానందనరాజ
2. నటీశం తులసీరాములు, తండ్రి : సత్యనారాయణ,
వీరిద్దరి నివాసం : ఇ.నెం. 87/1, రైల్వే క్వార్టర్స్, ఆర్‌పిఎఫ్ రోడ్డు, రైల్వేస్టేషన్ ప్రక్కన, ఖమ్మం.

పైన తెలిపిన దావాలోని వాది అయిన ఎపిజివి బ్యాంక్ శ్రీనగర్ కాలనీ బ్రాంచి, ఖమ్మం వారు ప్రతివాదులైన మీపైన, మీరు గృహ ఋణము పొందిన దాఖలా, బకాయిలు రాబట్టుట కొరకు దావా వేసియున్నారు. అట్టి దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా స్వీకరించుట లేదు. ఇట్టి దావా **ది. 03.10.2023న హాజరు నిమిత్తం కోర్టు వారు వాయిదా వేసి యున్నారు.** కావున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! **ది. 03.10.2023న ఉ.గం. 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని న్యాయవాది గారి ద్వారా గాని హాజరు కాగలరు. లేని యెడలమీపరోక్షమున తీర్పు వెలువడగలదు.

//కోర్టు వారి అనుమతితో//
చిన్నాల శ్రీనివాసరావు
కూరపాటి శేఖర్‌రాజు
న్యాయవాదులు, ఖమ్మం
సెల్ :9652112122

గిరి వికాసం స్కీంకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-ఇల్లందు

సిఎం గిరి వికాసం స్కీంకు అర్హులైన, గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని యంపీడీఓ చిరంజీవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 100 రోజుల పని జాబ్ కార్డ్, పట్టాదారు పాసు పుస్తకం, (ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగినవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది) ఆధార్ కార్డు, పాస్పోర్ట్ ఫోటోలు 2, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, బోర్ వెల్ యూజర్ గ్రూప్ లో సభ్యులై ఉండాలన్నారు. తెలంగాణ వాల్టా చట్టంకు లోబడి లాండ్ కాంపాక్ట్ సర్టిఫికెట్ వీఆర్ఓ ధృవీకరించిందై ఉండాలన్నారు. ఈ ధృవపత్రాలతో తమ గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు.

IN THE COURT OF THE SENIOR, CIVIL JUDGE :: AT SATTUPALLI
O.S. NO. 385 OF 2015

BETWEEN:-
Andhra Bank(UBI), Rep. by Its Branch Manager. ......Plaintiff
//AND//
Janapathi Narasimha Rao and others ... Defendants

NOTICE

To
Janapati Narasimha S/o. Venkateswrlu Occ.:Agiculter R/o Chandrugonda Chandrugonda Mandal Khammam Dist

The plaintiff herein had filed the above suit against you before this Hon'ble court for recovery of money, the above case is posted to **14-9-2023** for your appearance, for Suit notice along with Interlocutory applications. That you are hereby require to be attend either in person or through an advocate on **14-9-2023 at 10.30A.M** before this Hon'ble court. Otherwise the matter will be heard and decided ex-parte/ as per procedure.

(By order of the Hon'ble court)
K.PANDU RANGA RAO
Advocate, Khammam

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT SATTUPALLI
O.S. No. 129 OF 2016

BETWEEN:-
Andhra Bank(UBI), Madhira Branch, Rep. by its Branch Manager. ... Plaintiff
//AND//
Kamati Mohan Reddy and others ... Defendants

NOTICE

To
Kamati Mohan Reddy S/o. Narayanareddy Occ.:Agriculter R/o Madupalli Vill Madhira Mandal Khammam Dist.

The plaintiff herein had filed the above suit against you before this Hon'ble court for recovery of money, the above case is posted to **14-09-2023** for your appearance, for Suit notice along with Interlocutory applications. That you are hereby require to be attend either in person or through an advocate on **14-09-2023 at 10.30A.M** before this Hon'ble court. Otherwise the muter will be heard and decided ex-parte/ as per procedure.

(By order of the Hon'ble court)
K.PANDU RANGA RAO
Advocate, Khammam

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT SATTUPALLI
O.S. NO. 37 OF 2017

BETWEEN:-
Andhra Bank(UBI),Thallada Branch, Rep. by its Branch Manager. ... Plaintiff
//AND//
Kopula Adinarayana and others ... Defendants

NOTICE

To
Kopula Adinarayana S/o. Narayanmurthy Occ.:Agriculter R/o Kesavapuram (Vill) Thallada Mandal Khammam Dist.

The plaintiff herein had filed the above suit against you before this Hon'ble court for recovery of money, the above case is posted to **14-09-2023** for your appearance, for Suit notice along with Interlocutory applications. That you are hereby require be attend either in person or through an advocate on **14-09-2023 at 10.30A.M** before this Hon'ble court. Otherwise the matter will be heard and decided ex-parte/as per procedure.

(By order of the Hon'ble court)
K.PANDU RANGA RAO
Advocate, Khammam

మహారాజశ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్. నెం. 126/2018

బిట్వీన్ :
రాయపాటి ఆదిలక్ష్మి ....వాది
మరియు
రాయపాటి సత్యవతి & 6 అదర్స్ ....ప్రతివాదులు

టు,
3వ ప్రతివాది : రాయపాటి మల్లేశ్వరి, భర్త : లేటు సత్యనారాయణ, గృహిణి, పైనంపల్లి గ్రామం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా.
6వ ప్రతివాది : రాయపాటి శ్రీనివాసరావు, తండ్రి : లేటు సత్యనారాయణ, పైనంపల్లి గ్రామం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా.

పై నెంబరు దావాను వాది మీపై దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా అక్షేపణలు ఉన్న యెడల మీరు మహారాజశ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు **ది. 15.09.2023వ** తేదీన **ఉ.గం. 10.30** ని॥లకు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున యందు దావాను విచారించి తీర్మానించబుని తెలియజేయమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
బెజవాడ నారపరెడ్డి
వాదితరపు న్యాయవాది
జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
సెల్ : 9989138027

మహారాజశ్రీ మధిర అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి, మధిర
దావా నెం. 152 / 2023

బిట్వీన్:
అడపాల శ్రీ లక్ష్మి .....వాది
మరియు
1.అడపాల అనూష
2.ఎవరికి సంబంధించితే వారికి ......ప్రతి వాదులు

నోటీసు

ఇందు మూలముగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా..! పైన పేర్కొన్న వాది గారి భర్త శ్రీ అడపాల పూర్ణచంద్రరావు తండ్రి: పుల్లరావు గారు, నివాసం : 3-90/1, మాటూరు గ్రామము, మధిర మండలం, ఖమ్మం జిల్లా వారు ది: 31.03.2015వ తేది నుండి కనపడకుండ పోయినారు. ఇట్టి విషయమై వాది మహారాజశ్రీ మధిర అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి యందు వారి భర్తగారగు శ్రీ అడపాల పూర్ణచంద్రరావుగారు చనిపోయి నట్లుగా ప్రకటించమని కోరుతూ దావా దాఖలు చేసియున్నారు. ఇట్టి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యడల **ది.11.10.2023 ఉ॥ గం.10.30 ని॥లకు** కోర్టునందు స్వయముగా గాని లాయర్ ద్వార గాని హాజరై తమకు గల అక్షేపణలు కోర్టు వారికి తెలియజేయగలరు. లేని యెడల తమ పరోక్షం నందు తీర్మానం చేయబడును.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వులమేరకు//
కోట జ్ఞానేష్
అడ్వకేట్, మధిర
సెల్ : 98489 72880

మహరాజశ్రీ జడ్జి ప్యామిలి మరియు 4వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు ఖమ్మం
యమ్.సి నెంబరు 36/2023

బిట్వీన్:
బాగం @ పొన్నం శిరీష ...పిటీషనర్
మరియు
బాగం అన్వేష్ .....రెస్పాడెంట్

నోటిస్

టు,
బాగం అన్వేష్ తండ్రి:శేషయ్య వయస్సు: 36 వృత్తి: టి.యస్ జెనొకొ ఉద్యోగి. నివాసం. ఇంటి నెంబర్:8-1-4, L.M.కాలనీ, గట్టాయి గూడెం, పాల్వంచ టౌన్, భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా వారికీ...

పైన తెలిపిన కేసులో మీకు ఎన్ని పర్యాయము లు నోటీసులు పంపినను ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియ చేయునది ఏమన గా పైన తెలిపిన కేసు మీ హజరు కొరకు తేదీ **20/9/2023న వాయిదా ఉన్నది.** మీరు స్వయంగా గాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని **తేదీ 20/9/2023న ఉ॥గం॥ 10:30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హజరుకాగలరు.లేనియెడల కేసు మీపరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతి తో)
కొటేరు స్పందనరెడ్డి
న్యాయవాది,ఖమ్మం
ఖమ్మం
12/9/2023
సెల్ :9640685032

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సవాలను అడ్డుకునే కుట్ర
- 17న అమిత్ షా రాక, మూడు రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం : జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహించాలని నిర్ణయిస్తే దాన్ని అడ్డుకునేలా కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పరేడ్ గ్రౌండ్ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతారనీ, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర సీఎంలకు కూడా ఆహ్వానం పంపామని తెలిపారు. ఓవైసీ అనుమతి ఉంటేనే సీఎం కేసీఆర్ సెప్టెంబర్ 17 కార్యక్రమానికి హాజరవుతారని విమర్శించారు. హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయానికీ, విమోచన దినోత్సవానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. మన పూర్వీకుల త్యాగాలను స్మరించుకునేలా జాతీయ జెండాను ఎగురవేసి విమోచన ఉత్సవాలు నిర్వహించాలని రాష్ట్రంలోని సర్పంచులందరికీ లేఖలు రాస్తున్నానని చెప్పారు. విమోచన దినోత్సవం ముస్లింలకు వ్యతిరేకమంటూ కొందరు అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. నిజాం పాలనలో ముస్లింలపై కూడా అనేక అరాచకాలు జరిగాయనీ, షోయబుల్లా ఖాన్, తుర్రేబాజ్ ఖాన్, అల్లావుద్దీన్, లాంటి వారిని కిరాతకంగా చంపారని గుర్తు చేశారు. హైదరాబాద్ స్వతంత్ర్య పోరాటాన్ని, చరిత్రను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తొక్కిపెట్టిందని విమర్శించారు.

12 మందికి 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డులు

- అభినందించిన ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ డివిజన్లలో విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, అంకితభావంతో పనిచేసిన 12 మంది ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అందచేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో వర్చువల్ పద్ధతిలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్ల రైల్వే మేనేజర్‌లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దీనిలో పాల్గొన్నారు. అవార్డులు అందుకున్నవారిలో లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, గేట్ మ్యాన్ సహా వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఉన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతల్ని జీఎమ్ అభినందించారు. ఇలాంటి అవార్డులు సంస్థలోని ఉద్యోగులను ప్రేరేపిస్తాయని చెప్పారు. ఎమ్ఎమ్‌టీఎస్ టైమింగ్స్‌పై దృష్టి పెట్టాలని అధికారుల్ని ఆదేశించారు. రైళ్ల రద్దీని తగ్గించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జోన్ పరిధిలో పునర్మిర్మాణం అవుతున్న రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారుల్ని ఆదేశించారు.

జనగణనలో కులగణనతో సామాజిక న్యాయం

- అందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి
- ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్



నవతెలంగాణ-ఓయూ

భారతీయ సమాజంలో కొన్ని దశాబ్దాలుగా జనగణన లెక్కింపులో కులాలను లెక్కించడంపై విస్తృతం చర్చ జరుగుతోంది.. దానికిగల కారణం కులాలను లెక్కిస్తే సామాజిక న్యాయం అనే భావనను సమర్థవంతంగా అమలు చేయొచ్చునని మెజారిటీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో వామపక్ష, దళిత, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో "ఏటాక్ ఆన్ వై డు వీనీడ్ ఏ కాన్‌స్టెన్సెస్" అంశంపై మంగళవారం పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యోగేంద్రయాదవ్ మాట్లాడుతూ.. భారతదేశంలో సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా, సాంస్కృతికపరంగా వెనుకబడిన కులాల అభివృద్ధి కోసమే జనగణనలో కులగణన డిమాండ్ అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేయాలని కోరారు. దశాబ్దాలుగా వెనుకబడుతున్న కులాల అభ్యున్నతికి కులగణన ఒక సాధనగా ఉంటుందన్నారు. కులాల గణన కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకే పరిమితం కాకుండా అగ్రకులాలను కూడా లెక్కించాలని, అప్పుడే రాజ్యాంగం అందించిన ఫలాలు ఎవరు అనుభవిస్తున్నారో తెలుస్తుందని అన్నారు. సామాజిక న్యాయం కోసం కొట్లాడుతున్న రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఈ కులగణన డిమాండ్‌ను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లాలని కోరారు. తద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి జనగణలో కులాల గణన జరిగే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.చంద్రునాయక్, ప్రొ.చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొ.ప్రభంజన్ యాదవ్, ప్రొ.పరందాములు, ప్రొ.కిరణ్ గౌడ్, ఓయు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు.


మంత్రి సబితా ఇంద్రారెడ్డికి షాక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మంత్రి సబితా ఇంద్రారెడ్డికి షాక్ తగిలింది. మహేశ్వరం మండల ఎంపీపీ రఘుమారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉండగా విజయభేరి సభ విజయవంతం చేయడం కోసం అసెంబ్లీ కోఆర్డినేటర్లను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ నియమిచారు.

ఒకరు రమ్మంటున్నరు...ఇంకొకరు వద్దంటున్నరు

- మొన్న కృష్ణయాదవ్.. నేడు చికోటి ప్రవీణ్
- చేరికలపై బీజేపీ వింత పోకడ
- నేతల మధ్య ఆధిపత్య పోరే కారణం?





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చింత చచ్చినా పులుపు చావదన్నట్టుగా బీజేపీ గ్రాఫ్ పడిపోతున్నా ఆధిపత్య పోరు మాత్రం అట్లాగే కొనసాగుతున్నది. మొన్నటిదాకా బండి గ్రూపు వర్సెస్ ఈటల గ్రూపు అన్నట్టు ఉండగా..నేడు అది కాస్తా ఈటల వర్సెస్ కిషన్‌రెడ్డిగా మారింది. పార్టీలోకి ఒకరు రండి బాబూ..రండి అని ఆహ్వానిస్తుండగా..మరొకరు ఛల్‌ర బై ఛల్ అని అడ్డుపుల్ల వేస్తున్నారు. ఎన్నికల వేళ చేరికలకు అన్ని పార్టీలు మొగ్గుచూపుతుండగా బీజేపీ వచ్చిన వారికి వెనక్కి తిప్పిపంపుతున్నది. దీంతో ఆ పార్టీలో చేరాలనుకునే వారు కూడా ఈ వింత పరిస్థితిని చూసి వెనకడుగు వేస్తున్నారు. కృష్ణయాదవ్, చికోటి ప్రవీణ్ చేరుతారనే వార్తలే దీనికి ప్రత్యక్ష ఉదాహరణలు. ఈ విషయంలో పార్టీ అగ్రనేతల తీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల మాజీ మంత్రి కృష్ణయాదవ్ బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపారు. ఈటల రాజేందర్ ఆయన చేరిక కోసం చాలా కసరత్తు చేశారు. ఆయన చేరిక కూడా దాదాపు ఫైనల్ అయిపోయింది. రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతారనే ప్రకటన కూడా వచ్చింది. ఇంతలోనే ఆయన చేరిక ఆగిపోయింది. ఆయన చేరికకు కిషన్‌రెడ్డినే అడ్డుపుల్ల వేశారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఒకవేళ కృష్ణయాదవ్ పార్టీలో చేరితే ఆయన చేతుల్లో అంబర్‌పేట నియోజకవర్గాన్ని అప్పనంగా పెట్టాలి. ఇది కిషన్‌రెడ్డికి సుతారమూ ఇష్టం లేదని వినికిడి. ఆ నియోజకవర్గం నుంచి తానుగానీ, తన భార్యనుగానీ రంగంలోకి దింపాలని ఆయన భావించడమే దీనికి కారణం అని తెలుస్తున్నది. తాజాగా చికోటి ప్రవీణ్‌కుమార్ బీజేపీలో చేరేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. పలు పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చుకున్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరబోతున్నారనే ప్రకటనా వెలువడింది. తన అనుచరగణంతో కర్మన్‌ఘాట్ నుంచి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరకున్న చికోటి ప్రవీణ్‌కు వింత అనుభవం ఎదురైంది. పార్టీలో చేరేందుకు రమ్మని పిలిచిన లీడర్లు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చేరిక కోసం ముందే డేట్లు ఫిక్స్ చేసిన సీనియర్ నేతలు ఎందుకు అందుబాటులో లేరని గుస్సా అయ్యారు. జాతీయ స్థాయి బీజేపీ నేతలతో చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని చికోటి తెలిపారు. సీనియర్ నేతలు అందుబాటులో లేకపోవడంతో చేరికకు బ్రేక్ పడిందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డికి సన్నిహితంగా ఉండే ఓ నేత ఈ చేరికకు అడ్డుపుల్ల వేశారని ప్రచారం జరుగుతున్నది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విషయంలోనూ ఇలాగే జరిగింది. ఈటల రాజేందర్ స్వయంగా ఆయన ఇంటికెళ్లి సంప్రదింపులు, బుజ్జగింపులు చేసి వచ్చారు. ఆయనా కాస్త మెత్తపడ్డారు. కానీ, ఇంతలోనే ఏం జరిగిందో ఏమోగానీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తి ఇంటికి ఎలా వెళ్తావు? అంటూ రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు ఆయనపై గుస్సా అయ్యాయి. దీనంతటికీ కిషన్‌రెడ్డినే కారణమనే ప్రచారమూ అప్పట్లో జోరుగా సాగింది. మొత్తంగా ఇప్పుడు ఈటల వర్సెస్ కిషన్‌రెడ్డి అన్నట్టుగా పరిస్థితి తయారైందనీ, ఈ ఆధిపత్య పోరు ఎటువైపు దారితీస్తుందో అని పార్టీ శ్రేణులు ఆందోళనలో పడ్డాయి.

విచ్చలవిడిగా తెలంగాణ ఫార్మసీ ఎన్నికల నామినేషన్ ఫారమ్స్..!

- రిటర్నింగ్ అధికారి సంతకం లేకండానే అందజేత
- ఎవరికి పడితే వారికి.. ఎన్ని అంటే అన్ని పంపిణీ
- ఫార్మసీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ వివాదాలకు కేరాఫ్‌గా మారుతోంది. పది రోజుల కిందటి వరకు రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు చేతివాటం ప్రదర్శించిన కొందరు కౌన్సిల్ ఉద్యోగులు.. ఇప్పుడు కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ పత్రాలను విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు. ఇలాంటి చర్యలు కౌన్సిల్ ఎన్నికలపై ఎఫెక్ట్ పడే ఛాన్స్ ఉంటుంది.

త్వరలో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ కౌన్సిల్‌లో దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 55వేల మంది ఫార్మసిస్టులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్నారు. వీరంతా ఈ ఎన్నికల్లో వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నామినేషన్ ఫారాలను జారీ చేశారు. కౌన్సిల్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు ఒక్కో ఫార్మసిస్టుకు ఎన్ని ఫారాలు అడిగితే అన్ని ఇచ్చేస్తున్నారు. ఫారాలు అందజేసే సమయంలో వారు ఫార్మసిస్టులా..? కారా..? వారి రిజిస్ట్రేషన్, రెన్యువల్ అప్‌డేట్ అయ్యి ఉందా..? లేదా..? రిజిస్ట్రేషన్ నెంబర్ ఎంత..? అనే వివరాలను చెక్ చేయడం లేదు. బాగా తెలిసిన వారికైతే ఎన్ని అడిగితే అన్ని ఫారాలు ఇచ్చేస్తున్నారు. ఇక ఏమైనా తప్పుగా రాస్తే మరోటి ఇస్తామని చెబుతున్నారు. దాంతోపాటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంతకం లేకుండానే నామినేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు.

సమస్యలు ఎదురయ్యే అవకాశం

తెలంగాణ ఫార్మసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఫార్మసిస్టులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. చివరి రోజు మంగళవారం మధ్యాహ్నం వరకు దాదాపు 170 మంది వరకు నామినేషన్ పత్రాలను రిజిస్ట్రార్‌కు అందజేశారు. కాగా ఇష్టానుసారంగా నామినేషన్ ఫారమ్స్ అందజేస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. ఉదాహరణకు మధు (పేరు మార్చాం) అనే వ్యక్తి తన పేరు మీద ఒక ఫారం తీసుకున్నాడు అనుకోండి. అతను తన పేరు, వివరాలు, రిజిస్ట్రేషన్ నెంబర్‌తో ఫారం నింపి అందజేస్తాడు. అపోనెంట్ క్యాండిడేట్ మధు (పేరు మార్చాం) పేరు మీద ఫారం తీసుకుని నింపి అందజేసే అకాశం లేకపోలేదు. ఇలా చేస్తే స్క్రూటీనీ సమయంలో ఇద్దరి ఫారాలు రిజెక్ట్ అవుతాయి. దీని వల్ల ఒరిజినల్ (మధు) ఫార్మసిస్టుకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. స్క్రూటీనీలో తిరస్కరణకు అవకాశం కూడా ఉంటుంది. నామినేషన్ ఫారంను ఎవరైనా తప్పుగా నింపినా, లేక ఏదైనా లెటర్ కానీ, పేరు కానీ సరిగా నమోదు చేయకపోయినా రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోవడంతో కౌన్సిల్‌లో పని చేసే ఉద్యోగుల సహాయంతో మరో ఫారం నింపి ఇచ్చే అవకాశం ఉంటుంది. రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోవడం, ఫారం మీద నెంబర్ మెనిషన్ లేకపోవడం వల్ల డూప్లికేట్‌గాళ్లు, అపోనెంట్ క్యాండిడేట్స్ మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్టులు కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తున్నాం

బి.యోగానందం, రిజిస్ట్రార్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్

ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాం. ఫారం సబ్‌మిట్ చేసిన తర్వాత పరిశీలన చేసి నెంబర్ వేస్తున్నాం. స్క్రూటీనీ మా పరిధిలో ఉండదు. సికింద్రాబాద్‌లోని ఆయుష్ కార్యాలయంలో జరుగుతుంది.

ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆ వ్యవహారాన్ని చూసుకుంటారు. నామినేషన్ల స్వీకరణ వరకు మాత్రమే కౌన్సిల్‌కు సంబంధం.

జర్నలిస్టుల రైల్వే పాస్ పునరుద్ధరణకు కృషి

- ఇండ్ల స్థలాల విషయంలోనూ సర్కారు సానుకూలం : హెచ్‌యూజే ప్రతినిధులతో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టు రైల్వేపాసుల పునరుద్ధరణకు తనవంతు కృషి చేస్తానని చేవెళ్ళ ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనూ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించారు. మంగళవారం తన నివాసంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ప్రతినిధి బృందం ఆయన్ను కలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలను వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కొవిడ్ కాలం నుంచి జర్నలిస్టులకు రాయితీ పాసులను రైల్వేశాఖ ఆపేసిందనీ, ఇప్పటికీ పాస్‌లు పునరుద్ధరించలేదనీ వివరించారు. ఎంపి స్పందిస్తూ, పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పాత్రికేయుల రైల్వే పాసులు పునరుద్ధరించాలంటూ లేఖ కూడా రాస్తానని తెలిపారు. అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్లస్థలాలు ఇస్తుందని,గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులకూ ఇండ్ల స్థలాల విషయంలో సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఎంపీ కలిసిన వారిలో హెచ్‌యూజే ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంధ్ర నవీన్, ట్రెజరర్ బట్టిపాటి రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్లు సాగర్, వనపర్తి, బయ్యా దామోదర్, రమేష్ తదితరులు ఉన్నారు.

జి 20 సదస్సు ప్రచార ఆర్భాటమే...

- ప్రపంచ నేతగా చెప్పుకునేందుకు మోడీ తాపత్రయం
- సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కార్యచరణ కరువు
- భారత్ ద్వారా దక్షిణ ధృవ దేశాలను కట్టడి చేసేందుకు అమెరికా కుట్ర :

ఎస్‌వికె వెబినార్‌లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్ కుమార్





హైదరాబాద్ : దేశ రాజధాని ఢిల్లీలో రూ.4100 కోట్లు ఖర్చు చేసి ఆట్టహాసంగా నిర్వహించిన జి20 సదస్సు ప్రచార ఆర్భాటం తప్ప ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపలేకపోయిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్ కుమార్ అన్నారు. ప్రపంచ స్థాయి నాయకుడిగా ప్రధాని మోడీ తనకు తానుగా చెప్పుకునేలా జి20 సదస్సు ఏర్పాట్లు, నిర్వహణ ఉందని చెప్పారు. సదస్సుకు ఆతిధ్యం ఇచ్చిన ఢిల్లీలో అడుగడుగునా మోడీ కనిపిస్తున్నాడు..కానీ వాస్తవ పరిస్థితులను కనపడకుండా చేశారని విదేశీ మీడియాలో కథనాలు వచ్చాయని చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'జి20 సమావేశం సాధించిందేమిటి..?' అంశంపై మంగళవారం నిర్వహించిన వెబినార్‌లో అరుణ్ కుమార్ మాట్లాడారు.

జి20 సదస్సు ఉమ్మడి ప్రకటనపై ప్రపంచ దేశాలు ఆశక్తిగా ఎదురుచూస్తున్న సందర్భంలో..ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత ప్రధాని మోడీ తొలిరోజే అది ప్రకటించి సమావేశాన్ని నీరుకార్చారని అన్నారు. గతేడాది ఇండోనేషియాలో జరిగిన జి20 సదస్సు డిక్లరేషన్‌కు భిన్నంగా ఈసారి ప్రకటన రావడం వెనక అమెరికా ఒత్తిడి ఉందని చెప్పారు. ఉక్రెయిన్‌పై తీసుకున్న వైఖరిని సౌదీ అరేబియా, కెనడా,నెదర్లాండ్స్ జపాన్, అనేక దేశాలు తప్పుబట్టాయని గుర్తుచేశారు. ఉక్రెయిన్ బలహీనపడుతోందని తెలిసి ఆదేశానికి సహాయం చేసే దేశాల ప్రజల్లో కూడా అసహనం పెరుగుతోందనీ, అందుకనే ఆయా దేశాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు.

ఇప్పటికిప్పుడు ఉక్రెయిన్ ఓటమిని అంగీకరిస్తే అమెరికా సామ్రాజ్యవాదానికి ముప్పు వాటిల్లుతుందనీ, అందులో నుంచి క్రమంగా బైట పడేందుకు ఆదేశం అన్వేషణ చేస్తోందన్నారు. ఉక్రెయిన్ విషయంలో పశ్చిమ దేశాల వైఖరిలో కూడా మార్పు వస్తుందన్నారు. రష్యా, చైనా దేశాల మిత్రత్వం బలంగా మారడంతో పాటు ఈరెండు దేశాలకు ప్రపంచ దేశాలు మద్దతుగా నిలబడటాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతుందని చెప్పారు. రష్యా యుద్ధం సాకుగా చూపి ఇతర దేశాలను తమ వైపు తిప్పుకోవాలనుకున్న అమెరికా పన్నాగం పారలేదన్నారు. అమెరికా మద్దతిచ్చే దేశాల సంఖ్య తగ్గుతోందని తెలిపారు. చైనాను కట్టడి చేసేందుకు తీసుకున్న విధానల పట్ల అమెరికాపై వ్యతిరేకత తీవ్రంగా పెరుగుతోందని వివరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికా నుంచి వేరుపడి రష్యా, చైనా వైపు వెళితే సామ్రాజ్యవాదానికి పెను ముప్పు జరుగుతుందని భావించి.. భారత్‌ను ముందుపెట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలని అమెరికా కుట్ర చేస్తోందని చెప్పారు. అందుకే ఉక్రెయిన్ విషయంలో అమెరికా కాస్త వెనక్కితగ్గిందన్నారు.

రష్యా చైనా దేశాలు ప్రధాన భాగస్వామిగా ఏర్పడ్డ బ్రిక్స్.. ప్రధాన వాణిజ్య కూటమిగా అవతరించడం అమెరికాకు మింగుడుపడటం లేదన్నారు. దీన్ని కట్టడి చేసేలా ఢిల్లీ డిక్లరేషన్‌లో కొన్ని మార్పులు చేశారన్నారు. జి20 సదస్సు నిర్ణయాలను అమలు చేసేందుకు ప్రత్యేక యంత్రాగం లేదు కానీ బ్రిక్స్ నిర్ణయాలను అమలుచేసేందుకు ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసిందని పేర్కొన్నారు. లైంగిక అసమానతలు తగ్గించాలి, అవినీతిని అరికట్టాలి, ప్రజా ఆరోగ్యం, మత విశ్వాసాలను కాపాడతాం, పర్యావరణ పరిరక్షణ వంటి పలు కీలక అంశాలపై డిక్లరేషన్ చేశారు కానీ వాటిని అమలు చేసే ఫోరమ్ లేకపోవడం ప్రధాన అవరోధంగా మారిందన్నారు. జి20 సదస్సులో పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేసే సాంప్రదాయాన్ని ఈసారి పాటించలేదన్నారు. కేవలం ప్రభుత్వాల మధ్య మాత్రమే చర్చలు జరిగాయన్నారు. గతంలో నిర్దేశించిన మిలినియం డెవలప్‌మెంట్ గోల్స్ సాధించలేదు కాబట్టి దాని పేరు మార్చి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌గా ఈసారి ఎజెండా రూపొందించారని చెప్పారు. ప్రపంచంలో జరిగే వాణిజ్యంలో 75శాతం వ్యాపారం జి 20 దేశాల్లో జరుగుతుంది కాబట్టే ఈ సదస్సుకు ప్రాధాన్యత ఉందన్నారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ వెబినార్‌ను సమన్వయం చేశారు.

ఆలయంలో ఆయుధ శిక్షణ వద్దు

కేరళ హైకోర్టు తీర్పు


తిరువనంతపురం : తిరువనంతపురంలోని సర్కారా దేవి ఆలయంలో ఆయుధ శిక్షణకు అనుమతి లేదని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. తన ఆదేశాల అమలులో ఆలయ బాధ్యతలు చూస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు అవసరమైన సాయం అందించాలని పోలీసులను ఆదేశించింది. ఆలయంలో ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకూ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విన్యాసాలు, ఆయుధ శిక్షణ జరుగుతున్నాయంటూ ఇద్దరు భక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు అనిల్ కే నరేంద్రన్, పీజీ అజిత్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కేరళలో తన యాజమాన్యంలో నడుస్తున్న దేవాలయాలలో ఆర్ఎస్ఎస్ సంస్థ ఆయుధ శిక్షణ ఇవ్వడాన్ని నిషేధిస్తూ 2016లోనే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సర్క్యులర్ జారీ చేసింది. తన ఆదేశాల అమలుపై 2021 మార్చిలోనూ, తిరిగి ఈ సంవత్సరం మేలోనూ బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసింది. కాగా దేవాలయం ఆవరణలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నారని, దీనివల్ల ఆలయ పవిత్రతకు, ప్రాంగణంలో పరిశుభ్రతకు విఘాతం ఏర్పడుతోందని పిటిషనర్లు ఆరోపించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా వెలువడే దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. విన్యాసాలలో భాగంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పెద్ద శబ్దంతో నినాదాలు చేయడం వల్ల ప్రశాంతతకు భంగం వాటిల్లుతోందని కూడా తెలిపారు. కాగా దేవాలయంలో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని ఆర్ఎస్ఎస్ వివరణ ఇచ్చింది. కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ కూడా ఈ ఆరోపణలను తోసిపుచ్చారు.

2,862కు చేరిన మొరాకో మృతులు

రాబట్ : మొరాకోలో సంభవించిన పెను భూకంపంలో మరణించిన వారి సంఖ్య 2,862కు చేరింది. రెండున్నర వేల మందికి పైగా గాయపడ్డారు. రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో శుక్రవారం రాత్రి సంభవించిన భూకంకం ధాటికి మొరాకోలోని పలు నగరాలు ధ్వంసమయ్యాయి. అనేక భవనాలు కుప్పకూలాయి. గత 60 సంవత్సరాలలో ఇంతటి పెను విషాదం ఎన్నడూ సంభవించలేదని స్థానిక మీడియా తెలిపింది. 1960లో దేశంలోని పశ్చిమ ప్రాంతంలో సంభవించిన భూకంపం కారణంగా కనీసం 12 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్లపై పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డుగా పడడంతో శిథిలాల తొలగింపు కోసం అవసరమైన సామగ్రి ఇప్పటికీ బాధిత ప్రదేశాలకు చేరుకోలేదు. కాగా బ్రిటన్, ఖతార్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాల నుండి మొరాకోకు సాయం అందుతోంది. శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్నప్పటికీ వాటి కింద ఇంకా ఎవరైనా సజీవంగా ఉన్నారా అనే విషయంపై అనుమానాలు కలుగుతున్నాయి. బతికి బయటపడే వారు ఉండకపోవచ్చునని సహాయ సిబ్బంది చెబుతున్నారు.

ఆడిట్ నివేదికలు ఇవ్వండి

- రియల్టర్లకు 'రెరా' చైర్మెన్ హెచ్చరిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ ఆథారిటీ (రెరా) చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ పొందిన రియల్ ఎస్టేట్ ప్రమోటర్లు, బిల్డర్లు సెప్టెంబర్ నెలాఖరులోగా త్రైమాసిక, వార్షిక ఆడిట్ నివేదికల్ని తప్పనిసరిగా సమర్పించాలని ఆ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ కోరారు. ప్రాజెక్టు త్రైమాసిక నివేదికను సెక్షన్ 11(1)(బీ) ప్రకారం ప్రమోటర్ లాగిన్ ద్వారా 'రెరా' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. వార్షిక అకౌంట్ ఆడిట్ నివేదికల్ని ఏటా సెక్షన్ 4(2)(ఎల్)(డీ) ప్రకారం ప్రొవిజన్ 3 ద్వారా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. త్రైమాసిక నివేదికలు ఏటా ఏప్రిల్ 15, జూలై 15, అక్టోబర్ 15, జనవరి 15 తేదీల్లోపు నివేదించాలని తెలిపారు. దీనికి సంబంధించి బిల్డర్లు, ప్రమోటర్లకు మెసేజ్‌లు, ఈ- మెయిల్స్, నోటీసులు పంపామని వివరించారు. త్రైమాసిక నివేదికల కోసం ఫారం - 4, 5, 6, వార్షిక నివేదికల కోసం ఫారం - 7 వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయనీ, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏజెంట్లూ రిజిస్టర్ చేసుకోవాలి

రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కూడా 'రెరా'లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ తెలిపారు.

మంగళవారం హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ హెూటల్లో యూనిక్ రియాలిటీ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 220 మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు మూడు రోజుల అవగాహనా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రెరా చట్టం ప్రమోటర్లు, కొనుగోలుదారులు, ఏజెంట్ల కోసం మాత్రమే పనిచేస్తుందని స్పష్టంచేశారు. రెరాలో ఏజెంట్లుగా దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లో సిస్టం ద్వారా సర్టిఫికెట్ జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ సీఈవో సుశీల్ కుమార్, కో ఫౌండర్ వేణు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


15 వరకూ ఎడిటర్స్ గిల్డ్ సభ్యులను అరెస్ట్ చేయొద్దు :సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఎడిటర్స్ గిల్డ్ సభ్యులను ఈ నెల 15వ తేదీ వరకూ అరెస్ట్ చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. మణిపూర్ హింసపై కొన్ని మీడియా సంస్థలు అనైతికంగా, ఏకపక్షంగా అందిస్తున్న విశ్లేషణల్లో వాస్తవాలు తెలుసుకోవాల్సిందిగా సైన్యం కోరడంతో తాము ఆ రాష్ట్రంలో పర్యటించామని అంతకుముందు ఎడిటర్స్ గిల్డ్ సభ్యులు న్యాయస్థానానికి తెలియజేశారు. సైన్యం కోరిక మేరకే స్వచ్ఛందంగా మణిపూర్ వెళ్లామని వివరించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఎదుట గిల్డ్ సభ్యుల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు విన్పించారు. ఎడిటర్స్ గిల్డ్‌కు చెందిన త్రిసభ్య నిజ నిర్ధారణ బృందం పైన, దాని అధ్యక్షుడి పైన నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. 'సైన్యం కోరితేనే వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు మణిపూర్ వెళ్లాము. సెప్టెంబర్ 2న మా నివేదికను ప్రచురించాము. మూడో తేదీ రాత్రి ఐపీసీ కింద మమ్మల్ని విచారించారు. మాకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి కూడా ప్రకటనలు చేశారు. ఓ నివేదికను ప్రచురించినందుకు మమ్మల్ని ఎలా విచారిస్తారు?' అని ఎడిటర్స్ గిల్డ్ సభ్యులు వాదించారు.

మ్యానిఫెస్టోకు సూచనలు, సలహాలు ఇవ్వండి : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక శాస్త్రీమైన మ్యానిఫెస్టోను రూపొందించబోతున్నదని టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. అందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రజలను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మ్యానిఫెస్టో కమిటీ సమావేశమైంది. అనంతరం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మ్యానిఫెస్టో ఏ విధంగా ఉండాలనే అంశంపై చర్చించినట్టు తెలిపారు. వాగ్దానాలకే పరిమితం కాకుండా మ్యానిఫెస్టో ఉండాలని భావిస్తున్నట్టు తెలిపారు. సోనియా ఇచ్చిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని చెప్పారు. అది ప్రజల జీవితాల్లో మార్పు వచ్చేలా ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలందరి ఆకాంక్షలమేరకు ఉంటుందని చెప్పారు. 'మీ ఆలోచనను మాకు తెలియజేయండి. రండి, మీ సలహా సూచనలు ఇవ్వండి. మార్పు కోసం ఒక్క అడుగు వేయండి' అని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్లతోపాటు సోనియాగాంధీ ఇచ్చే ఐదు హామీలను పొందుపరుస్తామన్నారు. ప్రజల నుంచి సలహాలు స్వీకరించేందుకు గాంధీ భవన్‌లో కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.



సమస్య దరిచేరకుండా...

థైరాయిడ్... ఎక్కువగా వినిపిస్తున్న మాట. ఈ మధ్య కాలంలో పది మందిలో కనీసం ఇద్దరైనా ఈ సమస్యతో బాధ పడుతున్నారు. అంతగా ఈ సమస్య పెరిగిపోయింది. వయసు తో సంబంధం లేకుండా దీని బారిన పడుతున్నారు. ఇక మహిళలకైతే చెప్పాల్సిన పని లేదు. ముఖ్యంగా యుక్త వయసు అమ్మాయిల్లోనే థైరాయిడ్ సమస్యలు ఎక్కువగా ఏర్పడుతున్నాయని ఓ సర్వేలో తేలింది. అందుకే మహిళలంతా థైరాయిడ్ గురించి వీలైనంత స్పష్టంగా తెలుసుకోవడం చాలా మంచిది.

రక్తంలో థైరాక్సిన్ హార్మోన్ శాతం తక్కువగా ఉండటం వల్లే థైరాయిడ్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య వచ్చిందనడానికి కొన్ని సూచనలు ఉన్నాయి. కాస్త పనికే అలసిపోతుంటారు. ఎంతసేపు పడుకున్నా ఇంకా పడుకోవాలనిపిస్తుంది. ఏ పనీ చేయాలనిపించదు. ఉన్నట్టుండి బరువు పెరగడమో లేక తగ్గిపోవడమో మొదలవుతుంది. విసుగు, కోపం ఎక్కువవుతుంటాయి. గుండె దడ, టెన్షన్ పెరుగుతాయి. కొందరిలో రుతుస్రావంలో కూడా మార్పులు కనిపిస్తాయి. రుతుస్రావం అధికంగా అవ్వడం, నెలలో ఒకసారి కంటే ఎక్కువసార్లు రావడం వంటివి ఏర్పడుతుంటాయి. లేదంటే రావాల్సిన సమయానికి రాకపోవడం, వచ్చినా సరిగ్గా అవ్వకపోవడం వంటివి కూడా ఇందులో భాగమే. జుట్టు రాలిపోవడం, చర్మం పొడిబారిపోవడం వంటి సమస్యలు కూడా కొందరిలో కనిపిస్తాయి. కండరాల నొప్పులు కూడా రావొచ్చు. కొందరిలో గొంతు కూడా మారుతుంది. వీటిలో ఏ లక్షణాలు కనిపించినా వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది.

థైరాయిడ్ సమస్య ఏర్పడిందనగానే కంగారు పడిపోకూడదు. మొదట వచ్చినది ఏ రకమైన సమస్య అనేది తెలుసుకోవాలి. హైపో థైరాయిడిజమ్ అయితే థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గిపోవడం వల్ల ఏర్పడుతుంది. హైపర్ థైరాయిడ్ గ్రంథి అయితే చేయాల్సిన దాని కన్నా ఎక్కువగా చేయడం వల్ల వస్తుంది. మీకు ఏర్పడింది ఏ రకమైన సమస్యో తెలుసుకుంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుస్తుంది. అందుకే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి.

- థైరాయిడ్‌కి డాక్టర్ సూచించిన మందులతో పాటు పోషకాహారం తీసుకోవడం మంచి పరిష్కారం.
- మాంసకృత్తులు, విటమిన్లు పుష్కలంగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి.
- బి విటమిన్ ఎక్కువగా ఉండే పాలు, పాల ఉత్పత్తులు, రాగి జావ లాంటివి మేలు చేస్తాయి.
- ఇనుము ఎక్కువగా ఉండే గుడ్లు, ఆకు కూరలు, ఖర్జూరం వంటివి తీసుకోవడం వల్ల నీరసం, అలసట తగ్గుతాయి.
- సోయా గింజలు, పాలకూర, వెల్లుల్లి, తృణధాన్యాలు, మొలకెత్తిన విత్తనాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- జంక్ ఫుడ్‌కి పూర్తి దూరంగా ఉండండి. ఉప్పు విషయంలో అన్నిటికంటే ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి.
- వ్యాయామం కూడా తప్పనిసరి. మందులు వాడుతూ, పోషకాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉంటే థైరాయిడ్ సమస్యను అధిగమించవచ్చు.

కోడిగుడ్డు తాజావో కాదో తెలుసుకోవాలంటే... గుడ్డును బాగా పరిశీలించాలి. పై పెంకు షైనింగ్‌గా ఉంటే తాజావి. రంగు మారితే నిల్వ ఉన్నవి.



ఈ అవ్వకు ఫాలోయింగ్ ఎక్కువ

89 ఏండ్ల వీరమ్మాళ్ పాటి... తమిళనాడులోని మొట్టమొదటి జీవవైవిధ్య వారసత్వ ప్రదేశమైన అరిట్టపట్టి పంచాయతీ ప్రెసిడెంట్. ఈ వయసులోనూ జనం సమస్యలు చూస్తే ఆమె రక్తం ఉడికిపోతున్నది. ఆ సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూనే ఉంది. తన గ్రామాన్ని మార్చాలనే లక్ష్యంతో 300 ఇండ్లకు అవసరమైన పాఠశాలలు, వంతెనలు, తాగునీటి కుళాయిలను నిర్మించిన ఆమెను ఇటీవలె ఐఎఎస్ అధికారి సుప్రియా సాహు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలతో ముంచెత్తారు.



89 ఏండ్ల వీరమ్మాళ్ పాటి (తమిళంలో అమ్మమ్మ) తమిళనాడులో అత్యంత పురాతనమైన పంచాయతీకి ప్రస్తుతం అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత ఏడాది ఆమె నేతృత్వంలోని మదురైలోని అరిట్టపట్టి గ్రామాన్ని తమిళనాడు ప్రభుత్వం రాష్ట్ర మొదటి జీవవైవిధ్య వారసత్వ ప్రదేశంగా ఎంపిక చేసింది. పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీ శాఖలో ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అయిన ఐఎఎస్ అధికారి సుప్రియా సాహుకు ఇటీవల అరిట్టపాటి ఆతిథ్యం ఇచ్చారు. 'వీరమ్మాళ్ తన జీవితమంతా ఈ గ్రామ అభివృద్ధికి ధారపోస్తూనే ఉన్నారు. గ్రామంలో పుట్టి, పెరిగి, పెండ్లి చేసుకున్న ఆమె తన యవ్వనంలో యువతులకు వ్యవసాయం కోసం రుణాలు పొందేందుకు, కుటుంబ వివాదాలను పరిష్కరించడంలో వారికి సహాయపడే స్వయం సహాయక బృందాలకు నాయకత్వం వహించారు' అంటూ సోషల్ మీడియా వేదికగా ఆమెను హృదయపూర్వకంగా అభినందిస్తూ ప్రశంసల వర్షం కురిపించారు ప్రియాంక. దాంతో యువతలో ఆమెకు ఫాలోయింగ్ పెరిగిపోతున్నది.

ప్రజల కోసం తపిస్తూ...

'గ్రామానికి తిరిగి ఇవ్వాలనే తపన మా కుటుంబంలో ఎప్పుడూ ఉంటుంది. మా అన్నయ్య గ్రామ అభివృద్ధికి కృషి చేసాడు. నా భర్త ఒక ఏడాది మొత్తం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించాడు' అంటుంది ఆమె. వీరమ్మాళ్ స్వయంగా పంచాయతీ ఎన్నికలకు 2006, 2011లో పోటీ చేసింది. చివరికి 2020లో తన 86 ఏండ్ల వయసులో మూడోసారి పోటీ చేసి గెలుపొందింది. 'గ్రామ ప్రజలు, ప్రత్యేకించి మహిళలు, వారి ఆశయాల పట్ల ఆమెకున్న అంకితభావాన్ని ప్రజలు గుర్తించారు. అందుకే ఆమెను పంచాయతీ అధ్యక్ష పదవికి ఎంపిక చేశారు. ప్రజల పట్ల తనకున్న శ్రద్ధను నిరూపించుకుంటూ వారి కోసం ఏండ్ల తరబడి శ్రమిస్తూ, గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ మంచి పేరును సంపాదించుకున్న' అని అరిట్టపట్టి గ్రామ అటవీ కమిటీ హెడ్ ఆర్ ఒడయన్ అంటున్నారు.

ఎన్నో అడ్డంకులు ఉన్నప్పటికీ...

'నేను చివరకు నా ప్రజల జీవితాలను మార్చగల స్థితిలో ఉన్నాననే నమ్మకం వచ్చింది' అని ఆమె చెప్పారు. గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. తన మూడేండ్ల పదవీ కాలంలో వీరమ్మాళ్ నాలుగు నీటి ట్యాంకులు, నీటి వంతెనల నిర్మాణం చేసారు. కేంద్ర ప్రభుత్వ 'జల్ జీవన్ మిషన్' కింద 300 ఇళ్లకు తాగునీరు అందించడంలో సహాయం చేసింది. చాలా చోట్ల వీధి దీపాలు వెలిగించారు. పనికి రాకుండా ఉన్న ఎన్నో వీధి స్తంభాలను బాగుచేయించారు. గ్రామంలో తక్షణ అవసరాలైన విద్య, రహదారుల కోసం పనిచేయడం వీరమ్మాళ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ఎన్నో అడ్డంకులు ఉన్నప్పటికీ గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేసింది. అయితే గ్రామంలో బలంగా ఉన్న అధికార రాజకీయాలు, పితృస్వామ్యం నుండి తప్పించుకోలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. 'ప్రత్యర్థి నాయకులు, వారి మనుషులు గ్రామ అభివృద్ధి కోసం వీరమ్మాళ్ చేస్తున్న ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించారు. వారి నాయకులు చాలా మంది గతంలో గ్రామ పదవుల్లో ఉన్నారు. దాంతో ఆమె అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న ప్రాజెక్టులను నిలిపివేయడానికి, ఆలస్యం చేయడానికి వారు వారి బలాన్ని ఉపయోగించుకుంటున్నారు' అని ఒడయన్ చెప్పారు.

పనులను అడ్డుకుంటున్నారు

60 ఏండ్ల నాటి శిథిలావస్థలో ఉన్న గ్రామ ప్రాథమిక పాఠశాలల స్థలంలో షెడ్యూల్డ్ కులాల మహిళలకు మరుగుదొడ్లు, రోడ్లు, కొత్త క్యాంపస్‌లు నిర్మించాలని ఎన్నో ఏండ్ల నుండి ప్రయత్నిస్తున్నానని వీరమ్మాళ్ చెప్పారు. 'గ్రామంలో చాలా పోరంబోకే భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల పరిధిలోకి రాని భూమి ఉంది. మేము దాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలని ప్రయత్నిస్తున్నాం. కానీ ప్రతిపక్ష అభ్యర్థులు, వారి వ్యక్తులు తమ బలంతో ఈ ప్రాజెక్టులను చేపట్టకుండా అడ్డుకుంటున్నారు. ఈ భూముల విషయంలో వారు గ్రామంలోని ప్రజలను కూడా ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తారు' అని ఒడయన్ చెప్పారు.

పట్టువదలకుండా...

'అన్ని చోట్లా రాజకీయాలు ఉంటాయన్నది నిజమే. అయితే ఈ వయసులో నేను కోర్టుల చుట్టూ పరిగెత్తలేనని వారికి తెలుసు. అందుకే ఇక్కడ పరిస్థితి చాలా దారుణంగా ఉంది' అని వీరమ్మాళ్ అంటున్నారు. కానీ ఇంత వయసు వచ్చినా ఆమె తన పట్టుదలను మాత్రం విడిచిపెట్టలేదు. ప్రతిరోజూ ఆమె ఉదయం 5 గంటలకు నిద్రలేచి, తనే స్వయంగా వంట చేసుకుంటుంది. ఆఫీసులో తన అవసరం పెద్దగా లేనపుడు పొలంలో పని చేస్తుంది. ఈ భూమిపై నా కాలం ముగిసేలోపు నా గ్రామానికి నేను చేయగలిగినదంతా చేయాలనుకుంటున్నాను' అంటూ ఆమె తన మాటలు ముగించారు.





మంత్రులకూ తెలవదట!

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తే చట్టసభలలో మహిళలకు మూడో వంతు సీట్లు రిజర్వు అవుతాయి. కానీ అందుకోసమే ఈ సమావేశాలా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ముందస్తు ఎన్నికల కోసమా?

మరో ఊహాగానం ఏమంటే.. ప్రభుత్వం లోక్‌సభకు ముందుగానే ఎన్నికలు జరపబోతోందని మీడియాలో వచ్చిన కథనాలు. షెడ్యూల్ ప్రకారం అయితే లోక్‌సభకు వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అంటే మరో ఏడెనిమిది నెలల సమయం ఉంది. 2004లో వాజ్‌పేయి ప్రభుత్వం చేసినట్లు గానే ఈ ఎన్నికలను కొంచెం ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తోందని వార్తలు వస్తున్నాయి. అయితే వీటిని చాలా మంది నమ్మడం లేదు. ఎందుకంటే ముందస్తు ఎన్నికలకు వెళ్లిన వాజ్‌పేయి సర్కారుకు భంగపాటే ఎదురైంది.

జమిలికి ఎన్నికలకా?

ఇక మరో ఊహాగానం....ఒకే దేశం ఒకే ఎన్నిక. అంటే జమిలి ఎన్నికలు. దీని ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. వీటిలో స్థానిక ఎన్నికలను కూడా కలుపుతారా అనేది ఇంకా తేలడం లేదు. పైగా ఉప ఎన్నికల సంగతి ఏమిటి? అన్ని ఎన్నికలకూ కలిపి అవసరమైన ఈవీఎంలను ఎలా సమకూరుస్తారు? ఈ ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లేవు. వీటిని అధ్యయనం చేసేందుకే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కానీ ఈ కమిటీ ప్రత్యేక సమావేశాల లోగా ఎలా నివేదిక ఇస్తుందన్నది ఇంకా తెలియదు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై వస్తున్నవన్నీ ఊహాగానాలే. ప్రత్యేక సమావేశాల గురించి మరో ఊహాగానం కూడా వినిపిస్తోంది. ఓబీసీ రిజర్వేషన్లలో ఉప కులాల వర్గీకరణను పరిశీలించేందుకు 2017లో ఓ కమిషన్ ఏర్పడింది. దానిని గురించి చర్చించేందుకే ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారని చెబుతున్నారు.

రాజద్రోహం పిటిషన్లు రాజ్యాంగ ధర్మాసనానికి..

(మొదటిపేజీ తరువాయి)

శిక్షాస్మృతి నిబంధనల్లో మార్పులు చేర్పులు చేపడుతున్న నేపథ్యంలో విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేయటాన్ని వాయిదా వేయాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సంబంధిత పత్రాలను సీజేఐ ఎదుట ఉంచాలని, తద్వారా రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుపై తదుపరి చర్యలు తీసుకుంటారని రిజిస్ట్రీని ఆదేశించింది. భారత శిక్షాస్మృతిని పున్ణపరిశీలించడంపై సంప్రదింపులు కీలక దశలో ఉన్నాయని కేంద్రం చెప్పడంతో మే 1న ఈ పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ క్రమంలోనే ఆగస్టు 11న ఐపీసీ, సీఆర్ పీసీ, ఎవిడెన్స్ చట్టాలను వేరే కొత్త చట్టాలతో భర్తీ చేసేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. కాగా, రాజద్రోహం సెక్షన్‌ను సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. వి. రమణ 16 నెలల క్రితమే నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఐపీసీలోని సెక్షన్ 124ఏ కింద ఎలాంటి కేసులూ నమోదు చేయొద్దని, వలస పాలకులు తెచ్చిన ఆ చట్టాన్ని సమీక్షించాలని ఆయన గతేడాది మే 11న కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేశారు.

మళ్లీ మాదే అధికారం

(మొదటిపేజీ తరువాయి)

అంటే ఎంత దరిద్రంగా ఉంటుందో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందంటే కూడా అంతే దరిద్రంగా ఉంటుందని ఆయన కామెంట్ చేశారు. ప్రగతిభవన్ లో మంగళవారం ఆయన ప్రింట్ మీడియా రిపోర్టర్లతో చిట్ చాట్ చేశారు. తమ పార్టీ తొలి జాబితాను మూడు నెలల ముందే ప్రకటించే సరికి ప్రతిపక్షాలు అయోమయంలో పడ్డాయని తెలిపారు. వారికి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలియదనీ, అవి ఢిల్లీ బానిస పార్టీలంటూ విమర్శించారు. తెలంగాణకు మోడీ ఒక్క పైసా ఇవ్వకున్నా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అడగవని విమర్శించారు. బీజేపీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జమిలీ ఎన్నికలంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ అవగాహనలో ఉన్నాయనీ, అందుకే ఒకరినొకరు విమర్శించుకోరని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిణామాలు వారి తలనొప్పి అంటూ తమకెలాంటి సంబంధం లేదని వ్యాఖ్యానించారు.

కౌలు రైతులను గుర్తించాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

న్యాయసమ్మతమైనవి అన్నారు. వారి పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతు ఇస్తోందన్నారు. కౌలు రైతుల సమస్యలను సర్కారు విస్మరిస్తున్నదని చెప్పారు. కౌలు రైతు చట్టాన్ని అమలు చేయడంతోపాటు వారిని గుర్తించాలని కోరారు. ఆనాడుచంద్రబాబు కూడా పేదల భూములను కార్పొరేట్‌కు అప్పగించేందుకు ప్రయత్నించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కౌలు రైతులు లేరంటూ సీఎం కేసీఆర్ చెబుతున్నారనీ, ఇంకా కనువిప్పు కలగలేదన్నారు. సీపీఐ(ఎం) అధికారంలో ఉన్న సమయంలో కౌలు రైతుల కోసం 'ఆపరేషన్ బర్గా' పేరుతో హక్కులు కల్పించామన్నారు. ప్రస్తుతం కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కూడా 'కుటుంబ శ్రీ' పేరుతో కౌలు రైతులకు అండగా ఉంటున్నదని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగానే కౌలుదార్లకు చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం చూపడం లేదన్నారు. అనేక పోరాటాల ఫలితంగానే కౌలు రైతు చట్టాన్ని సాధించామని తెలిపారు. ఆ చట్టంతో కౌలు రైతుకు బ్యాంక్ రుణాలు, పంట అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వారిని గుర్తించాలంటూ లోకాయుక్తలో కేసు వేశామనీ, అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఆ తీర్పును అమలు చేయాలని ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో కమ్యూనిస్టులు పోరాటం చేశారని తెలిపారు. ఈ అంశాన్ని తమ పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చుతామన్నారు. సీపీఐ (ఎం-ఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ కౌలు రైతుల కౌలు తగ్గించేందుకు కృషి చేయాల్సిన అవసరముందని చెప్పారు. వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన సీఎం కేసీఆర్ కౌలు రైతుల లెక్కలు ఎందుకు తీయడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

రైతు బంధు పేరుతో భూస్వాములకు వేల కోట్లు కట్టబెట్టిన సీఎం కౌలు రైతులకు మాత్రం అన్యాయం చేశారని తెలిపారు. కౌలు రైతులు మరణిస్తే ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్యవేదిక నాయకులు కన్నెగంటి రవి, విస్సా కిరణ్, కొండల్ సమన్వయపరిచారు. ఎస్‌డీఎఫ్ నేత వెంకట్‌రెడ్డి, టీజేఎస్ నేత లక్ష్మి, అంబటి నారాయణ, సత్యవతి, జక్కుల వెంకటయ్య, సోమిడి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

కేటీఆర్‌కు రాజకీయ నాలెడ్జ్ లేదు

(మొదటిపేజీ తరువాయి)

తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తెలంగాణ ద్రోహులను తీసేయాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర ఒక శాతం మాత్రమేనన్నారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కేసీఆర్ 115 మంది అభ్యర్థులను ప్రకటించి ఒక్కొక్కరికీ రూ.10 కోట్లు ఇచ్చి పంపించారని ఆయన ఆరోపించారు. మేము తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమం చేస్తున్న సమయంలో కేటీఆర్ అమెరికాలో ఉన్నారని తెలిపారు. చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వకపోవడంతోనే కేసీఆర్ బయటకు వచ్చి పార్టీ పెట్టారని గుర్తు చేశారు. మేమూ తెలంగాణ కోసం కొట్లాడామని తెలిపారు.సోనియాను ఒప్పించి సాధించామన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అసెంబ్లీలో మాట్లాడిన మాటల రికార్డులను కేటీఆర్ వినాలి. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందంటూ కేసీఆరే అన్నారు. సోనియా పాత్ర లేదంటూ కేటీఆర్ అంటున్నాడు. తెలంగాణ ఉద్యమం కోసం చలించి సోనియా తెలంగాణ ఇచ్చింది. సోనియాపై, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం కేటీఆర్‌కి తగదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిందో చెప్పాలి. ఎన్నికలు వస్తున్నాయనే పూర్తికాకుండానే పాలమూరు ప్రాజెక్టు ప్రారంభిస్తున్నారు.' అని విమర్శించారు. దానం నాగేందర్ కట్టె పట్టుకుని తెలంగాణ ఉద్యమకారులను కొట్టారని గుర్తు చేశారు. ఆరేయ్ కేసీఆర్...ఫుట్‌బాల్ లాగా తంతాను అన్న తలసాని మంత్రి ఎలా అయ్యాడు?అని నిలదీశారు. పార్లమెంట్‌లో తెలంగాణ కోసం ఒక్కసారైనా కేసీఆర్ మాట్లాడాడా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటులో సోనియా పాత్ర లేకపోతే కేసీఆర్ కుటుంబం సోనియాను ఎందుకు కలిశారు? ఎందుకు గ్రూప్ ఫోటో దిగారని ప్రశ్నించారు. మహమూద్ అలీ, పద్మ దేవేందర్‌రెడ్డిని బానిసలాగ చూసింది నిజం కాదా? మంత్రులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బానిసత్వం కాదా? దట్టీలు కట్టడానికి తప్ప మహమూద్ అలీ దేనికి పనికిరాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ముఖ్యమంత్రులవుతారనీ, బీఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు కేసీఆర్, తర్వాత కేటీఆర్, ఆ తర్వాత హిమాన్షు ముఖ్యమంత్రి అవుతారని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు.

కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రిలో చేర్పించారు. కేజీబీవీ పాఠశాలలో 272 మంది విద్యార్థినులు ఉండగా, ఎప్పటిలాగే సోమవారం రాత్రి 7 గంటలకు భోజనం చేసి పడుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో 103 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురికాగా పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సమాచారం అందించగా.. వారు హాస్టల్‌కి వచ్చి విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం విద్యార్థులను అంబులెన్స్‌లలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆస్పత్రికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ ఘటనపై మంగళవారం ఉదయం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రమేష్, డీఈవో దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంఈఓ స్వామి, డిప్యూటీ తహసీల్దార్, రాజశేఖర్, ఎస్ఐ హరిబాబు.. కస్తూర్బా పాఠశాలకు చేరుకొని పాఠశాల పరిసరాలతో పాటు వంట గదిని పరిశీలించారు. భోజన నిర్వాహకులను విచారించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భయాందోళనతో పాఠశాలకు చేరుకోగా.. కోలుకున్న విద్యార్థులను వారితో ఇండ్లకు పంపించారు. కాగా, ఇదే పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణ కేంద్రానికి సుదూరాన ఉన్న ఈ పాఠశాలకు పాఠశాలకు రెగ్యులర్ ప్రత్యేక అధికారి లేకపోగా, ఇన్‌చార్జి అధికారి పట్టించుకోకపోవడంతో పాటు పై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 15 రోజుల క్రితం రెగ్యులర్ ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పజెప్పినా ఇప్పటికి చార్జ్ తీసుకోకపోవడం వీరి అలసత్వానికి నిదర్శనం.

మెనూలో మార్పే కారణమా..?

విద్యార్థులకు ప్రతిరోజూ అందించే మెనూలో మార్పు వల్లే ఘటన జరిగినట్టు అధికారులు తెలిపినట్టు సమాచారం. సోమవారం ఉదయం అల్పాహారంలో చింతపండు రసం, మధ్యాహ్నం బీరకాయ, కోడిగుడ్డు పెట్టారు. మెనూలో సోమవారం గుడ్డు లేకున్నా గుడ్డు పెట్టడంతో ఉదయం పెట్టిన అల్పాహారంతో ఫుడ్ పాయిజన్ అయినట్టు నిర్ధారణకు వచ్చారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : మంత్రి

భీంగల్ కస్తూర్బా పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు ఆదేశించారు. నిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంటెండ్ ప్రతిమారాజ్‌తో మాట్లాడి విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

రెండ్రోజుల్లో ఆర్టీసీ బిల్లుకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం చేసిన ప్రభుత్వం, ఇప్పుడు 25 రోజులకు పైగా తనవద్దే ఎందుకు పెండింగ్‌లో పెట్టుకుందని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక, కార్మికులకు అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయనీ, వాటన్నింటినీ క్రోడీకరించి 33 సూచనలతో ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చామన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, పరిష్కారాలు సూచిస్తూ బిల్లులో పొందుపర్చాలని కోరారు. గతంలో రాజ్‌భవన్ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేతలు ఇప్పుడు ప్రగతిభవన్ ముట్టడికి ఎందుకు పిలుపు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. ఆర్టీసీలోని ఇతర కార్మిక సంఘాలు కూడా జేఏసీలోకి రావాలనీ, విలీనం తర్వాత ఉత్పన్నమయ్యే పరిస్థితులపై ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ కే హన్మంతు, కో కన్వీనర్లు ఎమ్ నరేందర్, పీ హరికిషన్, అబ్రహం, సురేష్, శర్మ, శంకర్ ఉన్నారు.

యూసీసీకి వ్యతిరేకంగా తీర్మానించనున్న నాగాలాండ్

(మొదటిపేజీ తరువాయి)

సంప్రదాయాలు, సంస్కృతులకు నెలవైన భారతదేశంలో ఇలాంటి చట్టాన్ని తీసుకురావడం నిష్ప్రయోజనమని, పైగా అది ప్రతికూల ఫలితాన్ని ఇస్తుందని తెలిపారు. ఒకవేళ పార్లమెంటు యూసీసీని ఆమోదిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (ఏ) కింద నాగాలాండ్‌కు మినహాయింపు లభిస్తుందని ఆయన గుర్తు చేశారు. నాగాల మత, సామాజిక పద్ధతులకు సంబంధించిన వ్యవహారాలకు పార్లమెంట్ చట్టాలు వర్తించబోవని స్పష్టం చేశారు. బెంగాల్ ఈస్టర్న్ ఫ్రాంటియర్ రెగ్యులేషన్ చట్టం మేరకు యూసీసీ నుండి నాగాలాండ్‌ను మినహాయించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి నైఫియూ రియో చెప్పారు. ఈ చట్టం ప్రకారం నాగాలాండ్‌కు న్యాయ, కార్యనిర్వాహక, పరిపాలనా సంబంధమైన అధికారాలు సంక్రమించాయని, భూ సంబంధమైన విషయాలలో స్వయం నిర్ణయధికారం కూడా ఉన్నదని వివరించారు.

అంగన్వాడీ కేంద్రాలుగా మినీ అంగన్వాడీలు

(మొదటిపేజీ తరువాయి)

లక్ష రూపాయలు, హెల్పర్లకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్టు ప్రకటించింది. 50 ఏండ్ల లోపు వారికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్, 50 ఏండ్లకు పైబడిన వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఇవ్వనున్నట్టు తెలిపింది. దురదృష్టవశాత్తు విధుల్లో ఉన్న టీచర్లు మరణిస్తే తక్షణ సహాయం కింద రూ.20 వేలు, హెల్పర్లు మరణిస్తే రూ.10 వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవోలు, ఉత్తర్వులు జారీ చేస్తూ అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు తీపికబురు అందించింది. అదే సమయంలో అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు రిటైర్మెంట్ వయసు 65 ఏండ్లకు పెంచింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏండ్ల రిటైర్మెంట్ వయస్సును నిర్దేశించింది. అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు పదవీ విరమణ తర్వాత ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్వాడీలపై పనిభారం తగ్గించేందుకుగా యాప్‌ను సరళతరం చేస్తామని హామీనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న డిమాండ్లను నెరవేర్చామని ప్రకటించింది. ఈ జీవోల అమలుతో ప్రభుత్వంపై రూ.115 కోట్ల భారం పడనున్నట్టు తెలిపింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న సీఎం కేసీఆర్‌కు మంత్రి సత్యవతి రాథోడ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అంగన్వాడీలకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటికే అంగన్వాడీలకు మూడుసార్లు వేతనాలు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అంగన్వాడీల వేతనాల్లో కేంద్రం వాటా 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 10 శాతం ఉండేదన్నారు. మోడీ సర్కారు తన వాటాను 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల వాటాలను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచి కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పెరిగిన వేతనాల ప్రకారం కేంద్ర వాటా 60 శాతం ఉండాల్సి ఉండగా.. అంగన్వాడీ టీచర్ల వేతనాల్లో 19 శాతం, హెల్పర్ల వేతనాల్లో 17 శాతం మాత్రమే ఇస్తున్నదని తెలిపారు. రాష్ట్రం వాటా కింద వేతనాల్లో 40 శాతం ఇవ్వాల్సి ఉండగా.. టీచర్ల వేతనాల్లో 80 శాతం, హెల్పర్ల వేతనాల్లో 82 శాతం ఉండటం సీఎం కేసీఆర్ ఔదార్యానికి, అంగన్‌వాడీలపై ఆయనకు ఉన్న ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఇక రయ్ రయ్ లేదు?

ఆతిథ్య అవకాశం కోల్పోయిన హైదరాబాద్

నవతెలంగాణ-హైదరాబాద్



ప్రాక్టీస్ రేసు ముంగిట ట్రాక్‌పైకి దూసుకొచ్చిన సాధారణ వాహనాలు (ఫైల్)



ఫార్మ్యూలా వన్ రేసు కిక్కును తెలుగు రేసింగ్ ప్రియులకు అందించిన హైదరాబాద్ ఈ ప్రీ.. మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రావటం లేదు!. 2024 ఫార్ములా-ఈ రేసు షెడ్యూల్ విడుదలైనా.. అందులో హైదరాబాద్ ఈ ప్రీకి చోటు దక్కలేదు. హైదరాబాద్ ఈ రేసు కమర్షియల్‌గా కాసుల వర్షం కురిపించినా.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన రేసు కష్టమేనని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. బెర్లిన్ వరుసగా పదో సీజన్‌లో ఈ రేసుకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. ఫిబ్రవరి 10, 24న జరగాల్సిన రేసులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఫార్ములా ఈ వర్గాలు తెలిపాయి.

అందుకు చాలా కారణాలు!

ప్రపంచవ్యాప్తంగా పది విశ్వ నగరాల్లో ఫార్ములా ఈ రేసు నిర్వహిస్తున్నారు. ఓవరాల్‌గా 17 రేసులు ఉంటాయి. రానున్న అక్టోబర్ 23-27న టెస్టు రన్‌తో మొదలు కానున్న ఫార్ములా-ఈ రేసు.. జనవరి 13న మెక్సికో సిటీలో తొలి రేసుతో షురూ కానుంది. సౌదీ అరేబియా జనవరి 26, 27న ఈ రేసుకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. మూడో రేసుకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వాలి. కానీ తాజాగా ప్రకటించిన షెడ్యూల్‌లో హైదరాబాద్ ఈ ప్రీకి చోటు దక్కలేదు. ' 2024 ఫార్ములా-ఈ రేసు హైదరాబాద్‌కు రావటం లేదు. ప్రస్తుతానికి, హైదరాబాద్‌లో రేసు లేదని చెప్పవచ్చు. ఈ ఏడాది భారత్‌లో ఫార్ములా-ఈ రేసు జరిగే అవకాశాలు అత్యంత స్వల్పం. హైదరాబాద్ రేసుకు షెడ్యూల్ చోటు దక్కపోవడానికి పలు కారణాలు ఉన్నాయి. ప్రత్యేకించి ఓ కారణం చూపలేం. ట్రాక్ పరంగా ఎటువంటి లోపాలు లేవు. హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్ ట్రాక్ అంతర్జాతీయ ప్రమాణాలను అందుకుంది. కానీ ఫార్ములా-ఈ వంటి మెగా ఈవెంట్ నిర్వహణకు ఎంతో అనుభవం, నిపుణత అవసరం. త్వరలోనే హైదరాబాద్ తిరిగి ఆతిథ్య హక్కులు దక్కించుకుంటుందని ఆశిస్తున్నాను. తొలి రేసును హైదరాబాద్ గొప్పగా నిర్వహించింది. కానీ నిలకడగా ప్రపంచ స్థాయి రేసులు నిర్వహించటం అతి పెద్ద సవాల్ అని భారత మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ సమాఖ్య (ఎఫ్‌ఎంఎస్‌సీఐ) ప్రతినిధి ఒకరు తెలిపారు.

హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్ రేసు గొప్ప విజయం సాధించింది. కమర్షియల్‌గా నిర్వాహకులకు లాభాల పంట పండించింది. హైదరాబాద్ ట్రాక్‌పై అత్యుత్తమ టైమింగ్ సైతం నమోదైంది. కానీ నిర్వహణ పరంగా పలు లోపాలు సుస్పష్టం. తొలి రోజు రేసు ముంగిట.. రేసింగ్ ట్రాక్‌పైకి సాధారణ వాహనాలు అనూహ్యంగా దూసుకొచ్చాయి. దీంతో ప్రాక్టీస్ రేసు ఓ గంట ఆలస్యమైంది. ప్రేక్షకులకు పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణలో పలు సమస్యలను పట్టించుకోలేదు. అంతర్జాతీయ ఈవెంట్లలో అభిమానులకు అందించే సౌకర్యాలు, సదుపాయాలకు పెద్ద పీట వేస్తారు. కానీ హైదరాబాద్ ఈ రేసులో అది లోపించింది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది సైతం ఫార్ములా-ఈ రేసుకు హైదరాబాద్ ఆతిథ్యం వహిస్తుందనే ఆశాభావం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సీఎస్ అరవింద్ కుమార్ అన్నారు. ' రానున్న అక్టోబర్‌లో అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్‌ఐఏ) సమావేశం కానుంది. ఆ సమావేశంలో హైదరాబాద్ ఈ రేసుపై సరైన నిర్ణయం తీసుకుంటారని' అరవింద్ కుమార్ అన్నారు.

రొట్టె...పప్పు... ఇక అందని ద్రాక్షేనా ?

- మోడీ అనాలోచిత నిర్ణయాలతో అనర్థాలు
- అమ్మకు అన్నం పెట్టడు కానీ పిన్నమ్మకు బంగారు గాజులట
- అమెరికా రైతులపై వరాల జల్లులు
- స్వదేశీ రైతులకేమో మొండిచేయి





న్యూఢిల్లీ : పప్పులకు, మోడీ ప్రభుత్వానికి మధ్య విచిత్రమైన బంధం ఏదో ఉన్నట్లు కన్పిస్తోంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పప్పుల ధరలకు సంబంధించిన ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. మళ్లీ ఇప్పుడు....తొమ్మిది సంవత్సరాలు దాటిన తర్వాత మన దేశం మరోసారి పప్పులు, ఆహార ధరల ద్రవ్యోల్బణ సంక్షోభాన్ని ఎదుర్కోవడం అనివార్యంగా కన్పిస్తోంది. మార్కెట్లలో పప్పుల ధరలు ఇప్పటికే పెరిగిపోతున్నాయి. దీంతో వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించేందుకు సిద్ధపడుతున్నారు. తమ వద్ద ఉన్న పప్పుల నిల్వలను గోదాములకు తరలించి నిల్వ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వమేమో 2015 నాటి సంక్షోభం తిరిగి పునరావృతం కాకుండా నివారించడానికి ఎగుమతి-దిగుమతులపై ఆంక్షలు విధించడం, కస్టమ్స్ సుంకాలు వంటి చర్యలకు సిద్ధపడుతోంది. ఎర్ర కందిపప్పు, కందిపప్పు, శనగపప్పు ధరలకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలు సానుకూలతకు బదులుగా ప్రతికూల ఫలితాన్ని ఇవ్వడంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. గత వారం వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది. స్టాకిస్టులు తమ వద్ద నిల్వ ఉన్న ఎర్ర కందిపప్పు, కందిపప్పు, శనగపప్పు వివరాలను ప్రభుత్వ పోర్టల్‌లో ప్రకటించేలా చూడాలని అందులో సూచించారు. ఇటీవలి కాలంలో కందిపప్పు ధరలు 25% పెరగడంతో ప్రభుత్వం దిగుమతులకు అనుమతి ఇచ్చింది. దిగుమతిదారులు సైతం తమ వద్ద ఉన్న పప్పుల నిల్వలను ప్రకటించాలంటూ ప్రభుత్వం మరో ఆదేశాన్ని జారీ చేసింది. దిగుమతులపై ఆంక్షలు సడలించడంతో అనేకమంది వ్యాపారులు విదేశాల నుండి పెద్ద ఎత్తున పప్పులు కొనుగోలు చేసి, నిల్వ చేయడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొద్ది నెలల క్రితం ప్రభుత్వం పప్పులపై దిగుమతి సుంకాన్ని తగ్గించింది. అయితే దీనివల్ల వినియోగ దారులు కానీ, రైతులు కానీ ఏ మాత్రం ప్రయోజనం పొందలేదు. ఎందుకంటే దిగుమతిదారులు, విదేశీ వ్యాపారులు, బడా నిల్వదారులు అప్పటికే తమ గోదాముల్లో భారీగా నిల్వలు దింపేశారు. ప్రభుత్వ చర్యలు ప్రశంసనీయంగానే ఉన్నప్పటికీ అవి పప్పుల ధరల ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి సరిపోలేదు.

ప్రభుత్వమే కారణం

పరిస్థితి చేయిదాటి పోవడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని చెప్పక తప్పదు. ప్రచురణకు నోచుకోని ఆదాయపన్ను శాఖ నివేదిక ప్రకారం పప్పుల ధరలను పెంచేలా వ్యాపారులకు అవకాశం ఇచ్చింది ప్రభుత్వమే. పైగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు వ్యవసాయ చట్టాలలో భాగంగా నిత్యావసరాల చట్టాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ వ్యవహారంపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తనకు తానుగా విచారణ చేపట్టినప్పటికీ 'తగిన ఆధారాలు లభించలేద'న్న కారణంతో నిలిపివేసింది. ప్రభుత్వానికే చెందిన ఆదాయపన్ను శాఖేమో సర్కారును తప్పుపడితే, మరో సంస్థ సీసీఐ మాత్రం ఆధారాలు దొరకలేదని తప్పించుకుంది. ఒకే సమస్యపై అధ్యయనం చేసిన రెండు ప్రభుత్వ శాఖలు వేర్వేరు అభిప్రాయాలకు రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. 2015లో పప్పుల ధరలను తారుమారు చేసి, అధిక లాభాలు గడించిన నిల్వదారులు, విదేశీ కార్పొరేషన్లపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు ఆ వ్యక్తులే చట్టాలలోని లోపాలను గమనించి, భారతీయుల ఆకలి కేకల నుండి లాభాలు దండుకునేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారు.

రైతుల మొర వినేదెవరు?

పప్పులపై లాభదాయకమైన కనీస మద్దతు ధరను ప్రకటించాలని దేశంలోని రైతులు పదే పదే కోరుతున్నప్పటికీ ప్రభుత్వానికి చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా ఉంటోంది. చమురు గింజలు, పప్పులకు సంబంధించి బీజేపీ అనుబంధ భారతీయ కిసాన్ సంఘ్ సైతం పలుమార్లు ప్రభుత్వానికి లేఖలు రాసింది. అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం అమెరికా రైతులకే ప్రాధాన్యత ఇస్తోంది. మోడీ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండీ పప్పల దిగుమతులు పెరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ దేశంలోని రైతుల గోడు వినే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికే ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరింది. ఊహించిన దాని కంటే ఆహార భద్రత మరింత ఆందోళన కలిగించే విషయంగా మారుతోంది. ఇప్పటికే కూరగాయల ధరలకు సంబంధించిన ద్రవ్యోల్బణం పెరగడంతో రైతులు, వినియోగదారులు ఆందోళనలో పడిపోయారు. ఇప్పుడు పప్పుల సరఫరా వ్యవహారాన్ని ప్రభుత్వం సరిగా నిర్వహించలేకపోతే, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేకపోతే ప్రజల ఆహారంలో ముఖ్య భాగమైన 'దాల్...రోటీ' అందని ద్రాక్షగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

బైడెన్ మెప్పు కోసం...

జీ-20 సదస్సు నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ప్రసన్నం చేసుకునేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కొన్ని పప్పులపై దిగుమతి సుంకాన్ని 20-30% వరకూ తగ్గించింది. మరే దేశానికీ ఈ వెసులుబాటు ఇవ్వలేదు. భారత్‌కు పప్పులు పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్న దేశాలలో అమెరికా ఒకటి. కృత్రిమ కొరత కారణంగా నాసిరకం పప్పుల ఎగుమతులకు డిమాండ్ ఏర్పడడానికి ప్రభుత్వ చర్య దోహదపడింది. మరోవైపు బైడెన్‌తో సంబంధాలు బలపడ్డాయి. అమెరికా నుండి పప్పులతో పాటు ద్వితీయ శ్రేణి ఆయుధాలను పొందేందుకు మోడీకి అవకాశం లభించింది. దేశీయ ఉత్పత్తిదారుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి బైడెన్, మోడీ, కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చడమే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

బ్యాటర్ల తడబాటు!

• రాణించిన రోహిత్, రాహుల్ • శ్రీలంకపై భారత్ 213/10

నవతెలంగాణ-కొలంబో



విరామం లేని మ్యాచుల అలసట, శ్రీలంక మాయగాళ్ల మాయజాలం మ్యాజిక్.. ఏదైనా భారత బ్యాటర్లు తడబడ్డారు. ప్రపంచ శ్రేణి పాకిస్థాన్ బౌలర్లపై పరుగుల వరద పారించిన చోటే.. శ్రీలంక స్పిన్నర్లకు దాసోహం అయ్యారు. ఆసియా కప్ సూపర్ 4లో శ్రీలంకతో మ్యాచ్‌లో టీమ్ ఇండియా 213 పరుగులకు కుప్పకూలింది. 49.1 ఓవర్లలోనే పతనమైన రోహిత్‌సేన.. అంచనాలను ఏమాత్రం అందుకోలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ (53, 48 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీతో మెరువగా..కెఎల్ రాహుల్ (39, 44 బంతుల్లో 2 ఫోర్లు), ఇషాన్ కిషన్ (33, 61 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) సమోచిత ఇన్నింగ్స్‌లతో రాణించారు. విరాట్ కోహ్లి (3), హార్దిక్ పాండ్య (5), రవీంద్ర జడేజా (4) నిరాశపరిచారు. శ్రీలంక స్పిన్నర్లు దునిత్ వెల్లలాగే (5/40), చరిత్ అసలంక (4/18) తొమ్మిది వికెట్లతో భారత్ పతనాన్ని శాసించారు.

రోహిత్ మెరిసినా.. : టాస్ నెగ్గిన భారత్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. సోమవారం పాకిస్థాన్‌కు కుప్పకూల్చిన బౌలర్లకు కాసింత విరామం అందించేందుకు రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (53), శుభ్‌మన్ గిల్ (19) గత మ్యాచ్ జోరు కొనసాగించారు. గిల్ ఆరంభంలో దూకుడుగా ఆడాడు. దీంతో తొలి వికెట్‌కు ఓపెనర్లు 80 పరుగులు జోడించారు. పవర్‌ప్లే అనంతరం బంతి స్పిన్నర్లు అందుకోగా.. భారత ఇన్నింగ్స్ అక్కడ్నుంచి అనూహ్యంగా మారింది!. గిల్, విరాట్ కోహ్లి (3)లను అవుట్ చేసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ దునిత్ వెల్లలాగే.. టీమ్ ఇండియాను ఒత్తిడిలో పడేశాడు. వెల్లలాగేకు చరిత అసలంక సైతం తోడవటంతో భారత బ్యాటర్ల పరుగుల వేట కష్టమైంది. వెల్లలాగే ఐదు వికెట్లతో మెరవగా.. అసలంక నాలుగు వికెట్ల మాయ జాలం ప్రదర్శించాడు. అర్థ సెంచరీ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ నిష్క్రమించినా.. మిడిల్ ఆర్డర్‌లో ఇషాన్ కిషన్ (33), కెఎల్ రాహుల్ (39) ఆదుకున్నారు. లోయర్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్ (26, 36 బంతుల్లో 1 సిక్స్) మెరుపులతో భారత్ 200 ప్లస్ పరుగులు సాధించింది.

నవచిత్రం

పొలిటికల్ ఎంటర్‌టైనర్



అభయ్ నవీన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'రామన్న యూత్'. ఎంటర్‌టైనింగ్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించింది. ఈ సినిమా ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో హీరో విశ్వక్ సేన్, ప్రియదర్శి, తిరువీర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో, దర్శకుడు అభయ్ నవీన్ మాట్లాడుతూ, 'సినిమా తీయాలనే నా కల నెరవేరింది. మంచి సినిమా చేశామనే ధైర్యాన్ని మాకు మొదట ఇచ్చింది సిల్లీ మాంక్స్ అనిల్. ప్రీ రిలీజ్ చేసి, రిలీజ్ డేట్ అనౌన్స్ చేసుకోవడమే పెద్ద సక్సెస్. ఈ నెల 15 నా లైఫ్‌లో స్పెషల్ డే. ఆ రోజును మా నాన్నకు అంకితమిస్తా' అని తెలిపారు.

'చరిత్ర సృష్టించే సినిమాలకు బడ్జెట్ ఇంత ఉండాలనే అవసరం లేదు అని పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డి, బలగం, మసూద, ఫలక్ నుమా దాస్ వంటి ఎన్నో సినిమాలు ప్రూవ్ చేశాయి. రామన్న యూత్‌కు అలాంటి మ్యాజిక్ వర్కవుట్ అవ్వాలని కోరుకుంటున్నా. పొలిటికల్ నాలెడ్జ్ రూరల్ యూత్‌కు ఎక్కువగా ఉంటుంది. అలాంటి ఫ్లేవర్ ఈ సినిమాలో తీసుకొచ్చాడు అభయ్' అని హీరో విశ్వక్ సేన్ చెప్పారు.

అద్భుతమైన యాక్షన్ సినిమా



సిల్వెస్టర్ స్టాలోన్, జాసన్ స్టాథమ్

యాక్షన్ స్టార్ సిల్వెస్టర్ స్టాలోన్ ప్రధాన పాత్ర పోషించిన ఎక్స్‌పెండబుల్స్-4 విడుదలకు సిద్ధమైంది. ఈ ఎక్స్‌పెండబుల్ సిరీస్ డేవిడ్ కల్లాహం సృష్టించిన పాత్రల ఆధారంగా, అలాగే స్పెన్సర్ కోహెన్, విమ్మర్, డాగర్‌హర్ట్ కథ ఆధారంగా, కర్ట్ విమ్మర్, టాడ్ డాగర్‌హర్ట్, మాక్స్ ఆడమ్స్ స్క్రీన్ ప్లే నుండి స్కాట్ వా దర్శకత్వం వహించిన అమెరికన్ యాక్షన్ చిత్రమిది. ఇది 'ది ఎక్స్‌పెండబుల్స్ 3'కి సీక్వెల్. ఈ సినిమా ఇంగ్లీష్, తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఈనెల 22న విడుదల కానుందని పివిఆర్ పిక్చర్స్ తెలియజేసింది. ఈ చిత్రానికి మల్టీవిజన్ మల్టీమీడియా ఇండియా ప్రై. లిమిటెడ్ సమర్పణ.

యుఎస్ఎ, రష్యా మధ్య యుద్ధాన్ని నివారించడానికి, డేర్-డెవిల్ ది ఎక్స్‌పెండబుల్స్ జట్టు- నిరోధించే అద్భుతమైన మిషన్‌తో ఈ చిత్రం సాగుతుంది. సుర్తో రహ్మత్ (ఇకో ఉవైస్) నేతృత్వంలోని ఉగ్రవాద సంస్థ లిబియాలోని రసాయనాల కర్మాగారం నుండి అణు క్షిపణి డిటోనేటర్లు ధనికులకు అమ్ముతారు. రెండు సూపర్ పవర్స్, ఎక్స్‌పెండబుల్స్ బృందం రంగంలోకి దిగి ముందుకు సాగుతుంది. సిల్వెస్టర్ స్టాలోన్, జాసన్ స్టాథమ్, డాల్ఫ్ లండ్‌గ్రెన్, మేగాన్ ఫాక్స్, జాక్సన్, టోనీ జా, ఐకో ఉవైస్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ-టిమ్ మారిస్-జోన్స్, సంగీతం-గ్విలేమ్ రౌసెల్.

మహిళలకు స్పెషల్ షో



అనుష్క

నవీన్ పొలిశెట్టి, అనుష్క జంటగా నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ సినిమా రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులు, స్టార్ హీరోలు, హీరోయిన్స్, డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ నుంచి ప్రశంసల్ని, విమర్శకుల నుంచి అభినందనల్ని అందుకుందీ చిత్రం. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్టడీ కలెక్షన్స్ సాధిస్తూ, యూఎస్‌లో వన్ మిలియన్ మార్క్ అందుకుందీ సినిమా.

తమ సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, సినీ ప్రియులకు, ఇండస్ట్రీ సెలబ్రిటీస్‌కు కథానాయిక అనుష్క కృతజ్ఞతలు తెలిపారు. ఈ గురువారం ఏపీ, తెలంగాణలోని మహిళల కోసం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' స్పెషల్ షో ప్రదర్శించబోతున్నారు. ఈ నేపథ్యంలో అనుష్క మాట్లాడుతూ, 'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్నందుకు థ్యాంక్స్. మీ మెసేజెస్, ట్వీట్స్, ప్రేమ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ గురువారం ఏపీ, తెలంగాణలోని థియేటర్స్‌లో లేడీస్ కోసం మా మూవీ స్పెషల్ షో ప్రదర్శిస్తున్నాం. మీ ఇంట్లో చిన్నవాళ్లను, పెద్ద వాళ్లను ఈ స్పెషల్ షోకు తీసుకువెళ్లండి. మీ రెస్పాన్స్ కోసం వేచి చూస్తుంటాను' అని చెప్పారు.

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతో ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మాణంలో దర్శకుడు మహేష్ బాబు.పి తెరకెక్కించారు.

కుటుంబమంతా హాయిగా నవ్వుకుంటారు



కార్తీక్ రత్నం

కథానాయకుడు రవితేజ ప్రొడక్షన్ బ్యానర్ ఆర్‌టి టీమ్ వర్క్స్‌లో వస్తున్న మరో కాన్సెప్ట్ బేస్డ్ చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. సతీష్ వర్మ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మించారు. కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటించారు. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రం ఈనెల 15న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరో కార్తీక్ రత్నం మీడియాతో మాట్లాడుతూ, 'ఇది హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. కామెడీ, థ్రిల్, యాక్షన్ అన్నీ ఉంటాయి. కుటుంబం అంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా చూడదగ్గ చిత్రం. చాలా నవ్విస్తుంది. రంగురాళ్ళ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. ఇందులో ఓ నాలుగు గ్యాంగ్‌లు ఉంటాయి.

దాదాపు సినిమా అంతా గ్యాంగ్‌ల ఛేజింగ్, ఆ ఛేజింగ్‌లో కూడా కామెడీ ఉండటం ప్రత్యేకత. ఇందులో ఒక జర్మన్ షెఫర్డ్ డాగ్ ఉంటుంది. దానికి సునీల్ వాయిస్ ఇచ్చారు. అది ఈ పాత్రలపై ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తుంది అనేది కూడా బాగుంటుంది. దర్శకుడు సతీష్‌వర్మ ఈ కథ చెప్పినప్పుడు ఎంత థ్రిల్ అయ్యానో, ఈ సినిమాని రవితేజ నిర్మిస్తున్నారని చెప్పగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. రవితేజ సినిమా చూశారు. ఆయనకు చాలా బాగా నచ్చింది. నేను చేసిన బంగారురాజు పాత్రతోపాటు నాది వెరైటీ టైమింగ్ అని రవితేజ మెచ్చుకున్నారు. ప్రస్తుతం నేను చేసిన 'శ్రీరంగనీతులు' విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రకాష్‌రాజ్, ఎఎల్ విజయ్ కలిసి ఒక సినిమా నిర్మిస్తున్నారు.

అక్టోబర్ 6న రిలీజ్



నేహా శెట్టి, కిరణ్ అబ్బవరం

నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి నిర్మిస్తున్న చిత్రం 'రూల్స్ రంజన్'. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రత్నం కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదలైన చిత్ర ట్రైలర్ ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తింది. 'రూల్స్ రంజన్' నుంచి విడుదల అవుతున్న ప్రతీ ప్రచార చిత్రం సినిమా చూడాలనే ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. పూర్తి స్థాయి వినోద భరితంగా రూపొందుతోన్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 6న థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు. చిత్ర కథ, దానికి అనుగుణంగా సాగే సన్నివేశాలు, వాటికి తగ్గట్టుగా సంభాషణలు, వీటన్నింటినీ స్థాయిని పెంచే రీతిలో నేపథ్య సంగీతం, సందర్భానుసారంగా సాగే పాటలు అమితంగా ఆకట్టుకుంటాయన్నారు.

మాయ పాత్రలో అలరిస్తా



అవంతిక మిశ్రా

'మాయ, వైశాఖం, మీకు మాత్రమే చెప్తా' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ అవంతిక మిశ్రా. ఆమె కీలక పాత్రలో నటిస్తున్న వెబ్ సిరీస్ 'అతిథి'. వేణు తొట్టెంపూడి హీరోగా నటిస్తున్న ఈ వెబ్ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ స్పెషల్స్‌గా రాబోతోంది. ఈ వెబ్ సిరీస్‌ను రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ రూపొందించారు. దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో నాయిక అవంతిక మిశ్రా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకుంది.

ఇందులో నేను మాయ అనే డిఫరెంట్ పాత్ర చేశా. ఒక అందమైన అమ్మాయిగా, ఆ తర్వాత దెయ్యంగా కనిపిస్తా. ఆమె ఒక మిస్టీరియస్ ఉమెన్. అలాగే నా క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఇందులో థ్రిల్లర్, ఫాంటసీ, హర్రర్ జోనర్స్ కలిసి ఉంటాయి. ఇవన్నీ కథలో నెక్ట్ ఏం జరుగుతుంది అనే ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తాయి. వేణుతో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. ప్రస్తుతం నేను 'గోలీసోడా' అనే మరో వెబ్ సిరీస్ చేస్తున్నాను. అలాగే నేను చేసిన మూడు తమిళ చిత్రాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి.

నింగినై నిన్ను చూస్తుంటా..

అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రాక్షస కావ్యం'. ఈ చిత్రాన్ని గరుడ ప్రొడక్షన్స్, పింగో పిక్చర్స్, సినీ వ్యాలీ మూవీస్ బ్యానర్స్‌లో దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మిస్తున్నారు. నవీన్ రెడ్డి, వసుందర దేవి సహ నిర్మాతలు. ఉమేష్ చిక్కు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. శ్రీమాన్ కీర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబర్ 6న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'అమ్మ పాట..' లిరికల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. మిట్టపల్లి సురేందర్ సాహిత్యం అందించిన ఈ పాటకు రాజీవ్ రాజ్, శ్రీకాంత్ ఎం ట్యూన్ కంపోజ్ చేయగా, శివాని సీహెచ్ పాడారు. 'నింగినై నిన్ను చూస్తుంటా.. నేలనై నిన్నుమోస్తుంటా..' అంటూ బిడ్డలపై అమ్మ చూపే ప్రేమను వర్ణిస్తూ సాగుతుందీ పాట. అమ్మ గొప్పదనాన్ని తన సాహిత్యంలో మిట్టపల్లి సురేందర్ ఆవిష్కరించగా..ఫ్లెజంట్ ట్యూన్‌లో హృదయానికి హత్తుకునేలా శివాని సీహెచ్ పాడారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886